ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698



తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

Estd : 2002

# జనంసాక్షి

www.janamsakshi.org

ఆదివారం 28.09.2025 | సంపుటి :12 సంచిక : 70 | పేజీలు :12 వెల : రూ. 4/-

RNI NO.TELTEL / 2013 /50370









### పారా ఆర్చరీలో చరిత్ర సృష్టించిన

# శీతల్‌దేవి

ప్రపంచ ఛాంపియన్ షిప్‌లో కౌంపౌండ్ వ్యక్తిగత విభాగంలో స్వర్ణం కైవసం

**సియోల్(జనంసాక్షి):** దక్షిణ కొరియాలో జరుగుతున్న పారా ఆర్చరీ ప్రపంచ ఛాంపియన్ షిప్‌లో కౌంపౌండ్ వ్యక్తిగత విభాగంలో స్వర్ణం సాధించి 18 ఏళ్ల శీతల్ చరిత్ర సృష్టించింది. ఫైనల్‌లో తుర్కియేకు చెందిన వరల్డ్ నెం.1 ఓజ్నూర్ క్యూర్ గిర్డిపై 146-143 తేడాతో విజయం సాధించి, స్వర్ణాన్ని సొంతం చేసుకుంది. అలాగే పురుషుల విభాగంలో మిగతా 2లో..



### విజయ్ ప్రచార సభలో

# తొక్కిసలాట

- 31 మంది మృతి!
- మరికొందరి పరిస్థితి విషమం
- ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ దిగ్భ్రాంతి

**చెన్నై(జనంసాక్షి):** తమిళగ వెట్రి కళగం అధ్యక్షుడు విజయ్ ప్రచార సభలో తీవ్ర తొక్కిసలాట చోటుచేసుకుం ది. కరూర్‌లో జరిగిన ఘటనలో ఇప్పటి వరకు 31 మం ది మృతి చెందినట్టు సమాచారం. మరికొందరి పరిస్థితి విషమంగా ఉన్నట్టు తెలుస్తోంది. వీరిలో పార్టీ కార్యకర్తల తోపాటు చిన్నారులు కూడా ఉన్నారు. కరూర్‌లో విజయ్ నిర్వహించిన ప్రచార సభకు మిగతా 9లో..




# తెలంగాణ మోడల్ సృష్టించాలి

### 19 నెలల్లో గ్రూపు-1 నియామకాలు పూర్తి చేసి రికార్డు సృష్టించాం

- గత పాలకులు ఒక్కో పోస్టును రూ.3 కోట్లకు అమ్ముకున్నారు
- నాడు నోటిఫికేషన్ పూర్తికావడానికి ఏడేళ్లు పట్టింది
- బీఆర్ఎస్‌కు విశ్వాసంతో ప్రజలు అధికారమిస్తే.. విశ్వాసఘాతకులుగా మారారు
- పదేళ్లలో గ్రూప్-1 నిర్వహించలేదంటే.. అంతకంటే నిర్లక్ష్యం ఏముంటుంది?
- శిల్పకళా వేదికలో గ్రూప్-1 విజేతలకు నియామక పత్రాలు అందించిన సీఎం రేవంత్ రెడ్డి
- ఉద్యోగ నోటిఫికేషన్లు వస్తూనే ఉంటాయి: భట్టి

**హైదరాబాద్(జనంసాక్షి):** తెలంగాణ గడ్డకు ఓ చరిత్ర, పౌరుషం ఉన్నాయని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. కాలం కలిసి వచ్చి గెలిస్తే గత పాలకులు తాము కారణజన్ములం అనుకున్నారని, విశ్వాసంతో ప్రజలు అధికారమిస్తే.. విశ్వాసఘాతకులుగా మారారని మండిపడ్డారు. శిల్పకళా వేదికలో నిర్వహించిన కార్యక్రమంలో గ్రూప్-1 విజేతలకు సీఎం చేతుల మీదుగా నియామక పత్రాలు అందజేశారు. 3 లక్షల మందితో పోటీ పడి... 562 మందిలో ఒకరిగా మీరంతా నిలిచారని విజేతలను కొనియాడారు. మీరే తెలంగాణ భవిష్యత్ అన్నారు. "మీరు తెలంగాణ కుటుంబంలో భాగస్వాములు. ఎందరో తెలంగాణ వీరులు మిగతా 2లో..



### తెలంగాణ పెట్టుబడులకు

# గమ్యస్థానం

- హైదరాబాద్ ఓల్డ్ సిటీ కాదు.. ఒరిజినల్ సిటీ
- ఎన్నో పర్యాటక కేంద్రాలు ఉన్నాయి
- టెంపుల్ టూరిజాన్ని మరింతగా ప్రోత్సహిస్తున్నాం
- శాంతిభద్రతల విషయంలోనూ ముందున్నాం
- ప్రపంచ నగరాలతో పోటీపడుతున్న హైదరాబాద్
- టూరిజం కాంక్లేవ్‌లో సీఎం రేవంత్ రెడ్డి వెల్లడి
- పర్యాటకులకు తెలంగాణ స్వర్గసీమ : భట్టి

# సాంకేతిక నైపుణ్యంతోనే ఉద్యోగావకాశాలు

- ఇంగ్లీష్ ఒక్కటే ఉంటే ఉద్యోగం రాదు
- యువతలో స్కిల్స్ కోసమే టాటా కన్సల్టెన్సీతో చర్చలు
- వారి సహకారంతోనే ఏటీసీ సెంటర్లు ఏర్పాటు
- స్కిల్ ఉంటే జపాన్, జర్మనీల్లో ఉద్యోగావకాశాలు
- మల్లేపల్లి ఏటీసీ సెంటర్ ప్రారంభోత్సవంలో సీఎం



2లో..



# బీసీ రిజర్వేషన్‌పై హైకోర్టులో పిటిషన్

- అక్టోబర్ 8కి వాయిదా వేసిన ధర్మాసనం
- నోటిఫికేషన్ ఇచ్చినా మెరిట్ ఆధారంగా విచారిస్తామని వెల్లడి

**హైదరాబాద్(జనంసాక్షి):** బీసీ రిజర్వేషన్ల అంశంలో చట్టప్రకారమే ముందుకెళ్లాలని తెలంగాణ హైకోర్టు వ్యాఖ్యానించింది. బీసీలకు 42శాతం రిజర్వేషన్ల జీవోను కొట్టివేయాలని కోరుతూ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా మూడుచింతలపల్లి మండలం కేశవాపూర్ గ్రామానికి చెందిన బుట్టెంగారి మాధవరెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ అభినందన్ కుమార్, జస్టిస్ విజయ్‌సేన్‌రెడ్డి నేతృత్వంలోని ధర్మాసనం శనివారం విచారణ చేపట్టింది. బీసీ రిజర్వేషన్లను 27 నుంచి 42 శాతానికి పెంచారని, దీంతో మొత్తం రిజర్వేషన్ల పరిమితి 60శాతానికి పైగా దాటిందని పిటిషనర్ తెలిపారు. రాజ్యాంగంలో 50శాతం రిజర్వేషన్లు దాటకూడదనే నిబంధన ఉందని పేర్కొన్నారు. పంచాయతీరాజ్ చట్టం ప్రకారం రిజర్వేషన్లు 50శాతమే ఉండాలని ధర్మాసనం దృష్టికి తెచ్చారు. నూతన జీవో వల్ల రిజర్వేషన్ల పరిమితి 67 శాతానికి చేరిందన్నారు. బీసీ మిగతా 2లో..

# ఫ్రెండ్లీ పోలీసింగ్‌తో ముందుకు వెళతా..

- డ్రగ్స్,సైబర్ క్రైమ్ నిర్మూలనకు మరింత కృషి
- నగర ట్రాఫిక్ కంట్రోల్‌కు సమన్వయంతో కృషి
- నూతన డీజీపీగా నియమితులైన శివధర్ రెడ్డి



**హైదరాబాద్(జనంసాక్షి):** ప్రజల పక్షానే తాము ఉంటామని.. ఫ్రెండ్లీ పోలీసింగ్ అమలు చేస్తామని తెలంగాణ రాష్ట్ర నూతన డీజీపీగా నియమితులైన శివధర్ రెడ్డి పేర్కొన్నారు. హైదరాబాద్‌లో ట్రాఫిక్ నియంత్రణ కోసం అన్ని శాఖల అధికారులతో కోఆర్డినేషన్ చేసుకుంటూ ముందుకు వెళ్తామని తెలిపారు. రాష్ట్రంలో మహిళల భద్రతకు పెద్దపీట వేస్తామని అన్నారు. సైబర్ నేరాలపై తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో కృషి చేస్తోందని వెల్లడిం చారు. ప్రజలకు, పోలీసులకు మధ్య సంబంధాలను పెంపొందించడానికి ప్రయత్నిస్తామని తెలిపారు. ప్రజలకు చట్టాలపై అవగాహన కల్పించే ప్రయత్నం చేస్తామని డీజీపీ శివధర్ రెడ్డి పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర నూతన డీజీపీగా శివధర్ రెడ్డిని ప్రభుత్వం నియమించింది. ఈ సందర్భంగా డీజీపీగా అవకాశం ఇచ్చినందుకు తెలంగాణ ప్రభుత్వానికి శివధర్ రెడ్డి ధన్యవాదాలు తెలిపారు. తనకు ఇచ్చిన ఈ అవకాశాన్ని సమర్థవంతంగా నిర్వహిస్తానని ఉద్ఘాటించారు. ఇంటెలిజెన్స్‌లో ఎస్పీ స్థాయి నుంచి డీజీ స్థాయి దాకా పనిచేశానని.. తెలంగాణ రాష్ట్రంపై తనకు పూర్తి అవగాహన ఉందని వ్యాఖ్యానించారు. పోలీస్ విభాగంలో అందరూ బాధ్యతాయుతంగా పనిచేయాలని మిగతా 2లో..

# మూసీకి పోటెత్తిన వరద

### పరిసర ప్రాంతాలు అతలాకుతలం • నీట మునిగిన ఎంజీబీఎస్ బస్టాండ్





- ప్రయాణప్రాంగణలోని ప్రయాణికులను సురక్షిత ప్రాంతాలకు తరలింపు
- పలు కాలనీలను ముంచెత్తిన వరద
- పరివాహకంలోని రోడ్లు, వంతెనలు, బస్తీలు జలదిగ్బంధం
- 13 అడుగుల మేర మూసీ బ్రిడ్జిలను తాకుతూ వరద ప్రవహం
- హైదరాబాద్-విజయవాడ మార్గంలో భారీగా ట్రాఫిక్ జామ్
- వరద ప్రాంతాల్లో హైడ్రా కమిషనర్ రంగనాథ్ పర్యటన
- తీర మార్గాలకు ప్రజలు దూరంగా ఉండాలని హెచ్చరిక
- ముంపు ప్రాంతాల్లోని వారికి డ్రోన్ ద్వారా ఆహారం పంపిణీ



**హైదరాబాద్(జనంసాక్షి):** మూసీ ఉగ్రరూపం దాల్చింది. మూసీ, ఈసీ నదుల ఉద్ధృతితో ఒక రోజు రికార్డు స్థాయిలో హైదరాబాద్ జంట జలాశయాలకు వరద పోటెత్తింది. ఇక్కడి నుంచి నీటిని విడుదల చేయడంతో పరివాహక బస్తీలు జలదిగ్బంధనంలో చిక్కుకున్నాయి. చాదర్‌ఘాట్, మూసారాం బాగ్ బ్రిడ్జి పైనుంచి పోటెత్తిన వరదతో రాకపోకలు నిలిచిపోయాయి. మహాత్మా గాంధీ బస్టాండ్‌ను చుట్టుముట్టిన వరదతో అధికారులు బస్సుల రాకపోకలు నిలిపివేశారు. హైదరాబాద్‌లో మహానగరంలో సన్నని పాయలా కనిపించే మూసీ ఉగ్రరూపం దాల్చింది. జంట జలాశయాల నుంచి మొదలు గౌరెల్లి వరకు ప్రవాహ ఉద్ధృతితో దర్శనమిచ్చింది. బాపూ ఘాట్ నుంచి జియాగూడ, మూసారాంబాగ్ వరకు వరద ప్రభావం తీవ్రంగా కనిపించింది. వికారాబాద్, తాండూరు, రంగారెడ్డి జిల్లా శివార్లలో కురిసిన కండపోత వానలకు మూసీ, ఈసీ నదులు ఉగ్రరూపం దాల్చాయి. దీంతో జంట జలాశయాల నుంచి విడుదల చేసిన నీటితో జియాగూడ నుంచి మంచిరేవుల-నార్సింగి మిగతా 2లో..

### ప్రజలను సురక్షిత ప్రాంతాలకు

# తరలించాలి

మూసీ పరీవాహకంలోని లోతట్టు ప్రాంతాల్లో అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలి

రాష్ట్రంలో వర్షాలు, మూసీకి వరదపై సహాయక చర్యలపై సీఎం రేవంత్ రెడ్డి సమీక్ష

**హైదరాబాద్(జనంసాక్షి):** రాష్ట్రంలో వర్షాలపై అధికారులను అడిగి సీఎం రేవంత్ రెడ్డి తెలుసుకున్నారు. మూసీ పరీవాహకంలోని లోతట్టు ప్రాంతాల్లో అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని అధికారులకు స్పష్టం మిగతా 2లో..



### హైదరాబాద్ పోలీస్ కమిషనర్‌గా

# సజ్జనార్

- హోంశాఖ ప్రత్యేకకార్యదర్శిగా సీవీ ఆనంద్
- ఆర్టీసీ ఎండిగా నాగిరెడ్డి నియామకం
- తెలంగాణలో పలువురు ఐపీఎస్‌ల బదిలీ

**హైదరాబాద్(జనంసాక్షి):** తెలంగాణలో భారీగా ఐపీఎస్, ఐఏఎస్ అధికారులను బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. తెలంగాణలో 23 మంది ఐపీఎస్ అధికారులను ప్రభుత్వం బదిలీ చేసింది. హైదరాబాద్ కమిషనర్‌గా సజ్జనార్‌ను..హోంశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా సీవీ ఆనంద్‌ను నియమించింది. ఆర్టీసీ ఎండిగా ఉన్న సజ్జన్నార్ తిరిగి నగర కమిషనర్‌గా నియమితులు అయ్యారు. విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీజీగా శిఖా గోయల్, ప్రస్తుతం సీఐడీ అదనపు డీజీగా ఉన్న చారుసిన్హాకు ఏసీబీ డీజీగా అదనపు బాధ్యతలు అప్పగించారు. స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ డీజీగా స్వాతిలక్రాకు అదనపు బాధ్యతలు అప్పగించారు. ఆర్టీసీ ఎండీగా నాగిరెడ్డి నియమితులయ్యారు. ఇంటెలిజెన్స్ డీజీగా విజయ్ కుమార్, పౌరసరఫరాల ప్రిన్సిపల్ సెక్రటరీగా స్టీఫెన్ రవీంద్ర, గ్రేహౌండ్స్ ఆక్టోపస్ అదనపు డిజీగా అనిల్ కుమార్, మల్టీజోన్ 2 ఐజీగా డీఎస్ చౌహన్, విపత్తు నిర్వహణ, ఫైర్ డీజీగా విక్రమ్ సింగ్ మాన్ హైదరాబాద్ నేర విభాగ అదనపు సీపీగా శ్రీనివాసులు, హైదరాబాద్ లా అండ్ ఆర్డర్ జాయింట్ కమిషనర్‌గా తఫ్సీర్ ఇక్బాల్, సిద్దిపేట కమిషనర్‌గా ఎస్.ఎమ్ విజయ్ కుమార్, ఏసీబీ జాయింట్ డైరెక్టర్‌గా సింధు శర్మ, నారాయణపేట ఎస్పీగా జి. వినీత్, ఎల్బీనగర్ డీసీపీగా బి. అనురాధ, ఏసీబీ జాయింట్ డైరెక్టర్‌గా సీహెచ్ ప్రవీణ్ కుమార్, రాజేంద్రనగర్ డీసీపీగా యోగేష్ గౌతమ్, వెస్ట్ జోన్ డీసీపీగా సీహెచ్ శ్రీనివాస్, మాదాపూర్ డీసీపీగా రితు రాజ్, సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ వైస్ ఛైర్మన్‌గా రవి గుప్తా నియమితులయ్యారు. తెలంగాణ డీజీపీగా ఇప్పటికే బత్తుల శివధర్‌రెడ్డిని ప్రభుత్వం నియమించింది. అయితే, రాజన్న సిరిసిల్ల కలెక్టర్ సందీప్ కుమార్ ఝా తీరు ఇటీవల వివాదాస్పదంగా మిగతా 2లో..

# సీఎం కుట్ర వల్లే ఎంజీబీఎస్ మునక

- వరద ప్రమాదం ఉన్నా వదలని జంటజలాశయాల నీరు
- ప్రజలను ఏమార్చిన కాంగ్రెస్ ప్రభుత్వం
- బాకీకార్డులను విడుదల చేసిన కేటీఆర్, హరీశ్‌రావు

**హైదరాబాద్(జనంసాక్షి):** సీఎం రేవంత్‌రెడ్డి పథకం ప్రకారమే ఎంజీబీఎస్‌ను ముంచారని భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఆరోపించారు. మూసీ ప్రాజెక్టు కోసమే సీఎం కిరాతకంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. హైదరాబాద్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. వరద హెచ్చరికలు ఉన్నా జలాశయాల నుంచి నీరు విడుదల చేయలేదని, ఉద్దేశపూర్వకంగానే జంట జలాశయాల నుంచి నీరు వదల్లేదని ఆక్షేపించారు. మూసీ ప్రాంత వాసులను భయపెట్టేందుకే మిగతా 2లో..




# స్థానిక ఎన్నికలపై ఈసీ కసరత్తు

### వివిధ అధికారులతో కమిషనర్ భేటీ

**హైదరాబాద్(జనంసాక్షి):** రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలకు నగారా త్వరలో మోగనుంది. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలు కోసం రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసిన నేపథ్యంలో ఎన్నికల నిర్వహణకు మార్గం సుగమమైంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులతో సమావేశం నిర్వహించి ఎన్నికల సన్నాహాల కోసం ఆదేశాలు ఇచ్చారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ఎన్నికల




సంఘం శనివారం వివిధ విభాగాల ఉన్నతాధికారులతో కీలక సమావేశం నిర్వహించింది. తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికలపై రాష్ట్ర ఎన్నికల మిగతా 2లో..

### సోనమ్ వాంగ్‌చుక్‌కు

# పాకిస్థాన్‌తో సంబంధాలు

ఆరోపణలపై దర్యాప్తు చేస్తున్నాం

డీజీపీ ఎస్‌డీ సింగ్ జామ్వాల్



2లో..

### సింధూ జలాల కట్టడి

# అంతర్జాతీయ ఉల్లంఘన

ఐక్యరాజ్యసమితిలో మరోసారి పాక్ ప్రేలాపనలు

గట్టిగా తిప్పికొట్టిన భారత్ ప్రతినిధి




2లో..

### టెలికాం రంగంలో భారత్

# మరింత వృద్ధి చెందుతోంది

బీఎస్ఎన్ఎల్ 'స్వదేశీ' 4జీ నెట్‌వర్క్‌ను ప్రారంభించిన ప్రధాని మోదీ



## తెలంగాణ పెట్టుబడులకు గమ్యస్థానం

**హైదరాబాద్(జనంసాక్షి):** తెలంగాణలో నూతన టూరిజం పాలసీ తీసుకొచ్చామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. హైదరాబాద్ శిల్పారామంలో ఏర్పాటు చేసిన వరల్డ్ టూరిజం డే మొదటి కాంక్లేవ్‌లో సీఎం పాల్గొని ప్రసంగించారు."గోల్కొండ, రామోజీ ఫిల్మ్‌సిటీ వంటి ప్రముఖ పర్యాటక ప్రాంతాలు హైదరాబాద్‌లో ఉన్నాయి. ఎకో, మెడికల్, హెల్త్ టెంపుల్ టూరిజాన్ని ప్రోత్సహించాలని నిర్ణయించాం. హైదరాబాద్ ఓల్డ్ సిటీ కాదు.. ఒరిజినల్ సిటీ. ఆపరేషన్ సిందూర్ సమయంలోనూ.. హైదరాబాద్‌లో ప్రపంచ సుందరీమణుల పోటీలు నిర్వహించి.. ఇది అత్యంత సురక్షితమైన నగరమని నిరూపించాం. హైదరాబాద్‌లో రక్షణ, శాంతిభద్రతల గురించి ఆలోచించాల్సిన అవసరం లేదు. శాంతిభద్రతల విషయంలో దేశంలోనే హైదరాబాద్ మొదటి స్థానంలో ఉందని కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. ప్రపంచ ప్రఖ్యాత నగరాలతో హైదరాబాద్ పోటీ పడుతోంది. తెలంగాణలో పెట్టుబడులు పెట్టండి.. మీకు అండగా ఉండటంతో పాటు, లాభాలను అందించే బాధ్యత రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటుంది" అని సీఎం అన్నారు. ఓవైపు కృష్ణ మరోవైపు గోదావరి రెండు జీవ నదుల మధ్య ఉన్న దక్కన్ పీఠభూమి, పర్యాటకులకు స్వర్గసీమ తెలంగాణ అని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. గలగల పారే జీవనదులు, ఆకుపచ్చని సౌందర్యంతో నిండిన సుందర అటవీ ప్రాంతాలు, హైదరాబాద్ పరిసర ప్రాంతాలతో పాటు ప్రపంచాన్ని తెలంగాణ పర్యాటక రంగం ఆకర్షిస్తుందని డిప్యూటీ సీఎం అన్నారు. ఎందుకనో గత పది సంవత్సరాలు పరిపాలించిన వారు ప్రపంచ పటంలో తెలంగాణ పర్యాటక ఔన్నత్యాన్ని నిలబెట్టడంలో నిర్లక్ష్యం చేశారు పర్యాటకులను ఆకర్షించకుండా గాలికి వదిలేసారని అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని యావత్ క్యాబినెట్ పర్యాటకులను ఆకర్షించేందుకు సకల ఏర్పాట్లు చేసి తెలంగాణ రైసింగ్ నినాదంతో దూసుకుపోతుంది అన్నారు. రాష్ట్రానికి పెద్ద ఎత్తున పెట్టుబడులు వస్తున్న, రాష్ట్రం అభివృద్ధి చెందుతున్న ఎందుకో పాపం రాష్ట్రంలోని కొందరు అభినందించాల్సింది పోయి ఆందోళన చెందుతున్నారని డిప్యూటీ సీఎం అన్నారు.

## సాంకేతిక నైపుణ్యంతోనే ఉద్యోగావకాశాలు

**హైదరాబాద్(జనంసాక్షి):** కేవలం సాఫ్ట్‌వేర్ కోర్సులతోనే విదేశాల్లో ఉద్యోగాలు వస్తాయని అనుకోవద్దని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఏటీసీలో శిక్షణ పొంది జర్మనీలో నెలకు రూ.3.50 లక్షలు జీతం వచ్చే ఉద్యోగాలు పొందిన వారు ఉన్నారు. చదువు, సాంకేతిక నైపుణ్యం మాత్రమే మన తలరాతను మారుస్తాయి. సాంకేతిక నైపుణ్యం లేకపోతే ఈరోజుల్లో దేనికి కొరగాని పరిస్థితి. గంజాయి కేసుల్లో అధికంగా ఇంజినీరింగ్ విద్యార్థులే దొరకడం దురదృష్టకరం. గంజాయికి బానిసలై తల్లిదండ్రులకు క్షోభ కలిగించవద్దని రేవంత్‌రెడ్డి సూచించారు. హైదరాబాద్ నగరంలోని మల్లెపల్లి ఐటీఐ ప్రాంగణంలో అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్‌ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో 65 ఏటీసీలను వర్చువల్‌గా ప్రారంభింప చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఐటీఐలను ఏటీసీలుగా ప్రభుత్వం మార్చింది.. చదవుతో పాటు– విద్యార్థులకు సాంకేతిక నైపుణ్యం నేర్పించాలి అన్నారు. స్టూడెంట్స్‌కు చదువుతో పాటు– నైపుణ్యం కూడా అవసరం.. యువతలో నైపుణ్యాలు పెంపు కోసం టాటా సంస్థతో చర్చలు జరిపామని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. నైపుణ్యల కోసమే ఐటీఐలను అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లుగా మార్చామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. రూ. 2,400 కోట్ల ఖర్చు పెట్టి ఏటీసీలను అందుబాటులోకి తెచ్చాం.. సంకల్పం ఉంటే సాధ్యం కానిదంటూ ఏమీ లేదు.. టాటా సహకారంతో ఏటీ–సీలను అభివృద్ధి చేశామన్నారు. సరైన స్కిల్ ఉన్న ఉద్యోగులు దొరకడం లేదని ఆటోమొబైల్ వ్యాపారులు నాతో చెప్పారు.. త్వరలోనే మరో 53 ఏటీసీలను ఏర్పాటు చేస్తున్నామన్నారు.

# తెలంగాణ మోడల్ సృష్టించాలి



పోరాట స్ఫూర్తిని చాటారు. పదేళ్లలో గ్రూప్–1 నిర్వహించలేదంటే.. అంతకంటే నిర్లక్ష్యం ఉంటుందా? శ్రీకాంతాచారి సహా ఎందరో యువకులు ప్రాణత్యాగం చేసింది దేనికోసం? గతంలో ప్రశ్నాపత్రాలను పల్లీ బఠాణీల్లా జిరాక్స్ సెంటర్లలో అమ్మారు. టీజీపీఎస్సీ రాజకీయ పునరావాస కేంద్రం కాదు.. తెలంగాణ పునర్నిర్మాణ కేంద్రం. నియామకాలు ఆపేందుకు కొందరు ఎన్నో ప్రయత్నాలు చేశారు. ఒక్కో గ్రూప్–1 పోస్టును రూ.3 కోట్లకు అమ్ముకున్నారని ఆరోపించారు. గత గ్రూప్–1 నోటిఫికేషన్ పూర్తికావడానికి ఏడేళ్లు పట్టింది. కానీ, కాంగ్రెస్ ప్రభుత్వం 19 నెలల్లో గ్రూప్–1 నియామకాలు పూర్తి చేయడం ఒక రికార్డు. మహారాష్ట్ర, గుజరాత్ మోడల్ కాదు.. తెలంగాణ మోడల్ సృష్టించాలి" అని రేవంత్‌రెడ్డి అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత టీజీపీఎస్సీని ప్రక్షాళన చేశామని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. కూలీలు, పారిశుద్ధ్య కార్మికుల పిల్లలు అనేకమంది గ్రూప్ 1 సాధించారని అన్నారు. "గ్రూప్–1 విజేతలు కొత్త జీవితం ప్రారంభించబోతున్నారు. రాబోయే 30–35 ఏళ్లు రాష్ట్ర ప్రగతిలో మీరు కీలకపాత్ర పోషించబోతున్నారు. గత ప్రభుత్వం పదేళ్లుగా గ్రూప్–1 నోటిఫికేషన్ ఇవ్వలేదు. ఇప్పటికే 60 వేల ఉద్యోగాలు ఇచ్చాం. ఆది ఆరంభం మాత్రమే. ఉద్యోగ నోటిఫికేషన్లు నిరంతరం వస్తూనే ఉంటాయి. కొందరికి చెంపదెబ్బ కొట్టినట్లుగా ఈ కార్యక్రమం ఉంది. ఎవరి దయాదాక్షిణ్యాలతోనో మీరు విజేతలు కాలేదు. మీ విజయాలను కూడా అపహాస్యం చేసే ప్రయత్నం గత పాలకులు చేశారు" అని భట్టి విక్రమార్క అన్నారు.

తెలంగాణ రెపరెపలాడాలి, రైజింగ్ కావాలి: భట్టి

అనేక సవాళ్లు, ఆర్థిక ఇబ్బందులు ఎదురవుతున్నప్పటికిని రాష్ట్రాన్ని అజేయంగా నిలబడటానికి, తెలంగాణ రెపరెపలాడటానికి రైజింగ్ రావడానికి తమ ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు బట్టి విక్రమార్క అన్నారు. శనివారం హైదరాబాదులో జరిగిన కొలువుల పండుగ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఉమ్మడి రాష్ట్రంలో సైతం 40 ఏళ్ల పాటు ఇంత పెద్ద ఎత్తున పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఆధ్వర్యంలో నియామకాలు జరిగిన దాఖలాలు లేవని తమ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత 562 మందికి ఏకకాలంలో నియామక పత్రాలు అందజేయడం ఎంతో గర్వకారణం అన్నారు. ప్రత్యేక రాష్ట్రం సాధన కోసం నిరుద్యోగ యువత ఉరికంబాలు ఎక్కార ని, అగ్నికి ఆహుతి అయ్యారని, నాడు యువత చేసిన పోరాటం త్యాగాలను చూసి పార్లమెంట్లో బలం లేకున్నప్పటికిని సోనియాగాంధీ అన్ని పార్టీలను కలుపుకొని తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చిందని గుర్తు చేశారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత దశాబ్ద కాలం పాటు ఈ ఉద్యోగాల కోసమైతే నిరుద్యోగులు పోరాటం చేశారో, ఆ ఉద్యోగాల ప్రస్తావన ఆనాటి పాలకులు తీసుకురాలేదని, గ్రూప్ పరీక్షల నిర్వహణ గురించి ఆలోచన చేయలేదని విమర్శించారు. కేవలం అప్పటి ప్రభుత్వ పెద్దలు వారు వారి కుటుంబ సంక్షేమం కోసమే పాకులాడారు తప్ప నిరుద్యోగుల గురించి పట్టించుకోలేదన్నారు. రాష్ట్రం కోసం రాష్ట్ర సాధన కోసం త్యాగం చేసిన వారి గురించి ఆలోచించకుండా అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వ పెద్దలు వారి కుటుంబం కోసం రాష్ట్రాన్ని తాకట్టు పెట్టారని ధ్వజమెత్తారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తనతో అనేకసార్లు పబ్లిక్ సర్వీస్ కమిషన్ ప్రక్షాళన గురించి చర్చించారని, ఎంత ఖర్చైనా వెనకాడకుండా కమిషన్ ప్రక్షాళన చేసి రిక్రూట్మెంట్ కోసం తమ ప్రభుత్వం నిధులను మంజూరు చేసిందని తెలిపారు. ప్రిలిమినరీ పరీక్ష నుంచి మొదలుకొని ని యామకాల పత్రాలు అందజేసే వరకు ప్రభుత్వం నిరంతర పర్యవేక్షణ చేసిందన్నారు. ఈ గ్రూపు వన్ పరీక్షలలో వ్యవసాయ కూలీ బిడ్డ నుంచి మొదలుకొని, పంచర్లు చేసే కుటుంబానికి చెందిన బిడ్డ ఉన్నత అధికారులు గా నియమించబడటం తమను, తమ క్యాబినెట్ ఎంతో ఆనంద భరితానికి గురి చేస్తుందని, గుండె లోతుల్లో నుంచి ఎంతో ఆనందం కలిగిస్తుందని పేర్కొన్నారు. దీని కోసమే కదా ఆనాటి యువత ప్రత్యేక రాష్ట్రం కోసం పోరాడి రాష్ట్రాన్ని సాధించిందని అన్నారు. రూ. 22,500 కోట్లతో లక్షలాది ఇందిరమ్మ ఇండ్లను నిర్మించి పేదవారి కలలు నెరవేరుస్తున్నామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం రాష్ట్ర ప్రజలను ఆత్మగౌరవంతో నిలబెట్టడమే న నీ అన్నారు. యువత మేధాశక్తిని ఉపయోగించడానికి కాంగ్రెస్ ప్రభుత్వం ఎంతగానో కృషి చేస్తుందని అన్నారు. ప్రపంచంతో పోటీపడే స్థాయికి యువతనువా రి మేధ శక్తిని తీసుకువెళ్తామన్నారు. రాష్ట్రంలోని వనరులను మానవ వనరు లను సానబెట్టి ప్రపంచానికి అందిస్తామన్నారు. విద్యతోనే ఆయా కుటుంబాలు రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని, దీన్ని దృష్టిలో ఉంచుకునే రాష్ట్ర ప్రభుత్వం విద్యకు ప్రాముఖ్యత ఇచ్చి కోట్లాది రూపాయలను విద్యారంగం కోసం ఖర్చు చేస్తుందన్నారు. ఆనాటి పాలకులు అనేక విధాలుగా అవహేళన చేస్తూ, రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధిని రాక్షసుల్లాగా అడ్డుపడే ప్రయత్నాలు చేస్తున్నప్పటికీ రాష్ట్ర అభివృద్ధి లక్ష్యంగా ఓ సంకల్పంతో ముందుకు సాగుతున్నామన్నారు.

## పారా ఆర్చరీలో చరిత్ర సృష్టించిన శీతల్‌దేవి

తోమన్ కుమార్ విజేతగా నిలిచాడు.అంతకు ముందు శీతల్, తోమన్ కుమార్‌తో కలిసి కాంపౌండ్ ఈవెంట్లో మిక్స్‌డ్ టీమ్ విభాగంలో కాంస్య పతకం గెలుచుకుంది. గ్రేట్ బ్రిటన్‌కు చెందిన జోడీ గ్రిన్‌హామ్, నాథన్ మాక్‌క్వీన్‌లను 152– 149 తేడాతో ఓడించారు. కాంపౌండ్ మహిళల ఓపెన్ టీమ్ ఈవెంట్‌లో, ఫైనల్‌లో తుర్కియే చేతిలో ఓడిపోయిన తర్వాత శీతల్, సరిత రజతంతో సరిపెట్టుకున్నారు. అలాగే రాకేశ్ కుమార్ కాంపౌండ్ మెన్స్ విభాగం ఫైనల్‌లో 40–20 తేడాతో ఓడిపోయాడు. సాంకేతిక కారణాలతో అతడు వైదొలగాల్సి రావడంతో తోమన్ కాంపౌండ్ పురుషుల టైటిల్‌ను కైవసం చేసుకున్నాడు. పారిస్ పారా ఒలింపిక్స్‌లో కాంస్య పతక విజేత రాకేశ్ నాలుగు షాట్స్ అనంతరం తన విల్లులో సమస్యతో పోటీ నుంచి వైదొలిగాడు. దీంతో తోమన్ నాలుగు సార్లు సరిగ్గా లక్ష్యాన్ని ఛేదించి ఈ విభాగంలో వరల్డ్ ఛాంపియన్ షిప్‌ను కైవసం చేసుకున్నాడు.

## బీసీ రిజర్వేషన్‌పై హైకోర్టులో పిటిషన్

రిజర్వేషన్లు 35 శాతం పెంచుతూ 2018లో జీవో ఇచ్చారని తెలిపారు. 2018లో ఇచ్చిన జీవోను ఇదే హైకోర్టు డివిజన్ బెంచ్ కొట్టివేసిందన్నారు. తమిళనాడులో రిజర్వేషన్లు 69శాతానికి పెంచారు కదా? అని ఈ సందర్భంగా హైకోర్టు ప్రశ్నించింది. తొమ్మిదో షెడ్యూల్లో పెట్టి రిజర్వేషన్ పెంచారని, ప్రస్తుతం అది సుప్రీంకోర్టులో విచారణలో ఉందని పిటిషనర్ తరపు న్యాయవాది హైకోర్టుకు తెలిపారు. పంచాయతీరాజ్ చట్టంలోని 285ఏ సవరిస్తూ తెలంగాణ అసెంబ్లీలో తీర్మానం చేశారని, అసెంబ్లీ తీర్మానం ప్రస్తుతం గవర్నర్ వద్ద పెండింగ్‌లో ఉందన్నారు. పెండింగ్‌లో ఉన్న అంశంపై జీవో ఎలా జారీ చేస్తారని హైకోర్టు.. ఏజీని ప్రశ్నించింది. ప్రభుత్వం నిర్ణయం చెప్పేందుకు రెండ్రోజుల సమయం కావాలని ఏజీ కోరగా.. హైకోర్టు అనుమతిచ్చింది. అక్టోబరు 6 వరకు ఎన్నికల నోటిఫికేషన్ ఇవ్వకుండా ఉంటారా? అని.. ఎన్నికల కమిషన్ తరపు న్యాయవాదిని హైకోర్టు ప్రశ్నించింది. ఎన్నికల నోటిఫికేషన్ ఇచ్చినా మెరిట్ ఆధారంగా విచారిస్తామని ధర్మాసనం స్పష్టం చేసింది. తదుపరి విచారణను అక్టోబరు 8కి వాయిదా వేసింది.

## సింధూ జలాల కట్టడి అంతర్జాతీయ ఉల్లంఘన

న్యూఢిల్లీ(జనంసాక్షి):ఐక్యరాజ్యసమితి వేదికగా దాయాది పాకిస్థాన్‌కు భారత్ మరోసారి గట్టిగా బదులిచ్చింది. న్యూయార్క్‌లో జరిగిన ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ లో పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ సంగిస్తూ.. ఈ ఏడాది ప్రారంభంలో భారత్ నుంచి ప్రేరేపిత దాడిని ఎదుర్కొన్నామంటూ వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా ఆపరేషన్ సిందూర్ గురించి, భారత్ సింధు జలాల ఒప్పందం నిలిపి వేయడంపై ప్రస్తావించారు. తమ సైన్యం అద్భుతమైన నైపుణ్యం, ధైర్యం, చతురతతో భారత్ దాడిని తిప్పికొట్టాయంటూ చెప్పుకొచ్చారు. భారత్ సింధు జలాల ఒప్పందం నిలిపివేయడాన్ని యుద్ధ చర్యగా అభివర్ణించారు. ఆయన వ్యాఖ్యలను భారత్ తిప్పికొట్టింది. ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తున్న పాక్.. అంతర్జాతీయ వేదికలపై అబద్ధాలు చెబుతోందని పేర్కొంది. పాక్ ప్రధాని వ్యాఖ్యలపై భారత దౌత్యవేత్త పేటల్ గ్లహోత్ స్పందిస్తూ.. తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. 'ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తోన్న పాక్.. అంతర్జాతీయ వేదికలపై అబద్ధాలు చెప్పడానికి సిగ్గుపడదు. అయితే, ఏ స్థాయిలోనూ వాస్తవాలను వారి అబద్ధాలు దాచలేవు. ఆ దేశం ఉగ్రవాదాన్ని ప్రోత్సహించడంలో మునిగిపోయింది. ఉగ్రవాదంపై యుద్ధంలో భాగస్వామిగా నటిస్తూనే.. ఒక దశాబ్దం పాటూ ఒసామా బిన్ లాడెన్‌కు ఆశ్రయం కల్పించింది' అంటూ వ్యాఖ్యానించారు. పాక్ ప్రాయోజిత ఉగ్రవాద సంస్థ ది రెసిస్టెన్స్ ఫ్రంట్ జమ్ము కశ్మీర్‌లో ఊచకోతకు పాల్పడింది. ఉగ్రదాడికి వ్యతిరేకంగా భారత్ ఆపరేషన్ సిందూర్ చేపట్టింది. మే 10న యుద్ధం ముగించాలంటూ పాక్ సైన్యమే భారత్‌ను వేడుకుంది. కానీ వాళ్లు (పాక్‌ను ఉద్దేశిస్తూ) మేము యుద్ధంలో గెలిచాము అంటూ, శాంతిని నెలకొల్పామంటూ చెప్పుకుంటు–న్నారు. ఆపరేషన్ సిందూర్‌లో ధ్వంసమైన రన్‌వేలు, హ్యాంగర్లను పాక్ విజయంగా భావిస్తే.. దాయాది దేశం దాన్ని ఆస్వాదించొచ్చు. భారత్‌లోని అమాయక పౌరులపై జరిగిన దాడికి పాక్ బాధ్యత వహించాలి. పాక్ నిజంగా శాంతిని కోరుకుంటే.. ఉగ్రవాదాన్ని ప్రోత్సహించడం ఆపి భారత్ కోరుకున్న ఉగ్రవాదులను అప్పగించాలి. అణు బెదిరింపులతో ఉగ్రవాదాన్ని ఎగదోయడాన్ని భారత్ ఎప్పటికీ సహించదు. అలాంటి వాటికి తలొగ్గదు' అని పేటల్ గ్లహోత్ స్పష్టం చేశారు. అంతకుముందు ఐరాసలో పాక్ ప్రధాని మాట్లాడుతూ.. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌పై ప్రశంసల వర్షం కురిపించారు. భారత్–పాక్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కుదిరేందుకు ట్రంప్ సాహసోపేత చొరవ ప్రశంసనీయమన్నారు. ట్రంప్ చర్యలు, నిర్ణయాలతో దక్షిణాసియాలో పెద్ద ముప్పు తప్పిందని వ్యాఖ్యానించారు.

తెలంగాణ ప్రభుత్వం
రెవిన్యూ శాఖ (భూసేకరణ)

**ఫారం -6**

**(చట్టం–30/2013 లోని సెక్షన్ 11(1)లోని సబ్ రూల్–1 రూల్ 19 ప్రకారం)**

**ప్రాథమిక నోటిఫికేషన్**

**జి1/4805/2025** **తేది: 19/09/2025**
**ఫైల్ నెం.సి/137/2025** **తేది: .09.2025**

తెలంగాణ ప్రభుత్వం / జిల్లా కలెక్టర్, నల్గొండ గారి ఆదేశానుసారం శేరిగూడెం మజీర ఎల్లారెడ్డిగూడెం గ్రామం, నార్కెట్‌పల్లి మండలం నల్లగొండ జిల్లాలో విస్తీర్ణం : ఎ. **0.09** గుంటల పట్టా భూమిని ప్రజా ప్రయోజనార్థం ఎలిమినేట్ మాధవరెడ్డి ప్రాజెక్ట్ యందు గల ఉదయ సముద్రం లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు (యు.ఎస్.ఎల్.ఐ.ఎస్) యందలి ఎడమ ప్రధాన కాలువ యొక్క డి–1 యందు కి.మీ. 6.900 నుండి 7.000 వరకు ఈ దిగువ చూపిన భూమి అవసరము అయి ఉన్నదని భావించినందున భూసేకరణ పునరుపాధి, పునరావాస కల్పనకు పారదర్శకత మరియు హేతుబద్ధమైన పరిహారాన్ని పొందే హక్కు చట్టం 2013 యందు చట్టం 30/2013 లోని సెక్షన్ 11(1) అనుసరించి ప్రకటన జారీ చేయనైనది.

తెలంగాణ ప్రభుత్వం వారు జి.ఓ.యం.ఎస్.నెం. 54 ఇరిగేషన్ (ఎల్.ఎ., ఆర్ & ఆర్/2) క్యాడ్ & డిపార్టుమెంటు తేది 25.07.2017 నాడు జారీ చేసినారు. అట్టి జి.ఓ. నందు ఉదయ సముద్రం భూసేకరణ చట్టం 2013 క్రింద అధ్యయము II & III ఈ ప్రాజెక్టు నుండి మినహాయించబడినది.

కావున ఈ ప్రాజెక్ట్ క్రింద శేరిగూడెం మజీర ఎల్లారెడ్డిగూడెం గ్రామం, నార్కెట్‌పల్లి మండలం, నల్లగొండ జిల్లా యందు విస్తీర్ణం ఎ. 0.09 గుంటల భూమి ఈ క్రింద చూపిన విధముగా భూసేకరణ నిమిత్తం ప్రాథమిక ప్రకటన జారీ చేయనైనది.

**షెడ్యూల్**

**గ్రామం: శేరిగూడెం మజీర ఎల్లారెడ్డిగూడెం** **మండలం: నల్లగొండ**
**జిల్లా: నల్లగొండ**

| క్రమ సంఖ్య | సర్వే నెం. భూమి స్వభావం ఖుష్కి/తరి/పట్టా ప్రభుత్వ విస్తీర్ణం | భూసేకరణ చేయు విస్తీర్ణం ఎ.గుం. | భూమిని కోల్పోయే రైతు పేరు తండ్రి / భర్త పేరు | ప్రదేశముపై ఉన్న చెట్లు/ నిర్మాణములో ఉన్న ఇతరములు |
|---|---|---|---|---|
| 1 | 2 | 3 | 4 | 5 |
| 1 | 583 ఖుష్కి / పట్టా 0.09 | 0.09 | పబ్బతిరెడ్డి వెంకటరెడ్డి తండ్రి ప్రతాప్‌రెడ్డి | -- |
| | మొత్తం విస్తీర్ణం | ఎ.0.09గు.లు | | |

ఇట్టి నోటిఫికేషన్ భూసేకరణ, భూ నిర్వాసితుల పునరావాస కల్పనకు పారదర్శకత మరియు హేతుబద్ధమైన పరిహారాన్ని కేంద్ర భూసేకరణ చట్టం, 2013 (చట్టం నెం.30/2013)లోని నియమంలోని సెక్షన్ 11(1) సంబంధిత భూ యజమానులకు సరియైన భూ నష్టపరిహారం చెల్లించుటకు నోటిఫికేషన్ జారీచేయనైనది.

భూమి యొక్క ప్లాను మరియు వివరములు జిల్లా కలెక్టర్, నల్లగొండ ప్రత్యేక ఉప కలెక్టర్, ఆర్&ఆర్&ఎల్ఎ., విభాగం–2, నల్లగొండ మరియు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, ఇరిగేషన్, డివిజన్ నెం.6, జి.వి.గూడెం, నల్లగొండ గారి కార్యాలయములలో ఉంచనైనది. సంబంధిత వ్యక్తులు ఏదైనా కార్యాలయము పని దినములలో మరియు పనివేళలలో తనిఖీ చేసుకోవచ్చు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం/ జిల్లా కలెక్టర్, నల్లగొండ గారు ప్రత్యేక ఉప కలెక్టర్, ఆర్&ఆర్ & ఎల్ఎ., విభాగం–2, నల్లగొండ గారిని మరియు వారి సిబ్బందిని ఇట్టి భూసేకరణకు సంబంధించి సెక్షన్ 12 ప్రకారం పైన చూపిన భూములలో ఏదైనా ప్రదేశములో ప్రవేశించి సర్వే, భూమి కొలతలు తీసుకొనుటకు మరియు ఇత్యాది పనులు చేపట్టడానికి అనుమతించనైనది.

సెక్షన్ 11(4) ప్రకారం భూసేకరణ కొరకు ప్రతిపాదించబడిన భూమి విషయంలో జిల్లా కలెక్టర్, నల్లగొండ గారి ముందస్తు అనుమతి లేకుండా, ప్రకటన జారీచేసిన తేదీ నుండి ఆ ప్రకటనలో ఉదహరింపబడిన భూములకు సంబంధించి ఎటువంటి కొనుగోలు, అమ్మకం, తనఖా మొదలగు చర్యలు చేపట్టరాదు.

భూసేకరణ విషయములో సంబంధిత భూ యజమానులు ఏదైన అభ్యంతరములున్న యెడల మరియు నష్ట పరిహారము సంప్రదింపుల ద్వారా పరిష్కారం కొరకు చట్టంలోని సెక్షన్ 15 ప్రకారం జిల్లా కలెక్టర్, నల్గొండ గారికి లేదా ప్రత్యేక ఉప కలెక్టర్, ఆర్&ఆర్ & ఎల్ఎ., విభాగం–2, నల్లగొండ గారికి లిఖిత పూర్వకముగా ప్రకటన జారీ చేసిన 60 (అరవై) దినముల లోపల తెలియజేయవలసి ఉన్నది.

సం/–
ప్రత్యేక ఉప కలెక్టర్,
ఆర్ & ఆర్ & ఎల్.ఏ.
విభాగం–2, నల్లగొండ

సం/–
అదనపు కలెక్టర్
నల్లగొండ

సం/–
జిల్లా కలెక్టర్
నల్లగొండ

DIPR RO.No.655/LA/PP/Advt/Pub/2025-26

## ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలి

చేశారు. ముంపు ప్రాంతాల్లో ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని ఆదేశించారు. మూసీ పరీవాహకంలో వరద పరిస్థితులపై రేవంత్ రెడ్డి ఆరా తీశారు. అవసరమైన చోట పునరావాసం కల్పించేందుకు ఏర్పాట్లు చేయాలని తెలిపారు. అర్ధరాత్రి ఎంజీబీఎస్ బస్టాండ్ చుట్టూ నీళ్లు రావటంతో అక్కడున్న ప్రయాణికులను సురక్షితంగా బయటకు తీసుకు వచ్చేందుకు చేపట్టిన సహాయక చర్యలను సీఎం సమీక్షించారు.అధికారులతో ఫోన్‌లో మాట్లాడి ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడాలని దిశానిర్దేశం చేశారు. వివిధ ప్రాంతాల నుంచి ఎంజీబీఎస్?కు వచ్చే బస్సులను ప్రత్యామ్నాయ రూట్లకు మళ్లించాలని అధికారులను రేవంత్ రెడ్డి ఆదేశించారు. బతుకమ్మ, దసరా పండుగల వేళ వివిధ జిల్లాలకు వెళ్లే ప్రయాణికులు ఇబ్బంది పడకుండా ఆర్టీసీ విభాగం తగిన చర్యలు చేపట్టాలని సూచించారు.మూసీ పరివాహక ప్రాంతాల్లో హైడ్రా కమిషనర్ రంగనాథ్ పర్యటించారు. ఎంజీబీఎస్ చేరుకున్న హైడ్రా కమిషనర్ ఎంజీబీఎస్‌లో పరిస్థితిని పరిశీలించారు. సహాయ కార్యక్రమాలను పర్యవేక్షించారు. మలక్‌పేటలోని మూసానగర్‌లో వరద ఇళ్లను చుట్టుముట్టింది. మూసీ ప్రవాహంలో చిక్కుకున్న వారికి అధికారుల సాయం అందించారు. ముంపు ప్రాంతాల్లోని వారికి ఆహారం పంపిణీ చేస్తున్న అధికారులు మలక్‌పేట పరిధిలో బాధితులకు డ్రోన్ ద్వారా ఆహారం సరఫరా చేశారు. డ్రోన్ ద్వారా హైడ్రా కమిషనర్ రంగనాథ్, మలక్‌పేట ఎమ్మెల్యే ఆహారం పంపారు.

మూసీ ప్రవాహం తగ్గే అవకాశాలున్నాయి : బిల్డింగ్‌లపై ఉన్న బాధితులకు డ్రోన్ ద్వారా వివిధ కాలనీల్లో చిక్కుకున్న వారికి బోట్ ద్వారా ఆహారం పంపించారు. అవకాశం ఉన్న వారందరిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు. రివర్ బెడ్ ఉన్న నివాసితులను ఖాళీ చేయించారు. ఇప్పటి వరకు ఎలాంటి ప్రాణ నష్టం జరుగలేదని, అందరిని సురక్షితంగా బయటకు తీసుకురావడానికి ప్రయత్నాలు చేస్తున్నామని హైడ్రా కమిషనర్ రంగనాథ్ వెల్లడించారు. చాదర్‌ఘాట్, మలక్‌పేట, రహదారులపై భారీగా ట్రాఫిక్ జామ్ అయిందని, ఎంజీబీఎస్ బస్ డిపో ఫ్లైఓవర్ నుంచి చాదర్‌ఘాట్ వరకు ఉన్న మూసీ ఉధృతంగా ప్రవహిస్తోందని, నీటి మట్టాలు తగ్గేంత వరకు లోతట్టు ప్రాంతాలు నదీ తీర మార్గాలకు ప్రజలు దూరంగా ఉండాలని రంగనాథ్ కోరారు. చాదర్‌ఘాట్, శంకర్ నగర్, మూసారాం బాగ్ తదితర మూసీ పరివాహక ప్రాంతాలు నీట మునిగాయి. వికరాబాద్ తదితర ప్రాంతాల్లో వర్షాలు తగ్గుముఖం పట్టాయని, నగరంలో మూసీ ప్రవాహం సాయంత్రం వరకు తగ్గే అవకాశాలున్నాయని హైడ్రా కమిషన్ తెలిపారు.

## ఫ్రెండ్లీ పోలీసింగ్‌తో ముందుకు వెళతా

డీజీపీ శివధర్ రెడ్డి సూచించారు. డ్రగ్స్‌పై తెలంగాణ ప్రభుత్వం ఇప్పటికే చాలా చర్యలు తీసుకుందని.. ఈగల్ టీమ్ కూడా చాలా స్ట్రాంగ్‌గా పనిచేస్తోందని నొక్కిచెప్పారు. డ్రగ్స్ ఒక మహమ్మారి లాగా మారిందని.. ఒక పోలీసుతోనే దీన్ని నిర్మూలన కాదని.. ప్రజల నుంచి కూడా పెద్దఎత్తున సహకారం కావాలని తెలిపారు. సైబర్ క్రైమ్ సెక్యూరిటీలో తెలంగాణ అగ్రస్థానంలో ఉందని పేర్కొన్నారు. సైబర్ క్రైమ్ మోసాలు, సైబర్ సెక్యూరిటీ– సమస్య దేశం మొత్తం పెద్ద సమస్యగా మారిందని చెప్పుకొచ్చారు. మన దగ్గర ఉన్నటువంటి సైబర్ సెక్యూరిటీ– బ్యూరోతో నేరాలను చాలావరకు అరికడుతున్నామని డీజీపీ శివధర్ రెడ్డి వెల్లడించారు.కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మావోయిజాన్ని తగ్గించే ప్రయత్నాలు చేస్తున్నాయని చెప్పుకొచ్చారు.

## హైదరాబాద్ సీపీగా సజ్జనార్

మారింది. దీంతో అతడిపై తాజాగా బదిలీ వేటు పడింది. ఈ నేపథ్యంలో సిరిసిల్ల కలెక్టర్‌గా హరితను నియమించారు. ఇక, హైదరాబాద్ సీపీగా పని చేసిన సివిఆనంద్‌ను తెలంగాణ ప్రభుత్వం బదిలీ చేసింది. అతడికి హోంశాఖ సెక్రెటరీగా బాధ్యతలను అప్పగిస్తూ ఆదేశాలు జారీ చేసింది.

# మూసీకి పోటెత్తిన వరద

ఓఆర్ఆర్ సర్వీస్ రోడ్డు వరకు ప్రభావం కనిపించింది. నార్సింగి– మంచిరేవుల వద్ద సర్వీస్ రోడ్ కూడా నీట మునిగింది. దీంతో రాకపోకలు నిలిపివేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. హైదరాబాద్‌లోని మూసీ పరివాహక ప్రాంతాల్లోని రోడ్లు, వంతెనలు, బస్తీలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. మూసీ నదిని ఆనుకుని ఉన్న మూసానగర్, రసూల్ పూర, వినాయకవీధి, శంకర్ నగర్, గోల్నాక పరిధిలోని ఇళ్లు నీట మునిగాయి. ముందు జాగ్రత్తగా ముంపు ప్రాంతాల్లో ఉన్న 600 మందిని పునరావాస కేంద్రాలకు తరలించారు. చాదర్ ఘాట్, ముసారాంబాగ్ వంతెనలపై వాహన రాకపోకలను నిలిపేశారు. మూసీ బ్రిడ్జిలను తాకుతూ వరద ప్రవహిస్తోంది.కాశీబుగ్గ, కిషన్‌బాగ్, మేకలమండి, గోశాల ప్రాంతాలను వరద ముంచెత్తింది. మూసారాంబాగ్ బ్రిడ్జి సమీపంలో 5 కార్లు, ట్రావెల్స్ బస్సు నీట మునిగాయి. ముంపు దృష్ట్యా పునరావాస శిబిరాలకు తరలించడంతో కార్లు, వాహనాలను వదిలేసి శిబిరాలకు వెళ్లిపోయారు. మలక్‌పేటలోని మూసానగర్‌లో మూసీ ప్రవాహంలో చిక్కుకున్న వారికి డ్రోన్ ద్వారా ఆహారం సరఫరా చేశారు. ఏటా మూసీ వరద వెతలు తప్పడంలేదని స్థానికులు వాపోయారు. ఇంట్లో నిత్యావసరాలు సహా వస్తువులన్నీ తడిచిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. పురానాపూల్ వద్ద 13 అడుగుల మేర మూసీ ప్రవాహం కొనసాగింది. వరద ఉధృతిలో శివాలయంలో పూజారి కుటుంబం చిక్కుకుంది. వరదలో చిక్కుకున్న నలుగురిని భారీ క్రెయిన్ సహాయంతో కాపాడారు.నిత్యం వేలాది ప్రయాణికులతో రద్దీగా ఉండే మహాత్మాగాంధీ బస్టాండ్‌ను మూసీ వరద చుట్టుముట్టింది. ఉన్నతాధికారుల ఆదేశాలతో ప్రయాణికుల ప్రాంగణాన్ని తాత్కాలికంగా మూసివేశారు. అప్రమత్తమైన యంత్రాగం ప్రయాణికులను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. బస్సులను లోనికి అనుమతించడం లేదని వెల్లడించారు. దూర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులను ఎల్బీ నగర్, ఉప్పల్ స్టేషన్?లకు తరలిస్తున్నట్లు తెలిపారు.మూసీ పరివాహక ప్రాంతాల్లో హైడ్రా కమిషనర్ రంగనాథ్ పర్యటించారు. ఎంజీబీఎస్ చేరుకున్న హైడ్రా కమిషనర్ ఎంజీబీఎస్‌లో పరిస్థితిని పరిశీలించారు. సహాయ కార్యక్రమాలను పర్యవేక్షించారు. మలక్‌పేటలోని మూసానగర్‌లో వరద ఇళ్లను చుట్టుముట్టింది. మూసీ ప్రవాహంలో చిక్కుకున్న వారికి అధికారుల సాయం అందించారు. ముంపు ప్రాంతాల్లోని వారికి ఆహారం పంపిణీ చేస్తున్న అధికారులు మలక్‌పేట పరిధిలో బాధితులకు డ్రోన్ ద్వారా ఆహారం సరఫరా చేశారు.

## సీఎం కుట్ర వల్లే ఎంజీబీఎస్ మునక

ఒకేసారి 15 గేట్లు తెరిచారని విమర్శించారు. ఎన్నడూ లేనిది ఇప్పుడే ఎంజీ బస్టాండ్ ఎందుకు మునిగిందని కేటీఆర్ ప్రశ్నించారు. ఇకపోతే ఏ వర్గానికి కాంగ్రెస్ ప్రభుత్వం ఎంత బాకీ పడ్డదో.. రేవంత్ సర్కార్‌ను నిలదీసి అడిగేందుకే ఈ బాకీ కార్డులకు రూపకల్పన చేశామని బీఆర్ఎస్ వర్కింగ్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. రాష్ట్ర స్థాయి నాయకుల నుండి క్షేత్ర స్థాయి నాయకుల వరకు, అందరం రాష్ట్రంలోని ప్రతి ఇంటికి ఈ బాకీ కార్డులను తీసుకెళ్లి ఇస్తామని ఆయన తెలిపారు. తెలంగాణ భవన్‌లో కాంగ్రెస్ బాకీ కార్డు విడుదల చేసిన సందర్భంగా కేటీఆర్ మాట్లాడారు.

ప్రజలను ఏమార్చిన కాంగ్రెస్

మార్పు మార్పు అని ప్రజలని ఏమార్చడం తప్ప కాంగ్రెస్ చేసిందేమీ లేదని మాజీ మంత్రి హరీష్ రావు మండిపడ్డారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ గ్యారెంటీ– కార్డులను ప్రతి ఇంటికి పంచారని, నేడు బాకీ కార్డులను తాము అదే ఇండ్లకు పంచుతామని పేర్కొన్నారు. ఎన్నికల ముందు రజినీకాంత్ లాగా మాట్లాడి, ఎన్నికల తర్వాత గజినీకాంత్ లాగా రేవంత్ రెడ్డి మారిపోయారని ఎద్దేవా చేశారు. కెటిఆర్ తదితరులతో కలసి తెలంగాణ భవన్‌లో బాకీ కార్డులు విడుదల సందర్భంగా హరీష్ రావు మీడియాతో మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికలు, జూబ్లీహిల్స్ ఎన్నికల్లో ఓట్ల కోసం మీ ఇండ్ల ముందుకు వచ్చే కాంగ్రెస్ నాయకులకు ఈ కార్డు చూపించి ప్రజలు నిలదీయాలని సూచించారు. జయసూర్య రేవంత్ రెడ్డి చీఫ్ మినిస్టర్ కాదు అని, కటింగ్ మాస్టర్ అయ్యారని హరీష్ రావు చురకలంటించారు. బిఆర్ఎస్ ప్రారంభించిన వాటికి సిఎం రేవంత్ రెడ్డి రిబ్బన్ కటింగ్ చేస్తున్నారని దుయ్యబట్టారు. కెసిఆర్ అమలు చేసిన పథకాలకు కటింగ్ చేస్తున్నారని, అయితే రిబ్బన్ కటింగ్ లేదంటే సంక్షేమ పథకాలకు కటింగ్ అవుతుందని ఎద్దేవా చేశారు. ఎంతసేపూ అక్రమ కేసులతో ప్రభుత్వాన్ని నడపలేవని రేవంత్ కు చురకలంటించారు. బంగ్లాదేశ్, నేపాల్, శ్రీలంకలో ప్రజలు తిరగబడ్డరని, రేవంత్ ప్రభుత్వానికి కాలం దగ్గర పడుతుందని హెచ్చరించారు. ప్రజలు తిరగబడే రోజులు వస్తున్నాయని, బాకీ కార్డుతో అప్పుడు ప్రజలు మిమ్మల్ని గల్లా పట్టుకొని అడుగుతారన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు చేసే వరకు ప్రశ్నిస్తామన్నారు. తాము ప్రశ్నిస్తే తమపై కేసులు పెడుతున్నారని తెలిపారు.తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి రోజులు దగ్గర పడ్డాయని హెచ్చరించారు. రేవంత్‌రెడ్డి, మల్లు భట్టి విక్రమార్క బాండు పేపర్‌పై సంతకాలు పెట్టి ఎన్నికల హామీలు ఇచ్చారని.. కానీ ఎన్నికల హామీలపై ఇప్పుడెందుకు మౌనంగా ఉంటున్నారని ప్రశ్నల వర్షం కురిపించారు. కాంగ్రెస్ బకాయి కార్డులను ఇంటింటికీ పంచుతామని చెప్పుకొచ్చారు. బాకీ కార్డు చూపించి ప్రజలు కాంగ్రెస్ నేతలను నిలదీయాలని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నమ్మి ప్రభుత్వ ఉద్యోగులు, ఆటో కార్మికులు, వ్యవసాయ కార్మికులు సైతం మోసపోయారని విమర్శించారు. ఆరు గ్యారెంటీ–లపై తెలంగాణ అసెంబ్లీలో చర్చిదామంటే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పారిపోయారని దెప్పిపొడిచారు. మార్పు మార్పు అంటూ ప్రజలను రేవంత్‌రెడ్డి ఏమార్చారని విమర్శించారు. ఎన్నికల ముందు గల్లీ గల్లీ తిరిగిన గాంధీలు.. ఇప్పుడు ఎక్కడ..? అని ప్రశ్నల వర్షం కురిపించారు. ప్రజలు ప్రశ్నిస్తారని గాంధీలు హైదరాబాద్‌కు రాకుండా ముఖం చాటేశారని హరీశ్‌రావు ఎద్దేవా చేశారు.

## సోనమ్ వాంగ్‌చుక్ కు పాకిస్థాన్‌తో సంబంధాలు

శ్రీనగర్(జనంసాక్షి): లద్దాఖ్ ఉద్యమ నేత సోనమ్ వాంగ్‌చుక్ కు పాకిస్థాన్‌తో సంబంధాలు ఉన్నాయనే ఆరోపణలపై దర్యాప్తు చేస్తున్నట్లు– డీజీపీ ఎస్‌డీ సింగ్ జామ్వాల్ వెల్లడించారు. లేహ్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. వాంగ్‌చుక్‌తో సంబంధాలు కలిగి ఉన్నట్లు– అనుమానిస్తున్న ఓ పాకిస్థానీ గూఢచారిని ఇటీవల అరెస్టు చేసినట్లు– చెప్పారు. సోనమ్ నిరసనల వీడియోలను ఆ వ్యక్తి పాకిస్థాన్‌కు పంపినట్లు– తెలిపారు. లద్దాఖ్‌లో చెలరేగిన హింస వెనుక వాంగ్‌చుక్ కీలక వ్యక్తి. ఆయన రెచ్చగొట్టే ప్రసంగాలు చేశారు. నేపాల్, బంగ్లాదేశ్, శ్రీలంకలో చోటు–చేసుకున్న నిరసనలను ప్రస్తావించారు. ఆయన నేతృత్వంలో జరిగిన నిరసనల వీడియోలను పొరుగు దేశానికి రిపోర్ట్ చేస్తున్న ఓ పీఐవోను ఇటీ–వల అరెస్టు చేశాం. అదేవిధంగా వాంగ్‌చుక్ విదేశీ పర్యటనల్లో కొన్ని అనుమానాస్పదంగా ఉన్నాయి. పాకిస్థాన్‌లో 'ది డాన్' నిర్వహించిన కార్యక్రమానికి హాజరయ్యారు.

## టెలికాం రంగంలో భారత్ మరింత వృద్ధి చెందుతోంది

భువనేశ్వర్: ప్రభుత్వరంగ టెలికాం సంస్థ బీఎస్‌ఎన్‌ఎల్ స్వదేశీ 4జీ సేవలు దేశవ్యాప్తంగా అందుబాటులోకి వచ్చాయి. ఒడిశా పర్యటనలో ఉన్న ప్రధాని మోదీ శనివారం జర్సుగూడలో జరిగిన కార్యక్రమంలో దేశవ్యాప్తంగా బీఎస్‌ఎన్‌ఎల్ 4జీ నెట్‌వర్క్‌ను ప్రారంభించారు. ఇందులోభాగంగా ప్రాజెక్టును మోదీ ప్రారంభించారు. సౌరశక్తితో నడిచేలా ఈ టవర్లను పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో.. దాదాపు రూ.37,000 కోట్ల వ్యయంతో నిర్మించారు. దీంతో టెలికాం పరికరాల ఉత్పత్తి, తయారీలో భారత్ డెన్మార్క్, స్వీడన్, దక్షిణ కొరియా, చైనా వంటి దేశాల సరసన చేరింది. భారత్‌లో తయారైన ఈ నెట్‌వర్క్ క్లౌడ్–ఆధారితమైనదని..త్వరలో బీఎస్‌ఎన్‌ఎల్ స్వదేశీ 4జీ సేవలను 5జీకి అప్‌గ్రేడ్ చేస్తామని సంబంధిత అధికారులు పేర్కొన్నారు. దీంతో ఒడిశాలోని 2,472 గ్రామాలతో సహా, మారుమూల, సరిహద్దు, తీవ్రవాద ప్రభావిత ప్రాంతాలలోని 26,700 కంటే ఎక్కువ గ్రామాలకు అందుబాటులోకి వస్తాయన్నారు.

## స్థానిక ఎన్నికలపై ఈసీ కసరత్తు

సంఘం సమావేశం నిర్వహించింది. ఉన్నతాధికారులతో రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణికుముదినీ భేటీ– అయ్యారు. ఈ సమావేశంలో సీఎస్ రామకృష్ణారావు, అదనపు డీజీ మహేశ్ భగవత్, పంచాయతీరాజ్, ఆర్థిక శాఖల ముఖ్యకార్యదర్శులు తదితరులు హాజరయ్యారు.

# విడతల వారీగా సంక్షేమ ఫలాల అందజేత

- బతుకమ్మ అంటేనే మహిళల పండుగ
- అర్హులైన ప్రతి ఒక్కరికీ రేషన్ కార్డు మంజూరు
- వడ్డీ లేని రుణాలతో మహిళలు ఆర్థికాభివృద్ధి
- రాష్ట్ర పంచాయతిరాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క



**ములుగు బ్యూరో,సెప్టెంబర్27(జనం సాక్షి):** రాష్ట్రంలోని అంగన్వాడి,ఆశా వర్కర్ల సమస్యలను విడతలవారీగా పరిష్కరించడానికి కృషి చేస్తానని, బతుకమ్మ పండుగ మహిళలకు ఎంతో గొప్పదని రాష్ట్ర పంచాయతిరాజ్,గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా,మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క అన్నారు.శనివారం జిల్లా కేంద్రం లోని డిఎల్ఆర్ ఫంక్షన్ హాల్ లో అంగన్వాడి టీచర్లకు,ఆయాలకు అదనపు కలెక్టర్ సిహెచ్.మహేందర్ జి, గ్రంథాలయ సంస్థ చైర్మన్ రవి చందర్, మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కళ్యాణి లతో కలిసి మంత్రి ఏకరూప దుస్తులను (యూనిఫామ్) పంపిణీ చేశారు.అంతకు ముందు గిరిజన భవన్ లో ములుగు, మల్లంపల్లి మండలాలకు చెందిన అర్హులైన లబ్ధిదారులకు రేషన్ కార్డులను పంపిణీ చేశారు.ఈ సందర్భాల్లో మంత్రి మాట్లాడుతూ అంగన్వాడి పాఠశాలలను మూసివేసే అవకాశం ఉందని ప్రచారంలో నిజం లేదని,ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి రాష్ట్రంలో అదనంగా పాఠశాలలను ఏర్పాటు చేయడానికి కృషి చేస్తున్నారని వివరించారు.నూతన పాఠశాలలను ఏర్పాటు చేయడమే కాకుండా కారుణ్య నియామకాలు చేపట్టడానికి సంబంధిత శాఖ అధికారులు ఇప్పటికే కసరత్తు ప్రారంభించారని, అంగన్వాడి సెంటర్ లో పనిచేస్తున్న సిబ్బంది బాధ్యతాయుతంగా విధులను నిర్వహిస్తూ పిల్లలకు మంచి పౌష్టికాహారం అందే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు.అంగన్వాడి సిబ్బంది తమ స్వంత పిల్లలు లాగానే చూసుకోవాలని, ఏకరూప దుస్తులు అందని సిబ్బందికి త్వరలో అందజేయడం జరుగుతుందని అన్నారు.ప్రభుత్వ సహకారంతో మహిళా సంఘాల సభ్యులు విజయవంతంగా పలు వ్యాపారాలు నిర్వహిస్తూ ఆర్థికంగా ఎదుగుతున్నారని అన్నారు. సోలార్ ప్లాంట్లు, ఆటోలు, వాహనాలు, బస్సుల కొనుగోలు కోసం బడ్డీలేని రుణాలను అందజేస్తున్నామని, వీటిని మహిళలు సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ఎదుగుతున్నారని తెలిపారు.ప్రతి మహిళా సంఘంలో చేరి ప్రభుత్వం అందించే ప్రయోజనాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.మహిళా సంఘం అంటే భరోసా అని, తోటి సభ్యులు కష్టసుఖాల్లో తోడుంటారని తెలిపారు. రాష్ట్రంలో మహిళా సంఘాలు పది మందికి ఉపాధినిచ్చే స్థాయికి ఎదిగాయని అన్నారు. ములుగు నియోజకవర్గంలో రేషన్ ఇప్పటికే అర్హులను గుర్తించి పదివేల కు పైగా రేషన్ కార్డులను పంపిణీ చేశామని, నూతన కార్డులను పంపిణీ చేయడమే కాకుండా వారికి సన్న బియ్యం అందిస్తున్నామని, రాష్ట్రంలోని పేదలందరికీ 200 యూనిట్ల ఉచిత కరెంటు అందజేయడంతో పాటు ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేస్తున్నామని అన్నారు. రాష్ట్రంలోని ప్రజా ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పనులను చూసి ప్రభుత్వానికి అండగా నిలవాలని సీతక్క కోరారు.అనంతరం డిఎల్ఆర్ గార్డెన్ లో మహిళలు, గెజిటెడ్ సంఘం ఏర్పాటు చేసిన బతుకమ్మ లతో మహిళల తో కలసి మంత్రి బతుకమ్మ ఆడినారు.ఈ కార్యక్రమంలో డిడబ్ల్యూఓ తుల రవి,డిసిఎస్ఓ షా ఫైజల్ హుస్సేనీ, ప్రజా ప్రతినిధులు,సిడిపిఓలు,అంగన్వాడి టీచర్లు,ఆయాలు,రేషన్ కార్డు లబ్ధిదారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# శేరిలింగంపల్లిలో సెంచురీ మ్యాట్రెసెస్ కొత్త ఎక్స్‌పీరియెన్స్ స్టోర్

- ప్రారంభించిన పీవీ సింధు



**శేరిలింగంపల్లి, సెప్టెంబర్ 27 (జనంసాక్షి) :** భారతదేశంలోనే వేగంగా అభివృద్ధి చెందుతున్న మ్యాట్రెసెస్ బ్రాండ్ సెంచురీ మ్యాట్రెసెస్ తన కొత్త ఎక్స్పీరియెన్స్ స్టోర్‌ను స్టోర్‌ను పద్మభూషణ్, ఒలింపిక్ పతక విజేత పీవీ సింధు, పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్ ఆరికెపూడి గాంధీ, సెంచురీ మ్యాట్రెసెస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఉత్తమ్ మలానీ కలిసి ప్రారంభించారు. ఈ కొత్త స్టోర్‌లో సెంచురీ యొక్క మొత్తం ఉత్పత్తులన్నీ ఒకే చోట లభించనున్నాయి. ముఖ్యంగా తాజాగా లాంచ్ చేసిన సెంచురీ సోఫాస్ తో పాటు, కాపర్ జెల్ టెక్నాలజీ వంటి ప్రత్యేకతలతో ఉన్న మ్యాట్రెసెస్ ను వినియోగదారులు ప్రత్యక్షంగా అస్వాధించేలా ఈ స్టోర్ ను ప్రత్యేకంగా డిజైన్ చేశారు. ప్రారంభోత్సవం సందర్భంగా ఉత్తమ్ మలానీ మాట్లాడుతూ శేరిలింగంపల్లి వంటి వేగంగా ఎదుగుతున్న ప్రాంతంలో మా కొత్త ఎక్స్‌పీరియెన్స్ స్టోర్‌ను తెరవడం మాకు ఆనందంగా ఉంది. 30 ఏళ్లకుపైగా వినియోగదారుల నమ్మకాన్ని అందిస్తున్న సెంచురీ, ఇప్పుడు బెడ్‌రూమ్ నుండి లివింగ్‌రూమ్ వరకు తన కంఫర్ట్ సైన్స్‌ను విస్తరించింది" అని అన్నారు. సెంచురీ మ్యాట్రెసెస్‌బ్రాండ్ అంబాసడర్ పీవీ సింధు మాట్లాడుతూ 'నా ప్రదర్శనలో కంఫర్ట్ చాలా కీలకం. సెంచురీ ఆ నమ్మకాన్ని అద్దం పడుతుంది. వినియోదారులు ఇక్కడ ప్రత్యక్షంగా ఈ కంఫర్ట్ ఇన్నోవేషన్స్ ను అనుభవించగలగడం నాకు చాలా సంతోషంగా ఉంది" అని అన్నారు.

# బలహీనవర్గాల నోటికాడి ముద్ద లాగవద్దు

- బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు అడ్డుకోవద్దు
- మంత్రి పొన్నం ప్రభాకర్ విజ్ఞప్తి




**హైదరాబాద్, సెప్టెంబర్ 27 (జనంసాక్షి) :** బలహీనవర్గాల నోటికాడి ముద్ద లాగవద్దని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కోరారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బిసిలకు నలభై రెండు శాతం రిజర్వేషన్లు బలహీనవర్గాల నోటికాడి ముద్ద లాగవద్దని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కోరారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బిసిలకు నలభై రెండు శాతం రిజర్వేషన్లు కల్పించాలన్న తమ సంకల్పానికి ఎవరూ అడ్డుపడ వద్దని ఆయన కోరారు. పది శాతం ఇడబ్లుఎస్ రిజర్వేషన్లు ఇచ్చినప్పుడు ఎవరూ వ్యతిరేకించ లేదని ఆయన శనివారం మీడియాతో మాట్లాడుతూ గుర్తు చేశారు. బిసిలకు నలభై రెండు శాతం రిజర్వేషన్లు ఇవ్వడం ద్వారా రాజ్యాంగబద్ధంగా వచ్చిన ఎస్సీ, ఎస్టిల రిజర్వేషన్లకు ఎటు-వంటి నష్టం జరగదని అన్నారు.ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా కుల సర్వే నిర్వహించిందని ఆయన తెలిపారు. కుల గణన సర్వే ఆధారంగా ఎవరెంత ఉన్నారో తెలుసుకుని రిజర్వేషన్లు అమలు చేయడానికి సబ్ కమిటీ- వేసి నలభై రెండు శాతం రిజర్వేషన్లు పెంచుతూ మంత్రివర్గం నిర్ణయం తీసుకున్నదని, ఆ తర్వాత అసెంబ్లీ, కౌన్సిల్‌లో చర్చించి అన్ని పార్టీల మద్దతు కూడగట్టామని అన్నారు. దానిని గవర్నర్‌కు పంపించడం జరిగిందని, గవర్నర్ దానిని రాష్ట్రపతికి పంపించడం జరిగిందని ఆయన చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వాలు, కేంద్రం ఆమోదించిన బిల్లులు మూడు నెలల పాటు- పెండింగ్‌లో ఉంటే ఆ తర్వాత వాటిని చట్టాలుగా అమలు చేసుకోవడానికి వీలు కల్పిస్తూ సుప్రీం కోర్టు ఆదేశాలు జారీ చేసిన విషయాన్ని మంత్రి పొన్నం ప్రభాకర్ గుర్తు చేశారు. తమిళనాడులో అరవై శాతానికి పైగా రిజర్వేషన్లు అమలవుతున్నాయని ఆయన తెలిపారు. చట్టాలు, న్యాయాల పట్ల తమకు గౌరవం ఉందన్నారు. బిసిలకు ప్రభుత్వం అండగా ఉందని ఆయన భరోసా ఇచ్చారు.

# కొండా లక్ష్మణ్ బాపూజీకి ఉపేంద్ర నివాళి



**హైదరాబాద్ (జనంసాక్షి) :** ఆచార్య కొండ లక్ష్మణ్ బాపూజీ 110 జయంతి సందర్భంగా అశోక్ నగర్ లోని వారి నివాసం వద్ద వారి విగ్రహానికి పూలమాలలతో మాజీ బీసీ కమిషన్ సభ్యులు సిహెచ్ ఉపేంద్ర, మాజీ పంచాయతీరాజ్ ట్రిబ్యునల్ సభ్యులు పులిహోర గోవర్ధన్ రెడ్డి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాపూజీ న్యాయవాది దేశ స్వతంత్రం పోరాటం కోసం పోరాడిన దేశభక్తుడు నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాడిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు ప్రత్యేక రాష్ట్రం కోసం మంత్రి పదవిని సైతం త్యాగం చేసి 94 సంవత్సరాల వయసులో కూడా తెలంగాణ సాధన కొరకు పాటుబడిన మహా నేత కొండ లక్ష్మణ్ బాపూజీ అని ఆయన అన్నారు. మంత్రి పదవి కాకుండా ఆఖరికి తనకు ఉన్న ఇల్లును కూడా రాష్ట్ర సాధన కొరకు టిఆర్ఎస్ పార్టీకి ఇచ్చి చంద్రబాబు నాయుడు దాష్టి కానికి గురి అయ్యి తనకున్న ఇల్లును చంద్రబాబు నాయుడు ప్రభుత్వం గుంజుకుంటేచివరి రోజుల్లో కిరాయి ఇంట్లో ఉంటూ ఉద్యమాన్ని ముందుకు నడిపిన నాయకుడు మంత్రి పదవే కాకుండా సామాజిక ఉద్యమకారుడిగా దేశభక్తుడిగా మంచి మనసున్న నేతగా ప్రజల హృదయాలలో చిరస్థాయిగా నిలిచిన నేత కొండా లక్ష్మణ్ బాపూజీ అని ఆయన అన్నారు. తెలంగాణ రాష్ట్రం ఉన్నంతవరకు కొండ లక్ష్మణ్ బాపూజీ గారు సేవలను గుర్తుపెట్టుకుంటారని ఆయన అన్నారు

## తెలంగాణ సాధనకు బాటలు వేసిన కొండాలక్ష్మణ్

- జయంతి వేడుకల్లో మంత్రి తుమ్మల

**హైదరాబాద్, సెప్టెంబర్ 27 (జనంసాక్షి) :** తెలంగాణ రాష్ట్ర సాధనకు బాటలు వేసిన పోరాట యోధుడు కొండా లక్ష్మణ్ బాపూజీ అని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరావు అన్నారు. శనివారం రవీంద్రభారతిలో జరిగిన కొండా లక్ష్మణ్ బాపూజీ 110వ జయంతి వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కొండా లక్ష్మణ్ బాపూజీ దేశ స్వాతంత్య్ర పోరాటంలో, తెలంగాణ సాయుధ పోరాటంలో కీలక పాత్ర పోషించారని తెలిపారు. రాష్ట్ర సాధన కోసం మంత్రి పదవిని త్యజించిన మహానీయుడని కొనియాడారు. కొండా లక్ష్మణ్ బాపూజీ ఒక గొప్ప నాయకుడని, ఆయన తన జీవితాన్ని ప్రజల సేవకే అంకితం చేశారన్నారు. గాంధీజీ సిద్ధాంతాలను ఆచరించి, అణగారిన వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన వ్యక్తి అని మంత్రి పేర్కొన్నారు. కొండా లక్ష్మణ్ బాపూజీ ఆశయాలకు అనుగుణంగా సీఎం రేవంత్ రెడ్డి పాలనసాగిస్తున్నారని, కొండా లక్ష్మణ్ గురించి భవిష్యత్తు తరాలకు తెలిసేలా హార్టికల్చర్ యూనివర్సిటీ-కి, ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్ లూమ్ టెక్నాలజీ కి కొండా లక్ష్మణ్ బాపూజీ పేరు పెట్టామని మంత్రి తుమ్మల తెలిపారు. గతంలో ఎన్నడు లేని విధంగా చేనేత కార్మికుల రుణమాఫీ చేశామని చేనేత రంగాన్ని ప్రోత్సహించటానికి సీఎం రేవంత్ రెడ్డి చొరవతో బతుకమ్మ చీరల వర్క్ ఆర్డర్ తో చేనేత కార్మికులు నిలదొక్కుకునేలా ప్రజా ప్రభుత్వం చేనేత రంగానికి అండగా ఉందని మంత్రి స్పష్టం చేశారు.

# ఎంపీపీ, జడ్పీటిసి స్థానాలకు రిజర్వేషన్లు ఖరారు..

- ఆశావాహులకు నిరాశ తప్పలేదు....

**వరంగల్ ప్రతినిధి, సెప్టెంబర్ 24 (జనంసాక్షి):** వరంగల్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జానాభా ప్రతిపాదికన జిల్లాలోని 11 జడ్పీటీసీ మరియు 11 ఎంపీపీ స్థానాలకు రిజర్వేషన్లు అధికారులు ఖరారు చేసి కేటాయించిన రిజర్వేషన్ లను రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ప్రకటించారు. జడ్పీటీసీ 11 స్థానాలకు గాను జనరల్ 1, జనరల్ మహిళ 1, బీసీ జనరల్ 3, బిసి మహిళ 2 స్థానాలు, ఎస్సి జనరల్ 1, ఎస్సి మహిళ 1, ఎస్టీ జనరల్ 1, మహిళ 1 గా జడ్పీటీసీ స్థానాలు ఖరారు చేశారు...జడ్పీటీసీ రిజర్వేషన్ వివరాలు. నర్సంపేట - ఎస్టీ మహిళ, ఖానాపూర్ - ఎస్టీ జనరల్, వర్ధన్నపేట - ఎస్.సి మహిళ, గీసుకొండ - ఎస్.సి జనరల్, నల్లబెల్లి - బిసి జనరల్, నెక్కొండ - బిసి జనరల్ , పర్వతగిరి బీసీ జనరల్, రాయపర్తి బీసీ మహిళ, సంగెం బిసి మహిళ, చెన్నారావుపేట జనరల్ మహిళ. దుగ్గొండి జనరల్, స్థానాలకు రిజర్వేషన్లను ప్రకటించారు. వరంగల్ జిల్లాలోని మండల పరిషత్ స్థానాలకు రిజర్వేషన్ ప్రక్రియ ఎస్సీ ఎస్టీలకు 2011 జనాభా లెక్కల ప్రకారం బీసీలకు 2024 కుల గనన సర్వే ప్రకారం రిజర్వేషన్లను కేటాయించారు. ఎంపీపీ చెన్నారావుపేట స్థానానికి జనరల్ మహిళ, దుగ్గొండి జనరల్, గీసుగొండ ఎస్సీ జనరల్, ఖానాపురం ఎస్టీ మహిళ, నల్లబెల్లి బీసీ జనరల్, నర్సంపేట ఎస్టీ జనరల్, నెక్కొండ బీసీ మహిళ, పర్వతగిరి బీసీ జనరల్, రాయపర్తి బీసీ మహిళ, సంగెం బీసీ జనరల్ వర్ధన్నపేట ఎస్సీ మహిళా స్థానాలకు రిజర్వేషన్లు ఖరారు కావడంతో పోటీ చేసే అభ్యర్థుల్లో తీవ్ర ఉత్కంఠ నెలకొంది, అధికారికంగా శనివారం రిజర్వేషన్లు ప్రకటించడంతో ఆశావాహులకు నిరాశ తప్పలేదు.

# ప్రజాస్వామ్య పరిరక్షణకు కదలండి

- హిందూత్వ ఎజెండాలో భాగమే రాజ్యాంగ వ్యవస్థల ధ్వంసం
- నేడు సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సెమినార్
- పీస్ డైలాగ్ కమిటీ నాయకులు జస్టిస్ చంద్ర కుమార్, ప్రొ. వినాయక రెడ్డి, బండి దుర్గా ప్రసాద్

**హైదరాబాద్ (జనంసాక్షి) :** ప్రజాస్వామ్య పరిరక్షణకు కదలాలని, హిందూత్వ ఎజెండాలో భాగమే రాజ్యాంగ వ్యవస్థల ధ్వంసం చేస్తున్నారని పీస్ డైలాగ్ కమిటీ నాయకులు జస్టిస్ చంద్ర కుమార్, ప్రొ. వినాయక రెడ్డి, బండి దుర్గా ప్రసాద్ తెలిపారు. ప్రజాస్వామ్య దేశంలో ప్రభుత్వ వ్యవస్థలైన న్యాయవ్యవస్థ, ఎలక్షన్ కమిషన్ నిష్పక్షపాతంగా, పారదర్శకంగా పని చేయాలని సూచించారు. మన దేశంలో గత పన్నెండు ఏళ్లుగా ఈ వ్యవస్థలన్నీ పాలకుల ప్రయోజనాల కోసం సర్వశక్తులు ఒడ్డుతున్నాయని, ముఖ్యంగా కంచే చేనును మింగినట్టు జూడిసియరీ, సీఈసీ నాగపూర్ ఎజండాను అమలు చేస్తున్నాయని, ఛీఫ్ ఎలక్షన్ కమీషన్, కొలీజియం ఎన్నిక ప్రక్రియలో కేంద్ర పాలకులు మార్పులు చేసారని, సీఈసీ సర్ పేరుతో బీహార్లో 66 లక్షల ఓట్లను తొలిగించిందని, ఈ చోర తంత్రాన్ని దేశ మంతటికి విస్తరించే కుట్రతో కషాయదళం పని చేస్తున్నదని తెలిపారు. ఈ నేపద్యంలో ఎన్నికల నిర్వహణ ఒక ప్రహసనంగా మారే ప్రమాదం దాపురించిందని, దీన్ని అడ్డుకోవాలని అన్నారు. రాజ్యాంగ వ్యవస్థల పరిరక్షణ కోసం ఒక విశాల ఐక్య ప్రజాస్వామ్య ఉద్యమం నిర్మించుకోవాలన్నారు. వీటన్నింటి పట్ల ఒక సమిష్టి అవగాహన, ఆచరణ రూపొందించుకోవడానికి నేడు సుందరయ్య విజ్ఞాన కేంద్రం లో సెమినార్ నిర్వహిస్తున్నట్టు తెలిపారు. దీనికి సుప్రీంకోర్టు ప్రముఖ న్యాయవాది ప్రశాంత్ భూషన్ ముఖ్య అతిధిగా వస్తున్నారని, హైదరాబాద్ లో ఈ ప్రజా స్వామ్య ప్రమాద సందర్భంలో జరుగుతున్న సెమినార్కు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయవల్సిందిగా కోరారు. ఈ తెలంగాణ ప్రజాస్వామిక వేదిక ఆధ్వర్యంలో.. పది వామపక్ష, లెఫ్ట్, విప్లవ పార్టీ ల, ప్రజా స్వామ్య వాదులు, ప్రజా సంఘాల భాగస్వామ్యం లో జరగనుందని, దీనికి అందరూ ప్రజా సంఘాలు, ప్రజా స్వామ్య వాదులు ప్రజా స్వామిక కర్తవ్యం లో భాగంగా హాజరై విజవంతం చేయాలని కోరారు.

## మాతృత్వంపై అవగాహన

- మహిళా కమిషన్ ఆధ్వర్యంలో కార్యక్రమం

**హైదరాబాద్, సెప్టెంబర్27 (జనంసాక్షి) :** నవరాత్రి,బతుకమ్మ ఉత్సవాల సందర్భంగా మహిళా కమిషన్ చైర్పర్సన్ నేరెళ్ళ శారద అధ్యక్షతన బుద్ధభవన్‌లో 'మాతృత్వం మరియు ఆరోగ్యం' పై అవగాహన కార్యక్రమం ఏర్పాటు- చేశారు. ఈ సందర్భంగా మహిళా కమిషన్ కార్యదర్శి మాట్లాడుతూ మాతృత్వం, మహిళల ఆరోగ్యం, అలాగే మహిళా కమిషన్ అందిస్తున్న సేవల గురించి వివరించారు. మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ ,నేరెళ్ళ శారద మేడమ్ గారు బతుకమ్మ, నవరాత్రి ఉత్సవాల ప్రాముఖ్యతను, మహిళల ఆరోగ్యం పట్ల తీస్కోవాల్సిన జాగ్రత్తలు మహిళలకు తెలియజేశారు. హైడ్రా కమిషనర్, రంగనాథ్ మాతృత్వంలో ఆహారపు అలవాట్లు- , సమతుల ఆహారం తీసుకోవడం ఎంత ముఖ్యమో వివరించారు బతుకమ్మ పండగ ప్రకృతికి దగర చేస్తుంది అని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మహిళలు , అంగన్వాడీ టీ-చర్స్, బుద్ధ భవన్ లోని వివిధ శాఖల ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అవగాహన కార్యక్రమం అనంతరం బతుకమ్మ ఉత్సవాల్లో మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమంలో మహిళా కమిషన్ ఛైర్పర్సన్ నేరెళ్ళ శారద, హైడ్రా కమిషనర్ రంగనాథ్, హైడ్రా ఎస్పీ అడ్మిన్ , కమిషన్ సెక్రటరీ గారు పద్మజ రమణ అంగన్వాడీ టీ-చర్స్,వివిధ శాఖల ఉద్యోగులు పాల్గొన్నారు.

# రేవంత్ రెడ్డి.బురద రాజకీయాలు మానుకో

- వరద బాధితులను ఆదుకో
- మాజీ మంత్రి హరీశ్ రావు ధ్వజం



**హైదరాబాద్ (జనంసాక్షి) :** తీవ్ర వర్షాలు ఉంటాయి అని వెదర్ రిపోర్ట్ వచ్చినా ప్రభుత్వం అప్రమత్తంగా లేదని మాజీ మంత్రి హరీశ్ రావు ధ్వజమెత్తారు. హైదరాబాద్‌లో విడుదల చేసిన ఒక ప్రకటనలో ఎలాంటి ముందస్తు చర్యలకు ఉపక్రమించక లేదని, వరద అంచనా వేయడంలో ప్రభుత్వ వైఫల్యమని తెలిపారు. ప్రభుత్వ విభాగాల సమన్వయంలో వైఫల్యమని, ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి వల్లనే జల దిగ్బంధంలో హైదరాబాద్ ఉందని తెలిపారు. పండగ వేళ సొంతూళ్లకు వెళ్ళలేక, భయం భయంగా రాత్రి నుండి పడిగాపులు కాస్తున్నారని, మూసి నది ప్రమాదకరంగా ప్రవహిస్తున్న నేపథ్యంలో పరిసర ప్రాంత ప్రజలు బిక్కు బిక్కుమంటూ బతుకుతున్నారని తెలిపారు. ఇలాంటి సమయంలో ప్రభుత్వం ముందు చూపుతో వ్యవహరించాలని సూచించారు. మూసి పరిసర ప్రాంతాల ప్రజలు ఆందోళనలో ఉన్నారని, ఎప్పటికపుడు సమాచారం అందిస్తూ, అప్రమత్తం చేస్తూ, ముంపు ప్రభావం ఉన్న వారిని తరలించి భరోసా కల్పించాలని కోరారు. తీవ్ర వర్షాలు, వరదల నేపథ్యంలో రాష్ట్ర ప్రజలు ముఖ్యంగా హైదరాబాద్ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు.

### టూరిజం అభివృద్ధి పేరుతో రేవంత్ సర్కారు స్కాం

ప్రపంచ పర్యాటక దినోత్సవం ముసుగులో టూరిజం అభివృద్ధి పేరిట కమీషన్లు దండుకునేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం మరో ప్లాన్ చేసిందని, ఏకంగా 15వేల కోట్ల పనులు అప్పనంగా అప్పగిస్తూ మరో స్కాంకు తెరలేపారనిలక్షల కోట్లు విలువ చేసే, వేలాది ఎకరాల భూములను తన అనుయాయులకు దారాదత్తం చేసేందుకు రేవంతు మార్కు భారీ స్కెచ్ వేశారని తెలిపారు. ఓపెన్ బిడ్లు పిలవలేదు, అధికంగా బిడ్ దాఖలు చేసిన వారికి పనులు అప్పగించాల్సి ఉన్నా ఎక్కడా నిబంధనలు పాటించలేదని, టెండర్లు పిలిచింది లేదు, నిబంధనలు పాటించింది లేదని తెలిపారు. ఇద్దరు, ముగ్గురిని మాత్రమే కన్సల్టెంట్స్ గా పెట్టుకొని పనులను సీక్రెట్ గా ఎందుకు కట్టబెట్టాల్సి వచ్చింది? అని ప్రశ్నించారు. ఇందులో ఎవరి ప్రయోజనాలు దాగున్నాయి? ప్రభుత్వ భూములను, ప్రజా ధనాన్ని ఎవరికి దోచి పెడుతున్నారు? అని ప్రశ్నించారు. లగ్జరీ వెల్ నెస్ రిసార్ట్స్, వైన్ యార్డు రిసార్ట్స్, లగ్జరీ హోటల్స్, వాటర్ ఫ్రంట్ రిసార్ట్స్, అంతర్జాతీయ కన్వెన్షన్ సెంటర్లు, థీమ్ పార్కుల అభివృద్ధి పేరిట మీరు చేస్తున్నది ముమ్మాటికీ స్కామే.. కమీషన్ల దందానే అని తెలిపారు. ఈ స్కాం సంబంధించిన పూర్తి వివరాలను ఆధారాలతో సహా త్వరలో బయటపెడుతామని తెలిపారు. రేవంత్ రెడ్డి.. అధికారం శాశ్వతం కాదు, వచ్చేది బిఆర్ఎస్ ప్రభుత్వమే. ఈ దోపిడీలో భాగమైన ఏ ఒక్కరిని వదిలిపెట్టేది లేదని తెలిపారు. ఈ మొత్తం స్కాంపై విచారణ జరిపిస్తం, వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటం. పబ్లిక్ మనీని రికవరీ పెడుతమని హెచ్చరించారు.

# లొంగిపోయిన మావోయిస్టు పార్టీ సభ్యులకు రివార్డు అందజేత



**ములుగు ప్రతినిధి, సెప్టెంబర్ 27(జనంసాక్షి) :** నిషేధిత సిపిఐ మావోయిస్టు పార్టీకి చెందిన ముగ్గురు సభ్యులు ములుగు జిల్లా ఎస్పీ డా శబరీష్ ఎదుట లొంగిపోయారు. ఈ విధంగా లొంగిపోయిన ముగ్గురు మావోయిస్టు సభ్యులకి తెలంగాణ సరెండర్ పాలసీలో భాగంగా తక్షణ సహాయంగా ప్రభుత్వం నుండి ప్రతి ఒక్కరికీ రూ 25,000/- చొప్పున వారి నగదు రివార్డు జిల్లా ఎస్పీ వారికి అందజేశారు. అదేవిదంగా వారి పై మిగిలిన రివార్డు మొత్తం ప్రభుత్వం నుండి మంజూరు కాగా, వారి వారి క్యాడర్ ఆదారంగా మడవి మంగ్లీ ఏ మాసే ఏసిఎం కి 3,75,000/- రూపాయలు మరియు పార్టీ సభ్యులైన మడకం కమలేష్, మడకం భీమే లకి ఒక్కొక్కరికి 75,000/- రూపాయలను చెక్ రూపంలో జిల్లా ఎస్పీ వారికి అందజేశారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం భారత దేశంలోనే అత్యుత్తమ సరెండర్ పాలసీని అమలు చేస్తుంది. లొంగిపోయిన మావోయిస్టులకు రివార్డు డిడీ, వైద్య చికిత్స, పునరావాస సహాయం అందుతోంది. వారు సమాజంలో తిరిగి స్థిరపడేందుకు అన్ని విధాల మద్దతు ప్రభుత్వం అందిస్తుంది. మావోయిస్టులను జనజీవన స్రవంతి లో కలవమంటూ విజ్ఞప్తి చేస్తూ వివిధ పద్ధతుల్లో మరియు మాధ్యమాల ద్వారా అజ్ఞాతంలో ఉన్న మావోయిస్టులకు సమాచారం అందించడం జరుగుతుంది. అజ్ఞాతంలో ఉన్న మావోయిస్టులు బయటకు వచ్చి, జీవన స్రవంతిలో కలవడానికి ముందుకు వస్తే వారు ఏ ప్రాంతంలో ఉన్నప్పటికీ, వారు క్షేమంగా బయటకు వచ్చి జనజీవన స్రవంతిలో కలవడానికి కావాల్సిన ఏర్పాట్లు చేయడంతో పాటు సరెండర్ పాలసీలో భాగంగా తక్షణమే వారికి పునరావాసాన్ని ములుగు పోలీస్ కల్పిస్తుంది. ఈ కార్యక్రమం లో ములుగు డిఎస్పీ(ఇన్చార్జి ఓఎస్డీ) రవీందర్, ఆర్ఐ తిరుపతి పాల్గొన్నారు.

## వాగు దాటేందుకు యత్నం

### కొట్టుకుపోయిన బైకు..ఒడ్డున పడ్డ వ్యక్తి

**వరంగల్, సెప్టెంబర్ 27 (జనంసాక్షి) :** జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాలకు వాగులు, వంకలు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. వర్షాల వల్ల మహాముత్తారం మండలం ములుగుపల్లి-అంశపూర్ గ్రామాల మధ్య వాగు ఉధృతి పెరిగింది. ద్విచక్ర వాహనంపై ప్రవాహాన్ని దాటేందుకు ప్రయత్నించిన రాజు అనే వ్యక్తి బైక్‌తో పాటు- కొట్టు-కుపోయాడు. ఈత రావడంతో ప్రాణాలతో బయటపడ్డాడు. వరదల నేపథ్యంలో ప్రయాణాల్లో అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరిస్తున్నారు. ఇదిలావుంటే తెలంగాణ మీదుగా ఉపరితల ఆవర్తనం కొనసాగుతోంది. దీని ప్రభావంతో రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో తేలికపాటి ఉరుములతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉన్నట్లు- హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. మెదక్, సంగారెడ్డి జిల్లాల్లో రానున్న రెండు, మూడు గంటల్లో 40కి.మీ కంటే తక్కువ వేగంతో గాలులు వీచే అవకాశం ఉంది. ఆయా జిల్లాలకు ఆరెంజ్ హెచ్చరికలు జారీ చేశారు. మరోవైపు ఆదిలాబాద్, హనుమకొండ, హైదరాబాద్, జయశంకర్ భూపాలపల్లి, జనగామ, కామారెడ్డి, కుమురంభీమ్ ఆసిఫాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి, రంగారెడ్డి, సిద్దిపేట, వరంగల్, యాదాద్రి భువనగిరి జిల్లాలకు ఎల్లో హెచ్చరికలు జారీ చేశారు.

జనంసాక్షి
www.janamsakshi.org
ఆదివారం
28 సెప్టెంబర్ 2025

# భారత విప్లవోద్యమ నిర్మాత భగత్ సింగ్



## సెప్టెంబర్ 28... భగత్‌సింగ్ జయంతి

ఆయన భారత స్వాతంత్ర్య సమర యోధుడు. కరుడుకట్టిన ఉద్యమ కారుడు. ఢిల్లీ వీధిలో ఎర్ర కాగితాలు చల్లి ప్రజలలో స్వాతంత్ర్య పిపాసను జాగృతం చేసిన చైతన్యశీలి. విప్లవం వర్ధిల్లాలి అనే నినాదాన్ని ఇచ్చి, ప్రజల గుండెల్లో ఆంగ్లేయుల పాలనకు వ్యతిరేకంగా విప్లవ జ్వాలల ను రగిలించిన విప్లవ మూర్తి. భారత స్వాతంత్ర్యో ద్యమములో పోరాడిన అత్యంత ప్రభావశీల విప్లవ కారులలో ఆయన ఒకడు. ఆయనే భరతమాత ముద్దుబిడ్డ, షహీద్ భగత్ సింగ్.

భగత్ సింగ్ భగత్ సింగ్ (1907 సెప్టెంబరు 28 – 1931 మార్చి 23) పూర్వపు పంజాబ్‌లో, ప్రస్తుత పాకిస్తాన్‌లో ఉన్న లాయల్ జిల్లా బంగా సమీపంలోని ఖత్కర్ కలాన్ గ్రామంలోని సంధు ఝాట్ కుటుంబంలో సర్దార్ కిషన్ సింగ్, విద్యావతి దంపతులకు జన్మించాడు. భగత్ అనే పదానికి "భక్తుడు" అని అర్థం. భగత్ సింగ్ మూడేళ్ళ పిల్లాడిగా ఉన్నప్పుడు తండ్రి కిషన్ సింగ్, భగత్ సింగ్‌ను చంకనెత్తుకొని, కొత్తగా వేస్తున్న తోటను చూడ్డానికి పొలాల్లోకి వెళ్ళాడు. వెంటనే కిందికి దిగిన భగత్ సింగ్ ఆ మట్టిలో ఆడు కుంటూనే చిన్న చిన్న గడ్డిపరకలను నాటడం మొదలు పెట్టాడు. తండ్రి "ఏం చేస్తున్నావ్ నాన్నా" అని ప్రశ్నిస్తే, భగత్ సింగ్ "తుపాకులు నాటుతున్నా" అని బదులిచ్చాడు. భవిష్యత్తుకు బాల్యం మొలకలు వేసే వయస్సులో తుపాకులను మొలకెత్తించాలని యోచించడం ఆయన వ్యక్తిత్వానికి మచ్చుతునక.

ప్రాథమిక విద్యను స్వగ్రామంలోనే పూర్తిచేసిన భగత్, ఉన్నత విద్యాభ్యాసం కొరకు లాహోర్ చేరాడు. అక్కడ లాలాలజపతి రాయ్, భాయ్ ప్రేమానంద్ వంటి అగ్రశ్రేణి స్వాతంత్ర్య సమరయోధులు బోధన చేస్తున్న 'నేషనల్ కాలేజ్'లో చదవడం భగత్‌ను విప్లవకారుడిగా తీర్చి దిద్దాయి.

13ఏళ్ల ప్రాయంలోనే మహాత్మా గాంధీ సహాయ నిరాకరణో ద్యమానికి సింగ్ ప్రభావితు డయ్యాడు. ఆ సమయంలో బ్రిటీష్ ప్రభుత్వానికి ఎదురు తిరిగిన భగత్ ప్రభుత్వ పాఠశాల పుస్తకాలు, బ్రిటీషు దిగుమతి దుస్తులను తగుల బెట్టడం ద్వారా గాంధీ సిద్ధాంతాలను అనుసరించాడు.

భారత దేశానికి వచ్చిన సైమన్ కమిషన్లో ఒక్క భారతీయుడైనా లేనందుకు నిరసనగా, ఉద్యమంలో లాల్‌జీ కీలక పాత్ర వహించి, సైమన్ కమిషన్‌ను బహిష్కరించాలి అంటూ పంజాబ్ అసెంబ్లీలో ఆయన తీర్మానం పెట్టి గెలిపించారు. ఇది ప్రభుత్వానికి కంటగింపుగా మారింది. అక్టోబర్ 30, 1928న ఆ కమిషన్ లాహోర్ రాగా, లాల్‌జీ కూడా అహింసతో, మౌనంగా సైమన్ వ్యతిరేక కార్యక్రమాన్ని నిర్వహించారు. మౌనంగా ఉద్యమిస్తున్న వారిపైన కూడా లాఠీ చార్జికి ఆదేశించాడు పోలీసు సూపరింటెండెంట్ జేమ్స్ ఏ స్కాట్. తను స్వయంగా లాల్‌జీ మీద దాడి చేసి, లాల్‌జీ ఛాతీ మీద లాఠీతో స్కాట్ తీవ్రంగా కొట్టాడు. ఆ దెబ్బలతోనే లాల్‌జీ నవంబర్ 17న చనిపోయారు.

ఈ సంఘటనను కళ్లారా చూసిన భగత్ సింగ్ ప్రతీకారం తీర్చుకోవాలని నిర్ణయించు కున్నాడు. పోలీసు అధికారి స్కాట్‌ను హత మార్చడానికి విప్లవ కారులు శివరామ్ రాజ్‌గురు, జై గోపాల్, సుఖ్‌దేవ్ థాపర్‌లతో ఆయన చేతులు కలిపాడు. డీఎస్పీ జే.పీ. సాండర్స్ కనిపించినప్పుడు పొరపాటుగా స్కాట్ అనుకుని, జైగోపాల్ ఆయన్ను కాల్చుమంటూ సింగ్‌కు సంకేతాలిచ్చాడు. ఫలితంగా స్కాట్‌కు బదులు సాండర్స్ హతమయ్యాడు. లాలా లజ్‌పత్ రాయ్ మరణం, సాండర్స్ హత్యల తరువాత 1928లో భారత్ లోని వర్ధమాన రాజకీయ పరిస్థితిపై నివేదికను కోరుతూ సర్ జాన్ సైమన్ నేతృత్వంలో బ్రిటీష్ ప్రభుత్వం ఒక కమిషన్‌ను ఏర్పాటు చేసింది.

ఫిరోజ్ పూర్లో బ్రిటిష్ పోలీసు అధికారి జె.పి.సాండర్స్ ను హత మార్చినందుకు గాను వారికి 1930లో అక్టోబర్ 7వ తేదీని ఈ మరణ శిక్షను ఖరారు చేశారు.

భగత్ సింగ్ సహా ముగ్గురికి ఉరిశిక్ష ఖరారు చేసిన తీర్పు వివరాలను 2015లో ప్రచురించారు. Warrant of Execution On Sentence Of Death అనే విడుదల చేసిన పత్రంలో 1930 అక్టోబర్ 7వ తేదీన ఉరిశిక్ష విధిస్తూ తీర్పిచ్చినట్లు స్పష్టంగా ఉంది. 1931, మార్చి 23న ఉరిశిక్ష అమలు చేసినట్లు మరో పత్రంలో వివరాలు ఉన్నాయి. జైలు సూపరింటెండెంట్ సంతకం చేసిన పేపర్‌ను టైమ్స్ ఫ్యాక్ట్ చెక్ గుర్తించి బహిర్గతం చేసి, లాహోర్ లోని పంజాబ్ శాఖలో ఈ పత్రాలను ఇటీవల ప్రదర్శనకు ఉంచారు.

1930 అక్టోబర్ 7 న న్యాయ స్థానము తీర్పును వెలువరించింది. తీర్పు 281 పేజీల్లో ఇవ్వబడింది. విచారణ ఎదుర్కొన్న వారందరికీ ఇలా శిక్షలు ఇవ్వబడ్డాయి. ఉరిశిక్ష: 1.భగత్ సింహ్ 2. సుఖ:దేవ్ 3. రాజగురులకుబీ అలాగే ఆజన్మాంతర జీవిత ఖైదు: 1.కిశోరీలాల్ 2. మహావీర్ సింహ్ (అండమాన్లో 9 రోజులు నిరాహార దీక్ష చేసి అమరుడయ్యాడు. 3. విజయ్ కుమార్ సింహ్ 4. శివవర్మ 5. గయా ప్రసాద్ 6. జయ దేవ్ కపూర్ 7. కమల్నాథ్ తివారిలకుబీ అలాగే జీవిత ఖైదు: 1.కుందాన్లాల్ ( 7 సంవత్సరాలు) 2. ప్రేమదత్ ( 5 సంవత్సరాలు)లకుబీ అలాగే

అజయ్ ఘోష్, సురేంద్రనాథ్ పాండియ ఇంకా జితేంద్రనాథ్ సన్యాల్ లను విడిచి పెట్టారు. విచారణ లో ఉన్నవారందరూ కోర్టులను బహిష్కరించడం వలన తీర్పును లాహోర్ లోని సెంట్రల్ జైలు లో వినిపించారు.

తమను యుద్ధ ఖైదీలుగా గుర్తించడం ద్వారా ఉరి తీయకుండా కాల్పుల బృందం చేత హతమార్చాలని జైలులో ఉన్నప్పుడు భగత్ సింగ్ , మరో ఇద్దరు వైస్రాయికి లేఖ రాశారు. క్షమాభిక్ష ముసాయిదా లేఖపై సంతంకం కోసం భగత్ సింగ్ మిత్రుడు ప్రన్నత్ మెహతా ఆయన్ను ఉరితీయడానికి నాలుగు రోజుల ముందు మార్చి 20న జైలులో కలిశాడు. అయితే సంతకం చేయడానికి సింగ్ నిరాకరించాడు. మార్చి 23న ఉరితీసినట్లు జైలు అధికారులు మరణ ధ్రువీకరణ పత్రాన్ని విడుదల చేశారు. అప్పటి సూపరింటిండెంట్ ఆఫ్ పోలీస్ వి.ఎన్. స్మిత్ ప్రకారం, భగత్ సింగ్‌ను ముందుగానే ఉరితీశారు. సాధారణంగా ఉదయం 8 గంటలకు ఉరితీసేవారు. అయితే ఏమి జరిగిందో ప్రజలు తెలుసుకునే లోగానే ఆయన్ను ఉరితీయాలని నిర్ణయించుకుని..సుమారు రాత్రి 7 గంటల ప్రాంతంలో ఉరి తీశారు.

భగత్ సింగ్ వీర మరణం వృథా కాలేదు, ఎందరో యువకులను భారత స్వాతంత్ర్యోద్యమము వైపుకు మరల్చింది.

భగత్ సింగ్ మరణం భారత స్వాతంత్ర్యోద్యమ కొనసాగింపుకు సాయపడేలా వేలాది మంది యువకుల్లో స్ఫూర్తిని నింపింది. ఆయన ఉరి అనంతరం ఉత్తర భారతాన పలు ప్రాంతాల్లో బ్రిటీష్ ప్రభుత్వమునకు వ్యతిరేకంగా నిరసన ప్రదర్శనలు వెల్లువెత్తాయి.

**రామ కిష్టయ్య సంగన భట్ల**
**9440595494**

# "వాంగ్‌చుక్" అరెస్టుతో లద్దాఖ్‌లో కల్లోలం




లద్దాఖ్, భారతదేశం యొక్క ఉత్తర హిమాలయాల్లో ఒక సుందర మైన, సున్నితమైన ప్రాంతం. ఇక్కడి ప్రజలు ప్రకృతి, సంస్కృతి, భద్రతల మధ్య సమతుల్యంగా జీవిస్తూ వచ్చారు. కానీ 2019లో ఆర్టికల్ 370 రద్దు తర్వాత, ఈ సమతుల్యత దెబ్బతిన్నది. లద్దాఖ్‌ను కేంద్రపాలిత ప్రాంతంగా మార్చిన కేంద్ర ప్రభుత్వం, స్థానికులకు రాష్ట్ర హోదా ఇస్తూ,6వ, షెడ్యూల్ లో చేర్చాలనీ, గిరిజన హక్కులు , విద్యా, సాంకేతిక హక్కులకు రక్షణ అందించాలని స్థానిక గిరిజనులు డిమాండ్ చేస్తున్నారు. బీజేపీ కేంద్ర ప్రభుత్వం గతంలో ఈ విషయంలో వాగ్దానాలు కూడా చేసింది. కానీ, ఆ వాగ్దానాలు కేవలం ఎన్నికల ఆయుధాలుగానే మిగిలాయి. భూమి పైన హక్కులు కోల్పోవడం, ఉద్యోగాల్లో స్థానికులకు ప్రాధాన్యత లేకపోవడం, పర్యావరణ నాశనం ఇవి లద్దాఖ్ ప్రజల్లో అసంతృప్తిని పెంచాయి. ఈ నేపథ్యంలో, ప్రముఖ పర్యావరణవాది, విద్యావేత్త సోనమ్ వాంగ్‌చక్ నేతృత్వంలో జరిగిన శాంతియుత ఆందోళనలు హింసా త్మక ఘటనలకు దారితీసాయి. సెప్టెంబర్ 24న లెహ్‌లో జరిగిన ఆందోళనలో నలుగురు మృతి చెందారు, 80 మంది గాయపడ్డారు. రెండు రోజుల తర్వాత, 26న వాంగ్‌చక్‌ను జాతీయ భద్రతా చట్టం (ఎన్ఎస్ఏ) కింద అతనిని పోలీసులు అరెస్టు చేసి, జోధ్‌పూర్ జైలుకు తరలించారు. ఈ సంఘటన భారత ప్రజాస్వామ్యానికి ఒక ముఖ్యమైన హెచ్చరిక. ఇది కేవలం ఒక వ్యక్తి అరెస్టు కాదుబీ ప్రజల గొంతును, ప్రజాస్వామ్య హక్కులను అణచివేసే ఒక వ్యవస్థాగత నియంతృత్వ అధికార ప్రయత్నం.

ఈ సంఘటన పూర్వాపరాలు చూస్తే, వాంగ్‌చక్ ఒక సామాన్యుడు కాదు. '3 ఇడియట్స్' సినిమాలో ఫూన్‌సుఖ్ వాంగ్‌డూ పాత్రకు ప్రేరణ, సెక్మాల్ విద్యా సంస్థ స్థాపకుడు, సౌర టెంట్లు, ఐస్ స్తూపాలు వంటి ఆవిష్కరణలతో భారత సైనికులకు, స్థానికులకు సేవ చేసినవాడు. అతని ఆందోళనలు ఎప్పుడూ అహింసాత్మకమే, ఫక్తు గాంధేయ వాది. ఆశ్రమ జీవితం, నిరాహార దీక్షలు, శాంతియుత మార్చ్‌లు ఆయన పోరాట విధానాలు. 2019 తర్వాత లద్దాఖ్ ప్రజలు భూమి హక్కులు, ఉద్యోగాలు, పర్యావరణ రక్షణ కోసం పోరాడుతున్నారు. బీజేపీ ప్రభుత్వం 2019 ఎన్నికల్లో 'లద్దాఖ్‌కు పూర్తి రక్షణ' అని చెప్పి ఓట్లు తీసుకుంది. కానీ ఆ తర్వాత? పెద్ద కంపెనీలు గనులు, ప్రాజెక్టులతో పర్యావరణాన్ని ధ్వంసం చేస్తున్నారు. స్థానికులు ఉద్యోగాలు కోల్పోతున్నారు. ఈ అసంతృప్తి 2023 నుంచి పెరిగి, 2025 సెప్టెంబర్‌లో లెహ్ ఆందోళనల రూపంలో హింసాత్మకంగా మారాయి. పోలీసులు లాఠీఛార్జ్, టియర్ గ్యాస్ ఉపయోగించడంతో హింస పెరిగింది. దీనికి బదులుగా, ప్రభుత్వం వాంగ్‌చక్‌ను దోషులుగా చూపించ డానికి ప్రయత్నిస్తోంది. అతని 'చైనా దాడి చేస్తే ఆపరాదు, మార్గం చూపిస్తాం' అనే ప్రసంగాన్ని తప్పుడు సందర్భంలో చూపిస్తున్నారు. ఇది ఒక స్పష్టమైన దోషారోపణలు, ప్రజల అసంతృప్తిని మర్చిపోయి, ఒక వ్యక్తిని లక్ష్యం చేస్తున్నది.

దేశంలో ప్రజల స్పందనలు తీవ్రంగా ఉన్నాయి. వాంగ్‌చక్ అరెస్టు తర్వాత ఢిల్లీలో క్యాండిల్ లైట్ మార్చ్‌లు జరిగాయి. విద్యార్థులు, పర్యావరణవాదులు 'ఫ్రీ సోనమ్ వాంగ్‌చక్' క్యాంపెయిన్‌లు చేపట్టారు. సోషల్ మీడియాలో " జస్టిస్ ఫర్ సోనమ్ వాంగ్ చుక్" ఫ్రీ సోనమ్ వాంగ్ చుక్" అంటూ హ్యాష్‌ట్యాగ్‌లు వైరల్ అయ్యాయి.

ప్రజలు ఇది 'అహింసావాదిని అణచివేత' అని, లద్దాఖ్ ప్రజల హక్కు ల పోరాటానికి ఒక దెబ్బ, అని భావిస్తున్నారు. మరికొందరు, ప్రభుత్వ ఆరోపణలను నమ్ముతూ, 'పాకిస్తాన్ లింకులు' ఉన్నాయని, అతని అరెస్టు సమంజసమే"నని అంటున్నారు. కానీ ఇది మైనారిటీ అభిప్రాయం. ఎక్కువమంది ప్రజలు బీజేపీపై 'వాగ్దానాలు మరచి పోయి, నియంతృత్వతో అణచివేస్తున్నారు' అని విమర్శిస్తున్నారు. విపక్షాల స్పందనలు మరింత తీవ్రంగా ఉన్నయి. కాంగ్రెస్ పార్టీ 'మోదీ ప్రభుత్వం లా అండ్ ఆర్డర్ వైఫల్యానికి దారులు వేస్తోంది' అని, దిగ్విజయ సింగ్ వంటి నాయకులు 'గాంధీయన్‌ను ఎన్ఎస్ఏ కింద అరెస్టు చేయడం అన్యాయం' అని అన్నారు. ఏఏపీ అభినవ్ మిస్త్రీ 'ఇది డిక్టేటర్‌షిప్ డిస్‌గైజ్' అని, "తాము...లద్దాఖ్ ప్రజలతోనే ఉన్నామని" ప్రకటించింది. ఒమర్ అబ్దుల్లా 'అన్‌ఫార్చునేట్' అని, బీజేపీ బ్యాక్‌ట్రాక్ అయిందని విమర్శించారు. సిపిఆర్(ఎమ్ఎల్) వంటి పార్టీలు 'జుడీషియల్ ఇంక్వైరీ' కోరాయి. విపక్షాలు బీజేపీ ఆరోపణలను 'స్మియర్ క్యాంపెయిన్'గా చూస్తున్నారు. పాకిస్తాన్ లింకులు, విదేశీ ఫండింగ్ ఆరోపణలు నిరాధారాలు అనీ, అవి కేవలం కల్పిత దోషారోపణలు మాత్రమే అని వాదిస్తున్నారు. ఇది 2019 వాగ్దానాల వైఫల్యాన్ని కప్పిపుచ్చే ప్రయత్నమని, బీజేపీ ప్రభుత్వం "ప్రజాస్వామ్యాన్ని బలహీనపరుస్తోందని "అనేక విమర్శలు వస్తున్నాయి.

విదేశాల్లో స్పందనలు చూస్తే భారత ప్రజాస్వామ్య సంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. న్యూయార్క్ టైమ్స్ 'పాపులర్ లీడర్‌ను డిటేన్ చేసిన భారత్' అని, ప్రభుత్వ అత్యాచారానికి ముఖ్యమైన చిహ్నంగా వాంగ్‌చక్‌ను చూపించింది. గార్డియన్ 'మోదీ ద్వారా వైలెంట్ క్రాక్‌డౌన్ తర్వాత అరెస్టు' అని, లద్దాఖ్ ఆటానమీ కోసం పోరాడటాన్ని హైలైట్ చేసింది. అల్ జజీరా 'డెడ్లీ ప్రొటెస్ట్స్ తర్వాత అరెస్టు' అని, నలుగురు మరణాలు, గాయాలు గురించి వివరించింది. రాయిటర్స్ 'లద్దాఖ్ ప్రొటెస్ట్స్ తర్వాత వాంగ్‌చక్ అరెస్టు' అని, న్యూ ఢిల్లీ ఆరోపణలను ప్రస్తావించింది. ఈ మీడియా రిపోర్టులు భారతంలో మీడియా స్వేచ్ఛపై కూడా ప్రశ్నలు లేవనెత్తుతున్నాయి. దేశీయ మీడియాలో కొందరు ప్రభుత్వ వైపు మాట్లాడుతూ, 'పాకిస్తాన్ లింకులు'ను ఎక్కువగా చర్చిస్తున్నారు. కానీ స్వతంత్ర మీడియా, ధి వైర్ వంటివి 'పొలిటికల్ రియాక్షన్స్'లో విపక్షాల విమర్శలను ప్రస్తావిస్తూ, దమనాన్ని హైలైట్ చేస్తున్నాయి. మీడియాలో స్పందనలు రెండు భిన్న ధోరణుల విభజన కనపడుతున్నాయి. ప్రభుత్వ మద్దతుదారులు బీజేపీ ధోరణిలో ఆరోపణలను ప్రచారం చేస్తున్నారు. కానీ, స్వతంత్ర మీడియా ప్రజల ఆవాజ్ ను పెంచుతోంది. బీజేపీ ప్రభుత్వ ఆరోపణలపై ప్రజలు, విపక్షాలు విడిపోయి ఎవరి వాదనలు, వారు చేస్తున్నారు? 'పాకిస్తాన్, ఇంటెల్ ,ఆపరేటివ్‌తో లింకులు' అనే ఆరోపణలు చేస్తున్నారు.కానీ ఆధారాలు చూపించటం లేదు. కేవలం డివర్షన్ కోసమని విమర్శిస్తున్నారు. లద్దాఖ్ డీజీపీ 'పాక్ పిఐఓ అరెస్టు, వాంగ్‌చక్‌తో కాంటాక్ట్' అని చెప్పినా, ఇది కోర్టులో నిరూపించాలని ప్రజలు కోరుతున్నారు. వాంగ్‌చక్ ఎన్‌జీఓ ఎఫ్‌సిఆర్ఏ లైసెన్స్ ను కేంద్ర ప్రభుత్వం రద్దు చేయటం కూడా రాజకీయ హేతువుగానే అక్కడి వారు అంటున్నారు. ఇది కేవలం లద్దాఖ్‌కు మాత్రమే పరిమితం కాదు. దేశవ్యాప్తంగా అహింసావాదులను ఏదో ఒక నెపంతో అణచి వేసే సంకేతం. ఎన్ఎస్ఏ చట్టం, ట్రయల్ లేకుండా డిటెన్షన్ అనుమతించడం, ప్రజాస్వామ్యానికి విరుద్ధం. బీజేపీ 'నేషనల్ సెక్యూరిటీ' పేరుతో ప్రజల హక్కులను విఛిన్నం చేస్తోంది. ఇది 2019 వాగ్దానాల వైఫల్యాన్ని చూపిస్తుంది – లద్దాఖ్ ప్రజలు భారతీయులే, వారి ఆవాజు అణచివేయకూడదు.

ఈ సంఘటన భారత ప్రజాస్వామ్యానికి ఒక పాఠం. వాంగ్‌చక్ విడుదల చేసి, లద్దాఖ్ డిమాండ్ల పై చర్చలు జరపాలి. లేకపోతే, ఈ ఆవేశం మరింత పెరిగి, దేశ ఐక్యతకు ఆటంకం కావచ్చు. ప్రభుత్వం దమనం కాకుండా, సంభాషణ మార్గం ఎంచుకోవాలి. లద్దాఖ్ ప్రజల పోరాటం, వాంగ్‌చక్ ధైర్యం – ఇవి భారత భవిష్యత్తుకు ఆశలు. కానీ దమనం కొనసాగితే, ప్రజాస్వామ్యం ఒక భ్రమ మాత్రమే అవుతుంది.



**డాక్టర్ కోలాహలం రామ్ కిశోర్**
**9849328496.**



# "కలలని డిజైన్ చేసి, నిజం చేసిన ప్రయాణం"

ప్రతి కలను నిజం చేయాలంటే ధైర్యం, కృషి, నమ్మకం - ఈ మూడు అవసరం. నా ఇంటీరియర్ డిజైన్ ప్రయాణం కూడా అంత తేలికైనది కాదు. చాలా మందిలాగే నేను కూడా ఇంజినీరింగ్ పూర్తి చేసుకున్నాను. కానీ అది నా హృదయానికి తృప్తి ఇవ్వలేకపోయింది. అప్పుడే గ్రహించాను - "వృత్తి అనేది కేవలం ఉద్యోగం కాదు, మనసుకు నచ్చిన దారే జీవితం" అని. డిజైన్ పట్ల ఉన్న ఆసక్తి నన్ను మరో మార్గంలో నడిపించింది.

డిజైన్ కోర్సు చేసి, స్టూడియోలలో, కార్పొరేట్లలో, ఫ్రీలాన్స్ ప్రాజెక్టులలో అనుభవం సంపాదించాను. ప్రతి దశలో కొత్త విషయాలు నేర్చుకున్నాను. కానీ నా అంతరాత్మ ఎప్పుడూ ఒక్కటే చెప్పేది - "సొంత డిజైన్ సంస్థను స్థాపించాలి" అని.

రోజు రాత్రి శ్రమించి, కలను వాస్తవం చేసుకున్న క్షణం ఒక సంవత్సరం క్రితం వచ్చింది. ద్రిత ఇంటీరియర్ స్టూడియో ఆరంభమైంది. ఆ రోజునుంచి వెనుదిరిగి చూసే పని లేదు

వ్యాపారం అంటే ఎత్తుపల్లాలు సహజం. కానీ కస్టమర్ అవసరాలను లోతుగా అర్థం చేసుకుని, వారికి సరిపోయే పరిష్కారం ఇవ్వడం నా విధానం. ఇదే నాకు ఆనందాన్ని ఇస్తుంది, ఇదే క్లయింట్ నమ్మకాన్ని సంపాదిస్తుంది. కొన్నిసార్లు అందరికీ నచ్చకపోయినా, ప్రతి అనుభవం ఒక పాఠం. ఆ పాఠాలే నన్ను ఇంకా ముందుకు నడిపిస్తున్నాయి.


ద్రిత ఇంటీరియర్ స్టూడియో నాకు కేవలం వ్యాపారం కాదు - ఇది నా కలల పథం, నా ఆత్మసంతృప్తి, నా సృజనాత్మకతకు రూపం.

"డిజైన్ అనేది కేవలం గోడలు అలంకరించడం కాదు, ప్రతి ఇంటికి ఒక కొత్త జీవనశైలి ఇవ్వడం"
- ఇదే నా నమ్మకం.

**రోహిత**
ద్రిత ఇంటీరియర్ స్టూడియో
స్థాపకురాలు, ప్రిన్సిపల్ డిజైనర్

# గుర్రం జాషువా

## అణచివేతకు వ్యతిరేక స్వరం



తెలుగు సాహిత్యంలో సమానత్వం, స్వేచ్ఛ, మానవతా విలువలకు ప్రతీకగా నిలిచిన మహాకవి గుర్రం జాషువా గారి పేరు శాశ్వతంగా నిలుస్తుంది. 1895 సెప్టెంబర్ 28న గుంటూరు జిల్లా తెనాలి సమీపంలోని పేద కుటుంబంలో జన్మించినారు. జాషువా తండ్రి వెనుకబడిన యాదవ కులానికి చెందినవారు, తల్లి మాదిగ కులమునకు చెందిన వారు కావడంతో..చిన్ననాటి నుంచే అనేక అవమానాలు, అన్యాయాలు అనుభవించారు. కుల వివక్షత, సామాజిక అణచివేత, విద్యలో ఎదురైన అవరోధాలు ఆయన మనసులో గాఢమైన ముద్రవేసాయి. ఈ బాధలే ఆయనలో తిరుగుబాటు స్వభావాన్ని రగిలించి, ఆయన కవిత్వానికి విత్తనాలయ్యాయి.

**జీవిత నేపథ్యం**

గుర్రం జాషువా గారు ఉపాధ్యాయుడిగా, తరువాత కవిగా, రచయితగా తన కృషి కొనసాగించారు. ఆయనకు సంప్రదాయ విద్యలో అవకాశాలు తక్కువైనా, స్వయంకృషితో జ్ఞానం పెంచుకున్నారు. చదువు, ఉద్యోగం, జీవన మార్గంలో అనుభవించిన ప్రతి అణచివేత, అన్యాయం ఆయన కవిత్వానికి ప్రాణం పోసింది.

**సాహిత్యంలో ఆశయాలు..**

జాషువా గారి రచనలు కేవలం సాహిత్య సౌందర్యం కోసం రాయబడినవికాదు. అవి సామాజిక మార్పు కోసం రాసిన శబ్దాయుధాలు. ఆయన కవిత్వంలో కనిపించే ప్రధాన అంశాలు:

**మానవ సమానత్వం..**

కులం, మతం, జాతి ఆధారిత అన్యాయాలకు వ్యతిరేకత శ్రమజీవుల గౌరవం

అణగారిన వర్గాల ఆత్మగౌరవం సత్యం, న్యాయం, స్వేచ్ఛకు ప్రాధాన్యం "గబ్బిలం" – చీకటిని దహించే ఆయన ప్రసిద్ధ కృతి "గబ్బిలం" సమాజంలోని చీకటి మూలాలను వెలికి తీస్తుంది. చీకటిలో తిరిగే గబ్బిలం ప్రతీకగా నిలిచి, అజ్ఞానాన్ని, దౌర్భాగ్యాన్ని, దోపిడీని సూచిస్తుంది. ఈ కవిత ద్వారా జాషువా గారు చీకటిని తొలగించి జ్ఞానజ్యోతి వెలిగించే అవసరాన్ని ఆవిష్కరించారు. ఇది కేవలం కవిత్వం కాదు, సామాజిక చైతన్య గీతం.

**భాషా శైలి..**

జాషువా కవిత్వ భాష సులభం, సూటిగా ఉంటుంది. అలంకారాలతో నిండిన కవిత్వం ఆయన లక్ష్యం కాదు. ప్రజల హృదయాల్లో ప్రతిధ్వనించే, వారిని ఆలోచింపజేసే, పోరాటానికి ప్రేరేపించే పదాలను ఆయన వాడారు. ఈ సరళ భాషలోని స్ఫోటక శక్తే ఆయనను ప్రత్యేక కవిగా నిలబెట్టింది.

**సామాజిక ప్రభావం..**

జాషువా కవిత్వం అణగారిన వర్గాలకు ధైర్యం ఇచ్చింది. "మనకూ గౌరవం ఉంది, మనకూ హక్కులు ఉన్నాయి" అనే భావనను ఆయన కవిత్వం లోపలినుంచి వెలికితీసింది. ఆయన రచనలు పుస్తకాలలో మాత్రమే కాదు, సమాజంలోని ప్రతి శ్రామికుడి నోట గీతమయ్యాయి. అణచివేతను ప్రశ్నించే ధైర్యం, సమానత్వాన్ని సాధించే సంకల్పం ఆయన సాహిత్యం ద్వారా వ్యాపించాయి.

గుర్రం జాషువా గారి కవిత్వం, ఆయన జీవితం రెండూ అణచివేతకు వ్యతిరేక పోరాటానికి చిహ్నాలు. ఆయన పదాలు ప్రతి అణగారిన హృదయంలో జ్వాలలు రగిలించి, సమానత్వం, న్యాయం, మానవతా స్వప్నాలను సజీవంగా నిలిపాయి. అందుకే తెలుగు సాహిత్యంలో ఆయనను "సమానత్వ దీప్తి", "అణచివేతకు వ్యతిరేక స్వర కవి"గా గౌరవిస్తారు.

ఆయన ఆశయాలు నేటికి నెరవేరకపోగా!..ఇంకా సమాజంలో వివక్ష రూపాంతరం చెంది కొనసాగుతూనే ఉంది?. ఆయన ఆశయాలు నెరవేరి, అణచివేత తొలగిపోయి సమానత్వ సాధించినప్పుడే వారికిచ్చే నిజమైన నివాళులు. అప్పుడే వారి ఆత్మకు శాంతి కలుగుతుంది ఆ వైపుగా ప్రభుత్వాలు సమాజం నడవాల్సి ఉంది.

**మేకిరి దామోదర్,**
సామాజిక విశ్లేషకులు, జిల్లా: వరంగల్, ఫోన్ :9573 666650.



తెలంగాణ సంస్కృతికి సంప్రదాయాలకు నిలువెత్తు రూపం, నిలువెత్తు నిదర్శనం.. తెలంగాణ సంస్కృతీ, సంప్రదాయాలను ప్రతిబింబిం మన బతుకమ్మ పండుగ వాతావరణం.. బతుకమ్మ కవిత రచనలు..

## తెలంగాణ ప్రతిబింబం బతుకమ్మ పండుగ సంబరం!!

గుత్తి పువ్వు గుండెల స్నేహం,
తంగేడు పువ్వు తల్లితన సుగంధం,
బంతి పువ్వు నవ్వుల పరిమళం,
గుమ్మడిపువ్వు ఆశల వెలుగులు.

ప్రతి పూల దళం ఓ జ్ఞాపకమై,
ప్రతి రంగు ఓ భావనగా నిలిచి,
బతుకమ్మపై అలంకరించబడుతుంది,
ఆడవాళ్ల మమకార ప్రతిబింబంగా
మారుతుంది.

పూలతో పూసిన పల్లె తోటల గుండెలో,
సువాసనలతో పరిమళించే మట్టిలో,
తల్లుల ఆరాధనతో, చెల్లెళ్ల అనురాగంతో
జన్మించినది తెలంగాణ పూల జాతర.

గుత్తి, తంగేడు, గుమ్మడిపువ్వుల గలగలతో,
మల్లె, బంతి, గన్నేరు పరిమళాలతో,
మంచినీటి చెరువుల ఒడ్డున అలరారే
అమ్మతనం సాక్ష్యమే ఈ జాతర.

ఇది పూల జాతర మాత్రమే కాదు,
మన చరిత్రలోని సత్య స్వరము,
మన సంస్కృతిలోని సౌందర్య దీపము,
మన గౌరవంలో వెలసిన పసిడి ప్రతీకము.
బతుకమ్మ అంటే మన జీవన మకరందం,
తెలంగాణ ఆత్మకు శాశ్వత ఆభరణం.



**రైటర్ రాజు**
(యువ కవి – అరుణ రైటింగ్స్)
తెలంగాణ యూనివర్సిటీ, నిజామాబాద్.

## అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలి

- ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి



**తాండూరు, సెప్టెంబర్ 27 (జనంసాక్షి) :** అధునాతన సాంకేతిక కేంద్రం (ఎటిసి) నూతన భవన ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి హాజరై ఎటిసి సెంటర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇవి ఒకప్పటి ఐటీఐలు కావు.. నైపుణ్యానికి, నాణ్యతను అందించే వేదికలు మన ఏటీసీలు నియోజకవర్గ యువతకు ప్రపంచ స్థాయి నైపుణ్యాలను అందించే దిశగా ఏటీసీ సెంటర్ల ఏర్పాటు చేశాం.తాండూరులో 172 సీట్లకు గాను పూర్తిగా భర్తీ కావడం సంతోషకరం, ప్రిన్సిపల్ కు, విద్యార్థులకు అభినందనలు తెలిపారు. గత పాలకుల పాలనలో అభివృద్ధి పేపర్లకే పరిమితం అయ్యిందని ఎద్దేవ చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్, ప్రజాప్రతినిధులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## కొండా లక్ష్మణ్ బాపూజీ సేవలు చిరస్మరణీయం

- మున్సిపల్ కమిషనర్ బి. యాదగిరి



**తాండూరు, సెప్టెంబర్ 27 (జనంసాక్షి) :** స్వాతంత్ర్య సమరయోధులు కొండా లక్ష్మణ్ బాపూజీ సేవలు చిరస్మరణీయమని మున్సిపల్ కమిషనర్ బి యాదగిరి పేర్కొన్నారు. శనివారం కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతిని పరిష్కరించుకుని మున్సిపల్ కార్యాలయంలో జయంతి వేడుకలు నిర్వహించారు.ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ యాదగిరి కొండలక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ బి యాదగిరి మాట్లాడుతూ నిబద్ధత కలిగిన నాయకుడిగా వెనుకబడిన వర్గాల అభ్యున్నతే ధ్యేయంగా తెలంగాణ కోసం పోరాడిన గొప్ప వ్యక్తిగా కొండా లక్ష్మణ్ బాపూజీ చరిత్రలో నిలిచిపోతారని కొనియాడారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ బి యాదగిరి, టీఈ మణిపాల్, మున్సిపల్ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

## స్థానిక సంస్థల ఎన్నికల కోసం రిజర్వేషన్ల కేటాయింపు

- జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 27 (జనంసాక్షి) :** స్థానిక సంస్థల ఎన్నికల రిజర్వేషన్ల కేటాయింపు కొరకై శనివారం నాడు రంగారెడ్డి జిల్లా సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని సమావేశ మందిరంలో జిల్లా పరిషత్ సిఈఓ కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో కలిసి గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో మహిళా రిజర్వేషన్ల కేటాయింపు ప్రక్రియ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి స్థానిక సంస్థల ఎన్నికలలో భాగంగా జిల్లాలోని జెడ్పిటిసి ఎంపిపి స్థానాల కొరకు ఎస్టి ఎస్సి బిసి జనరల్ రిజర్వేషన్లకు సంబంధించి మహిళా రిజర్వేషన్ కొరకు లాటరీ పద్ధతిన కేటాయింపు నిర్వహించారు. 2011 జనాభా లెక్కల ప్రకారం ఎస్సి ఎస్టి రిజర్వేషన్లు బిసి డెడికేషన్ కమిటీ నివేదిక ప్రకారం బిసి రిజర్వేషన్ చేపట్టడం జరిగిందని తెలిపారు జెడ్పిటిసి కొరకు 3 ఎస్టి 4ఎస్సి 9 బిసి 5 సాధారణ స్థానాలు కేటాయించడం జరిగిందని వీటిలో 9 స్థానాలు మహిళలకు కేటాయించడం జరిగిందని తెలిపారు ఎంపిపి కొరకు 3 ఎస్టి 4 ఎస్సి 9 బిసి 5 సాధారణ స్థానాలు కేటాయించడం జరిగిందని వీటిలో 9 స్థానాలు మహిళలకు కేటాయించడం జరిగిందని తెలిపారు. సంబంధిత రిజర్వేషన్ స్థానాల కేటాయింపు వివరాలను ప్రభుత్వానికి నివేదించడం జరుగుతుందని తెలిపారు ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు రాజకీయ పార్టీల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## సమిష్టిగా ఉండి సమస్యలపై పోరాడండి

- టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య



**హయత్‌నగర్, సెప్టెంబర్ 27 (జనం సాక్షి) :** తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ సభ్యులంతా సమన్వయంతో సమిష్టిగా జర్నలిస్టుల సమస్య లపై పోరాడాలని ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య పిలుపునిచ్చారు. టీడబ్ల్యూజేఎఫ్ రంగారెడ్డి జిల్లా మూడవ మహా సభల సందర్భంగా జరిగిన ఎన్నికల్లో ఎల్బీ నగర్ నియోజకవర్గం నుంచి ఏకగ్రీవంగా ఎన్నికైన రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు పొట్లపల్లి అశోక్ కుమార్ గౌడ్, రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు సానెం శ్రీనివాస్ గౌడ్, సంయుక్త కార్యదర్శి గడ్డం సత్యనారాయణ గౌడ్ లు శనివారం ఎల్బీనగర్ లో రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా కమిటీలలో కొత్తగా ఎన్నికైన సభ్యులు యూనియన్ నియమ, నిబంధనలకు లోబడి పని చేయాలని, స్థానిక జర్నలిస్టుల సమస్యలపై దృష్టి సారించి, ఐక్యతతో హక్కుల సాధనకు కృషి చేయాలని వారు సూచించారు. వృత్తిలో నైపుణ్యతను, పనిలో పట్టుదలను పెంపొందించుకొని, క్రమశిక్షణతో కర్తవ్యాలను నెరవేర్చి సంఘం ప్రతిష్టలను పెంచాలని ఆయన కోరారు. జిల్లా కమిటీలో ఎన్నికైన ఎల్బీ నగర్ నాయకులను వారు అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎం. అశోక్, ఎల్బీనగర్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ సలహాదారు ఎస్. కిరణ్, గిలకత్తుల శ్రీనివాస్ గౌడ్, యాకన్న, వెంకట్, రామచంద్రం, తదితరులు పాల్గొన్నారు.

# కన్నెర్ర చేసిన కాగ్న

- 120 పశువుల గల్లంతు...
- కాగ్న బ్రిడ్జిపై పది పశువులు ఉన్నట్లు సమాచారం
- సీతమ్మ చెరువుకు గండి
- జలదిగ్బంధంలో గ్రామాలు
- వాగులో ఇరుక్కుపోయిన లారీ డ్రైవర్ క్లీనర్‌ను రక్షించిన పోలీసులు
- అంధకారంలో గ్రామాలు
- వరద ముంపు పర్యటించిన ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి





**వికారాబాద్ జిల్లా బ్యూరో, సెప్టెంబర్ 27 (జనం సాక్షి) :** చరిత్రలో కనివిని ఎరగని రికార్డు స్థాయిలో జిల్లాలో వర్షం కురిసింది. వరద గ్రామాల్లో బీభత్సం సృష్టించింది. కాగ్నా ఉగ్రరూపం తో పక్కనే ఉన్న పశువులు గల్లంతయ్యాయి . చెరువులకు గండ్లు పడి వందలాది ఎకరాల పంట నష్టం జరిగింది. వర్షానికి అనేక ఇండ్లు కూలిన ప్రాణ నష్టం జరగలేదు. వాగులో చిక్కుకున్న లారీ డ్రైవర్ క్లీనర్ ను పోలీసులు రక్షించారు. వరద ముంపు గ్రామాల్లో ఎమ్మెల్యే పర్యటించారు వివరాల్లోకి వెళితే... తెలంగాణ రాష్ట్ర శాసనసభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న వికారాబాద్ జిల్లాలో వర్షం బీభత్సం సృష్టించింది.

తాండూర్, వికారాబాద్, కొడంగల్ నియోజకవర్గంలో అతి భారీ వర్షం కురిసింది. చరిత్రలో మునుపెన్నడూ లేని విధంగా రికార్డు స్థాయిలో వర్షం కురిసినట్లు తాండూర్ ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లారు. వర్షం కారణంగా నష్టపోయిన వాటికి అంచనా వేయడానికి ఒక బృందాన్ని పంపిస్తానని సీఎం రేవంత్ రెడ్డి తాండూర్ ఎమ్మెల్యే మనోహర్ రెడ్డికి హామీ ఇచ్చినట్లు తెలియజేశారు. కాగ్నానది శుక్రవారం అర్ధరాత్రి ఉగ్రరూపం దాల్చింది. కర్ణాటక రాష్ట్రం చించోలి వాగు కాగ్న నది కలయికతో బషీరాబాద్ మండలం జీవనిగీ గ్రామ శివారులో ఉన్న మహబూబ్ నగర్ మాజీ ఎంపీ శ్రీనివాస్ రెడ్డి పొలంలో ఉన్న పాకలో నుంచి దాదాపు 122 పశువులు కాగ్న నదిలో గల్లంతయ్యాయి. ఈ పాకలో 132 పశువులు ఉండగా అర్ధరాత్రి అకస్మాత్తుగా వచ్చిన కాగ్న వరదలో కొట్టుకపోయాయి. పాక పైనుంచి దాదాపు 7 అడుగుల ఎత్తు నీటిమట్టంతో కాగ్న ఉధృతంగా ప్రవహించింది. దీంతో వరద తాకిడికి పశువులు కొట్టుకపోయాయి. కర్ణాటక సరిహద్దు దగ్గర ఉన్న కాగ్న బ్రిడ్జిపై పది పశువులు ఉన్నట్లు గుర్తించారు. మిగతా పశువుల జాడ లేకుండా పోయింది. అలాగే పెద్దెముల్ మండలం పాషాపూర్ తాండ దగ్గర ఉన్న సీతమ్మ చెరువుకు గండి పడింది. దీంతో రెండు గ్రామాల్లో ఉన్న చెరువుకు దిగువన ఉన్న పంట పొలాలు నీటిలో మునిగి పోయి దెబ్బతిన్నాయి. అలాగే గౌతాపూర్ 33/11 కె.వి విద్యుత్ సబ్ స్టేషన్ నీటిలో మునిగింది. విద్యుత్ సబ్ స్టేషన్ లోకి భారీగా వరద నీరు చేరడంతో విద్యుత్ సరఫరా నిలిపివేశారు. దీంతో అనేక గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో వర్షంలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. తాండూర్ మండలం వీర్ శెట్టిపల్లి గ్రామం లో కి భారీగా వరద నీరు చేరింది. కాగ్నా నదికి కొద్ది దూరంలోనే గ్రామం ఉన్నందున కాగ్నా నది వరద నీరంతా గ్రామంలోని ఇండ్లలోకి వెళ్లడం వలన ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. తాండూరు నియోజకవర్గం లో వరద ముంపు గురైన ప్రాంతాల్లో ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి అధికారులతో పర్యటించి పరిస్థితిని సమీక్షించారు. మరో రెండు రోజులపాటు వర్షాలు ఉన్న కారణంగా ప్రజలు ఎవరు తప్పని పరిస్థితుల్లో తప్ప ఇండ్లలో నుంచి బయటికి వచ్చి ప్రమాదానికి గురి కావద్దని ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

## పారిశుద్ధ్య కార్మికులకు 3 నెలలుగా అందని వేతనాలు

- దసరా పండుగకు పస్తులు ఉండాల్సిందేనా
- అప్పులు చేసి కుటుంబాన్ని నెట్టుకొస్తున్న వైనం
- సకాలంలో చెల్లించాలని వేడుకోలు




**బొంరాస్‌పేట, సెప్టెంబర్ 27 (జనం సాక్షి) :** గ్రామ పంచాయతీలకు నిధుల కొరత వేధిస్తుంది.సర్పంచుల పదవీకాలం ముగిసి ప్రత్యేక అధికారుల పాలన కొనసాగుతున్నప్పటి నుండి కేంద్ర ప్రభుత్వం నుండి 15 ఆర్థిక సంఘం నిధులు నిలిచిపోయాయి.గ్రామ పంచాయతీలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు మూడు నెలలుగా జీతాలు రాకపోవడంతో అలమటిస్తున్నారు.ఉదయం లేచింది మొదలు రాత్రి వరకు గ్రామంలో అన్ని రకాల పనులు చేస్తూ దుర్భర జీవితాన్ని గడుపుతున్నారు. జీతాలు సకాలంలో రాకపోవడంతో పూట గడవడం కోసం అప్పులు చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని ప్రభుత్వం ఇప్పటికైనా పండుగలోపు పెండింగ్ వేతనాలను చెల్లించి ఆదుకోవాలని కార్మికులు కోరుతున్నారు.

**గ్రామపంచాయతీలకు నిధులు రాక పంచాయతీ కార్యదర్శిల గోస**

గ్రామ పంచాయతీలకు సర్పంచుల పదవీకాలం ముగిసి ప్రత్యేక అధికారుల పాలన వచ్చినప్పటినుండి పంచాయతీ కార్యదర్శిలు హరిగోస పడుతున్నారు. గ్రామంలో పారిశుద్ధ్య పనుల్లో భాగంగా ట్రాక్టర్ డీజిల్, పైప్ లైన్ లీకేజీ మరమ్మత్తులు, బోరు మోటారు మరమ్మత్తులు, బ్లీచింగ్ పౌడర్,స్టేషనరీ వంటి వాటికి అప్పులు చేసి నెట్టుకొస్తున్నామని వాపోతున్నారు.

## యువత స్వయం ఉపాధితో ఆర్థికగాఅభివృద్ధి చెందాలి

- కాంగ్రెస్ పార్టీ మండల సీనియర్ నాయకులు పల్లగొల్ల అశోక్ యాదవ్



**మొయినాబాద్, సెప్టెంబర్ 27 (జనం సాక్షి) :** నిరుద్యోగ యువతీ యువకులు స్వయం ఉపాధిని ఎంచుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందుతూ కుటుంబ పోషణకు చేదోడువాదోడుగా ఉండాలని కాంగ్రెస్ పార్టీ మండల సీనియర్ నాయకులు పల్లగొల్ల అశోక్ యాదవ్ అన్నారు. శనివారము హిమైత్ నగర్ గ్రామంలో గ్రామానికి చెందిన సన్నీ స్వయం ఉపాధి కోసం శ్రీ శ్రీనివాస ఇన్సూరెన్స్ సర్వీసెస్ ఉపాధి కేంద్రాన్ని ఏర్పాటు చేసుకున్నారు. ఈ కేంద్రాన్ని ప్రారంభించడానికి ముఖ్య అతిథులుగా అశోక్ యాదవ్ పాల్గొని ఆయన ప్రారంభించారు. సందర్భంగా మాట్లాడుతూ ఉద్యోగయువతీ యువకులకు ప్రభుత్వము ఆర్థికంగా ఎంతో కృషి చేస్తుందని పేర్కొన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ద్వారా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిరుద్యోగ యువతకు ఎన్నో పథకాలు అమలు చేయడం జరుగుతుందన్నారు. శ్రీ శ్రీనివాస ఇన్సూరెన్స్ సర్వీసెస్ ఏర్పాటు చేసుకున్న సన్నీ నిరుద్యోగాన్ని నిర్మూలించుకునేందుకు ఎంతో అవకాశం ఉందన్నారు. ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు కష్టమర్లతో కలిసిమెలిసి అనుగుణంగా ఉన్నప్పుడే ఏర్పాటు చేసుకున్న స్వయం ఉపాధి అభివృద్ధి చెందినందుకు ఉంటుందని సూచించారు. హిమాయత్ నగర్ లో ఇన్సూరెన్స్ సర్వీస్ ఏర్పాటు ఎంతో మంచిదని అందరికీ ఉపయోగపడేలా ఉంటుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సదానంద గౌడ్ బైకని మల్లేష్, సంతోష్ గౌడ్, మధు, శేఖర్, సందీప్, అరుణ్ గౌడ్, ఎండి అలీ, శ్రావణ్ గౌడ్, ఎం.శీను, రోహిత్ గౌడ్, భారత్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## జీఎస్ఐ క్యాంపస్‌లో స్వచ్ఛతహి సేవ



**హయత్‌నగర్, సెప్టెంబర్ 27 (జనం సాక్షి) :** ఎల్.బి. నగర్, నాగోల్ లోని జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా క్యాంపస్‌లో నిర్వహించిన స్వచ్ఛత హి సేవ-స్వచ్ఛోత్సవ్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి, స్థానిక కార్పొరేటర్ కొప్పుల నర్సింహ్మా రెడ్డి, బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షులు వనిపల్లి శ్రీనివాస్ రెడ్డి లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి తో కలిసి జి.ఎస్.ఐ క్యాంపస్ లో వేస్ట్ టు వెల్త్ మోడల్స్ ను ప్రారంభించడం ఆనందకరమని వారు తెలిపారు. మన మహానగరంలో ప్రతిరోజూ జిహెచ్ఎంసి పారిశుద్ధ కార్మికులు చేస్తున్న కృషి ప్రశంసనీయం, వారి శ్రమ వలన మన నగరం పరిశుభ్రముగా, ఆరోగ్యవంతంగా ఉంటుందని వారు పేర్కొన్నారు. ఈ సందర్భంగా కిషన్ రెడ్డి వారిని అభినందించి, శాలువాలతో సత్కరించారు. జి.ఎస్.ఐ లోని పారిశుద్ధ కార్మికులకు కిట్లను పంపిణీ చేసి, వారిని కూడా శాలువాలతో సత్కరించారు. మా డివిజన్ పరిధిలో మరిన్ని స్వచ్ఛ భారత్ కార్యక్రమాలు నిర్వహించి ప్రజల్లో అవగాహన పెంచే దిశగా కృషి చేస్తానని వారు తెలియజేశారు. స్వచ్ఛత అనేది కేవలం ప్రభుత్వ బాధ్యత కాకుండా, ప్రతి పౌరుడి కర్తవ్యమని, మన పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం ద్వారా రాబోయే తరాలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించగలమని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రంగారెడ్డి (అర్బన్) జిల్లా అధ్యక్షులు వనిపల్లి శ్రీనివాస్ రెడ్డి, రంగారెడ్డి జిల్లా మాజీ అధ్యక్షులు సామ రంగారెడ్డి, కొత్త రవీందర్ గౌడ్, బీజేపీ కార్పొరేటర్లు కళ్లెం నవజీవన్ రెడ్డి, చింతల అరుణ సురేంద్రనాథ్ యాదవ్, బద్దం ప్రేమ్ మహేశ్వర్ రెడ్డి, నాయికోటి పవన్ కుమార్, జిహెచ్ఎంసి అధికారులు, పారిశుద్ధ కార్మికులు, బీజేపీ నాయకులు, స్థానిక కాలనీ వాసులు, తదితరులు పాల్గొన్నారు.

# వికారాబాద్ జిల్లాను ముంచెత్తిన వానలు

- ఒకరి మృతి
- అంత్యక్రియలకు వాగులో వరద అడ్డంకి
- దెబ్బతిన్న రోడ్లు, పంటలు
- వరద వల్ల దెబ్బతిన్న మిషన్ భగీరథ పైప్ లైన్
- ఎకరానికి 25 వేల పరిహారం ఇవ్వాలి
- వరద ముంపు గ్రామాల్లో స్పీకర్ పర్యటించాలి
- వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్



**వికారాబాద్ జిల్లా బ్యూరో, సెప్టెంబర్ 27 (జనం సాక్షి) :** బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా వికారాబాద్ జిల్లాను వానలు ముంచెత్తాయి. గత నాలుగు రోజులుగా జిల్లా వ్యాప్తంగా అతి భారీ వర్షాలు కురుస్తున్నాయి. దీంతో జిల్లాలోని ప్రాజెక్టులు చెరువులు కుంటలు నిండుకున్నాయి. అధిక వర్షాల కారణంగా చెరువులు ప్రాజెక్టుల అలుగులు ఎల్లి వాగులు వంకలు వరద నీరుతో ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. వాగు దాటడానికి ప్రయత్నించిన బంటారం మండలానికి చెందిన ఒక వ్యక్తి వాగులో గల్లంతై మృతి చెందాడు. ఆయన శవాన్ని శనివారం నాడు గ్రామస్తులు గుర్తించారు. అలాగే మర్పల్లి మండలం రావులపల్లి గ్రామంలో వర్షం బీభత్సం సృష్టించింది. వర్షం కారణంగా రావులపల్లి కి వెళ్లే బీటీ రోడ్డు పూర్తిగా దెబ్బతిన్నది. రావులపల్లి చెరువు అలుగు ఉద్రిక్తంగా ప్రవహించడంతో చెరువుకు దిగువన ఉన్న విద్యుత్ స్తంభాలు వరద తాకిడికి కొట్టుకపోయాయి. దీంతో అనేక గ్రామాలకు విద్యుత్ అంతరాయం ఏర్పడింది కాకుండా స్తంభాలు విరిగిపడిన కారణంగా అక్కడక్కడ అమర్చిన కరెంటు ట్రాన్స్ఫార్మర్లు నీటిలో కొట్టుకుపోయాయి. ఈ ఒక్క గ్రామంలోనే దాదాపు 200 ఎకరాలకు పైబడి పంట నష్టం జరిగింది. వరద నీళ్లు పొలాల్లో నుంచి వెళ్లడం వలన నేల కోత జరిగిన కారణంగా పత్తి మిర్చి కూరగాయలు కంది మొక్కజొన్న వంటి పంటలు దెబ్బతిన్నాయి. ఈ విషయం తెలుసుకున్న వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ రావులపల్లి గ్రామంలోని వరద పొలాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షం కారణంగా వందలాది ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయని ఎకరానికి 25 వేల చొప్పున నష్టపరిహారాన్ని ప్రభుత్వం చెల్లించాలని కోరారు. పంటల పెట్టుబడి కింద రైతులు లక్షలాది రూపాయలు ఖర్చు చేశారని తీరా పంట చేతికొచ్చే సమయంలో వర్షం కారణంగా పూర్తిగ దెబ్బతిని లక్షలాది రూపాయలు రైతులు నష్టపోతున్నారని అన్నారు. దాదాపు ఏడు ఫీట్ల లోతులో మిషన్ భగీరథ మంచినీటి పైపులైన్ వరద తాకిడికి తెగిపోయిందని అన్నారు. దీంతో అనేక గ్రామాలకు తాగునీటి సరఫరా నిలిచిపోయినట్లు తెలియజేశారు. అధికారులు యుద్ధ ప్రాతిపదికన మరమ్మతు పనులు చేపట్టి రోడ్లు పంట నష్టం అంచనా తాగునీటి సరఫరకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్ర శాసనసభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ వరద ముంపు గ్రామాల్లో పర్యటించి నష్టాన్ని అంచనా వేయించి ప్రభుత్వం ద్వారా నిధులు రాబట్టి దెబ్బతిన్న పనులకు మరమ్మత్తులతోపాటు రైతులకు పరిహారం అందే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. మరుపల్లి మండలం సిరిపురం గ్రామం దగ్గర వాగు ఉధృతంగా ప్రవహించడంతో వృద్ధురాలి అంత్యక్రియలకు ఇబ్బంది కలిగింది. అంత్యక్రియలు నిర్వహించడానికి గ్రామస్తులు వాగు దాటి వెళ్లవలసిన పరిస్థితి నెలకొంది. వాగు ఉధృతంగా ఉన్న ఒకరి చేతులు ఒకరు పట్టుకొని శవాన్ని వాగు దాగించి అతి కష్టం మీద అంత్యక్రియలను పూర్తి చేశారు. ఎంతోకాలంగా పెండింగ్ లో ఉన్న వాగు బ్రిడ్జి నిర్మాణాన్ని వెంటనే పూర్తి చేయాలని గ్రామస్తులు కోరారు.

# చదువుతో పాటు సాంకేతిక నైపుణ్యం ఉంటేనే యువతకు ఉద్యోగాలు

- వనపర్తి శాసన సభ్యులు తూడి మేఘా రెడ్డి

**వనపర్తి బ్యూరో, సెప్టెంబర్ 27 (జనంసాక్షి) :** ప్రస్తుత ఆధునిక యుగంలో చదువుతో పాటు సాంకేతిక నైపుణ్యం ఉంటేనే యువతకు ఉద్యోగాలు లభిస్తాయని వనపర్తి శాసన సభ్యులు తూడి మేఘా రెడ్డి అన్నారు.శనివారం రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి మల్లేపల్లి హైదరాబాద్ ఐ.టి.ఐ కళాశాల ప్రాంగణం నుండి నాలుగు అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్లతోపాటు రాష్ట్రంలోని 65 అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్లను వర్చువల్ గా ప్రారంభించారు.వనపర్తి లోని నాగవరం శివారులో ఐటిఐ కళాశాల ప్రక్కన రూపాయలు 6.76 కోట్ల వ్యయంతో కొత్తగా నిర్మించిన అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ ను సైతం ముఖ్యమంత్రి వర్చువల్ గా ప్రారంభోత్సవం చేశారు.వనపర్తి జిల్లాకు సంబంధించిన ఎ.టి.సి. ప్రారంభోత్సవ కార్యక్రమానికి స్థానిక శాసనసభ్యులు తూడి మెగారెడ్డి, ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు జి చిన్నారెడ్డి, జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి తో కలిసి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా శాసన సభ్యులు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ .రేవంత్ రెడ్డి రాష్ట్రంలో విద్యాభివృద్ధికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నారని దానితో పాటుగా సాంకేతికపరంగా విద్యార్థులకు నైపుణ్య శిక్షణ కల్పించి ఉపాధి పొందే విధంగా చర్యలు తీసుకుంటున్నారని అందుకు ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలిపారు.వనపర్తి జిల్లాలోని అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ ఏర్పాటుకు రూపాయలు 45.15 కోట్ల నిధులు ఖర్చువుతుందని అందులో రాష్ట్ర ప్రభుత్వం 6.76 



కోట్ల రూపాయలు ఖర్చు చేస్తే మిగతా నిధులు మొత్తం టాటా సంస్థ వారు భరిస్తున్నారని తెలిపారు. విద్యార్థులు కేవలం డిగ్రీలు పాస్ అయితే ఉద్యోగాలు రావడం లేదని గ్రహించిన రాష్ట్ర ముఖ్యమంత్రి టాటా సంస్థ వారితో మాట్లాడి పరిశ్రమలలో అవసరమైన సాంకేతిక నైపుణ్యాన్ని శిక్షణ ద్వారా విద్యార్థులకు అందించి పరిశ్రమలలో ఉపాధి పొందే విధంగా అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్లను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. వనపర్తి జిల్లాలోని విద్యార్థులు అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ లో చదువుకొని మంచి పరిశ్రమల్లో ఉద్యోగాలు పొందాలని విద్యార్థులకు సూచించారు.మార్చి 2న రాష్ట్ర ముఖ్యమంత్రి వనపర్తి జిల్లాలో పర్యటించి వెయ్యి కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేసి నిధులు మంజూరు చేశారని అవి ప్రస్తుతం టెండర్లు పూర్తి అయినందున త్వరలోనే పనులు ప్రారంభమవుతాయని తెలియజేశారు. చదువుకున్న నిరుద్యోగులకు వారి విద్యా, సాంకేతిక అర్హతలను బట్టి ఉద్యోగ అవకాశాలు పొందేందుకు ప్రభుత్వం డిట్ అనే పోర్టల్ ఏర్పాటు చేయడం జరిగిందని, జిల్లాలోని నిరుద్యోగులు డీట్ పోర్టల్లో పేర్లు నమోదు చేసుకొని లబ్దిపొందాలని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు జి చిన్నారెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి రాష్ట్రంలో నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలనే ఉద్దేశ్యంతో టాటా సంస్థ వారితో సమన్వయం చేసుకొని సంవత్సర కాల వ్యవధిలోనే మల్లెపల్లిలో 4, రాష్ట్ర వ్యాప్తంగా 65 అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్లను ప్రారంభోత్సవం చేసినందుకు ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలిపారు. కేవలం థియరీ కొంత ప్రాక్టికల్ చదువులతో డిగ్రీలు పూర్తి చేస్తే ఉద్యోగాలు రావడంలేదని అందుకే టాటా సంస్థ వారితో ఒప్పందం చేసుకొని అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్లను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఎ.టి.సి సెంటర్లో ఈ విద్యా సంవత్సరంలో 176 సీట్లు ఉన్నాయని, వచ్చే సంవత్సరం సీట్ల సంఖ్య పెరిగే అవకాశం ఉందన్నారు. జిల్లాలోని విద్యార్థులు సాంకేతిక నైపుణ్య శిక్షణ పొంది ఉద్యోగాలు పొందాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ లో చేరిన విద్యార్థులకు నాణ్యమైన శిక్షణ ఇచ్చి విజయవంతం చేయాలని కోరారు.మార్కెట్ కమిటి చైర్మన్ పి శ్రీనివాస్ గౌడ్, ప్రిన్సిపాల్ రమేష్ బాబు, అధ్యాపకులు, విద్యార్థులు, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## గౌడ కుల సంక్షేమానికి కృషి చేస్తా...



**నారాయణపేట జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 27 (జనం సాక్షి) :** గౌడ కులస్తుల సంక్షేమానికి తనవంతుగా కృషిచేస్తానని జిల్లా బిజెపి ప్రధాన కార్యదర్శిగా లక్ష్మి శ్యామ్ సుందర్ గౌడ్ అన్నారు. శనివారం తన నివాసంలో తెలంగాణ గౌడ కల్లు గీత సంఘం సమన్వయ కమిటి ఆధ్వర్యంలో బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఎంపికైన లక్ష్మి శ్యామ్ సుందర్ గౌడ్ ను శాలువల ఘనంగా సత్కరించి మిఠాయిలను పంపిణి చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ గౌడ కల్లు గీత సంఘం సమన్వయా కమిటి జిల్లా ప్రధాన కార్యదర్శి బొబ్బిలి భరత్ గౌడ్ మాట్లాడుతు గౌడ కులస్తుల్లో రాబోయే తరంలోకూడా రాజకీయ పార్టీ లలో ఉన్నత పదవులు చేపట్టిన వారితో పాటు విద్యా, క్రీడారంగాల్లో ఉన్నత పదవులు పొందిన వారిని ఎంబిబియస్ మెడికల్ ర్యాంకులు సాధించిన వారిని ఐఐటి, ప్రభుత్వఉద్యోగాలు సాధించిన గౌడ కుల స్తులను త్వరలో ఘనంగా సత్కరిస్తమని అన్నారు. ఈ కార్యక్రమంలో భీమయ్య గౌడ్ కృష్ణయ్య గౌడ్ గుర్నాథ్ గౌడ్, విజయ్ గౌడ్ శంకర్ గౌడ్ కృష్ణ గౌడ్ వెంకు గౌడ్ రవి గౌడ్ శేఖర్ గౌడ్ బుగ్గప్ప గౌడ్ దామోదర్ గౌడ్ నరేష్ గౌడ్ గోవర్ధన్ గౌడ్ అరవింద్ గౌడ్ ప్రకాష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## నత్త నడకన సాగుతున్న గాంధీ సెంటర్ బ్రిడ్జి నిర్మాణ పనులు

- రాకపోకలకు ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు
- షాపుల్లోకి ప్రవహిస్తున్న మురికి నీరు ఇబ్బందుల్లో వ్యాపారులు



**చేర్యాల, సెప్టెంబర్ 27 (జనంసాక్షి) :** సిద్దిపేట-జనగామ జాతీయ రహదారిపై నిర్మిస్తున్న బ్రిడ్జి నిర్మాణ పనులు గత కొన్ని నెలల నుండి నత్తనడకగా సాగుతూ ఉండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. చేర్యాల మండల కేంద్రంలోని గాంధీ చౌరస్తా వద్ద నిర్మిస్తున్న బ్రిడ్జి వల్ల చేర్యాల మత్తడి చెరువు నుండి వస్తున్న వరద నీరు బయటకు వెళ్లకుండా షాపుల వద్ద నీరు పేరుకపోతుండడంతో ఇబ్బందులకు గురవుతున్నారు. పండగ సమయంలో వ్యాపారం సరిగ్గా లేక షాప్ కిరాయిలు కట్టలేక రోడ్డు ప్రభావంతో ఇబ్బంది పడుతున్నారు. త్వరగా బ్రిడ్జి పనులు పూర్తి చేయించాలని జిల్లా, మండల స్థాయి అధికారులకు ఎన్ని సార్లు మొర పెట్టుకున్నా ఆలకించేవారే లేక ఇబ్బందులకు గురవుతున్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి కాంట్రాక్టర్ పై ఒత్తిడి తీసుకువచ్చి బ్రిడ్జి నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు వేడుకుంటున్నారు.

# అలుపెరుగని పోరాట యోధుడు కొండా లక్ష్మణ్ బాపూజీ

- ఎమ్మెల్యే శ్రీ యెన్నం శ్రీనివాస్ రెడ్డి

**మహబూబ్‌నగర్ బ్యూరో, సెప్టెంబర్ 27 (జనం సాక్షి) :** తెలంగాణ రాష్ట్ర సాధన కోసం అలుపెరుగని పోరాటం చేసిన యోధుడు ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ అని మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. శనివారం మహబూబ్‌నగర్ నగరంలోని పద్మావతి కాలనీ గ్రీన్ బెల్ట్‌లో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలకు జిల్లా కలెక్టర్ శ్రీమతి విజయేందిర బోయి కలిసి ముఖ్య అతిథిగా హాజరై బాపూజీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గాంధీజీ సిద్ధాంతాలకు ఆకర్షితుడై రాజకీయాలలోకి వచ్చిన బాపూజీ, తెలంగాణ రాష్ట్రం కొరకు తనమంత్రి పదవికి రాజీనామా చేశారని, ఎందరు ముఖ్యమంత్రులు వచ్చి మంత్రి పదవి ఇస్తామని చెప్పినా ఆయన సున్నితంగా తిరస్కరించారని ఆయన గుర్తు చేశారు. ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ మూడుతరాల పాటు, తెలంగాణ ప్రజల హక్కుల కోసం , సామాజిక న్యాయం కోసం జీవితాంతం కృషి చేశారన్నారు. ఆయన చూపించిన



మార్గం ఎప్పటికీ స్ఫూర్తిదాయకమని అన్నారు. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం బాపూజీ ఎనలేని సేవలను చేశారన్నారు. తెలంగాణ ఉద్యమంలో బాపూజీ కీలకపాత్ర పోషించి, సాయుధ పోరాటం నుంచి రాజకీయ పోరాటం వరకు తన త్యాగస్ఫూర్తిని చాటారని కొనియాడారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు ఆయన చూపిన పట్టుదల, విశ్వాసం, తపన తెలంగాణ ప్రజలకు ఎల్లప్పుడూ ప్రేరణగా నిలుస్తాయని ఆయన పేర్కొన్నారు. కొండా లక్ష్మణ్ బాపూజీ తెలంగాణ సాధనే లక్ష్యంగా సమాజంలోని ప్రతి వర్గానికి స్ఫూర్తిదాయకంగా నిలిచారని, ఆయన చూపిన మార్గం, విలువలు అందరికీ స్ఫూర్తిదాయకం కావాలని కోరారు. బాపూజీ ఆశయాల కోసం, సాధించుకున్న తెలంగాణను అభివృద్ధి పథంలో ముందుకు నడిపించేందుకు, ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. బాపూజీ చరిత్ర భావితరాలకు అందించాల్సిన బాధ్యత మనందరిపైన ఉందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మైనారిటీ ఫైనాన్స్ కార్పోరేషన్ చైర్మన్ ఓబేదుల్లా కొత్వాల్, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ్మారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ బెక్కెరి అనిత మధుసూదన్ రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ ఆనంద్ గౌడ్, డిసిసి ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రీ, మాజీ మున్సిపల్ కౌన్సిలర్లు చిన్న , తిరుమల వెంకటేష్, మునీర్, గంజి ఆంజనేయులు నాయకులు సాయిబాబా ప్రవీణ్ కుమార్, గోవింద్ యాదవ్, అక్బర్, యాదిరెడ్డి బిసి సంక్షేమ శాఖ అధికారి రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీరంగపూర్‌లో జాతీయ మానసిక ఆరోగ్య సర్వే విజయవంతం



**వనపర్తి బ్యూరో, సెప్టెంబర్ 27 (జనంసాక్షి) :** వనపర్తి జిల్లా శ్రీరంగపూర్ మండలం శ్రీరంగపూర్ గ్రామంలో జాతీయ మానసిక ఆరోగ్య సర్వే-2 (ఎన్ఎంహెచ్ఎస్-2) విజయవంతంగా పూర్తి చేశారు. ఈ సర్వేను (ఏఐఐఎంఎస్) బీబీనగర్, నిమ్హాన్స్ బెంగళూరు ఆధ్వర్యంలో ప్రాజెక్ట్ ఇన్వెస్టిగేటర్స్ డా. వామన్ కుల్కర్ని, డా. సాయికృష్ణ తిక్కా మార్గదర్శకత్వంలో, మెడికల్ ఆఫీసర్ డా. రాముడు పర్యవేక్షణలో నిర్వహించారు. దేశవ్యాప్తంగా 36 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో జరుగుతున్న ఈ భారీ అధ్యయనంలో 18 ఏళ్లు పైబడిన పెద్దలు, 13-17 ఏళ్ల కౌమారదశ వయస్కులలో మానసిక ఆరోగ్య సమస్యల ప్రాబల్యం, నమూనాలు, లక్షణాలను అంచనా వేయడం లక్ష్యంగా (ఎమ్మెస్ ఆర్ఎస్-పిపిఎస్) పద్ధతిలో బహుళ-దశ, స్తరీకరించబడిన, యాదృచ్ఛిక క్లస్టర్ నమూనాలు ఉపయోగిస్తున్నారు. జిల్లాల ఎంపికలో నీతి ఆయోగ్ పేదరిక సూచిక, పట్టణ గ్రామీణ కేటాయింపు, గిరిజన ప్రాతినిధ్యానికి ప్రాధాన్యం కల్పించారు. శ్రీరంగపూర్ సర్వేలో మానసిక ఒత్తిడి, డిప్రెషన్, వృద్ధాప్య సమస్యలు, మద్యపానం, మహిళల ఆరోగ్యం, పిల్లల పోషణ వంటి అంశాలపై దృష్టి సారించి, ప్రజలకు అవగాహన కల్పిస్తూ బ్రోచర్లు పంచడం, ప్రాథమిక వైద్య సలహాలు అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఏ.ఎన్.ఎం శ్రీదేవి, ఆశావర్కర్లు కె.జ్యోతి, కె.కల్పన సహకారంతో, తెలంగాణ రాష్ట్ర ఆరోగ్య బృంద సభ్యులు వినిత, తిరుపతి, మణికంఠ, రంజిత్ యాదవ్ సర్వేను విజయవంతంగా పూర్తి చేశారు. అదేవిధంగా ఆత్మహత్య నివారణ, గిరిజన మానసిక ఆరోగ్యం, విపత్తుల ప్రభావాలు, వాతావరణ మార్పు ప్రభావం, పని ప్రదేశంలో మానసిక ఆరోగ్యం, సంస్థాగత వ్యక్తుల మానసిక ఆరోగ్యం వంటి అంశాలపై చర్చించారు. ఈ సర్వే ద్వారా భవిష్యత్ జాతీయ మానసిక ఆరోగ్య విధానాల రూపకల్పనకు కీలక డేటా సేకరణ జరగనుంది. అలాగే మానసిక సమస్యల కోసం 14416 టెలిమనస్ హెల్ప్‌లైన్ ద్వారా తక్షణ సలహా కోసం ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని తెలియజేశారు.

# కలెక్టరేట్‌లో బతుకమ్మ సంబరాలు

**నాగర్‌కర్నూల్, సెప్టెంబర్ 27 (జనంసాక్షి) :** శనివారం నాడు నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టరేట్ ఆవరణలో జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ ఆధ్వర్యంలో వైద్య మరియు ఆరోగ్య శాఖ ఉద్యోగులు బతుకమ్మ సంబరాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ ముఖ్యఅతిథిగా విచ్చేసి దీపాలంకరణ చేసి పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, బతుకమ్మ పండుగ మన తెలంగాణ సాంస్కృతి సంప్రదాయాలకు ప్రతీక అని తెలిపారు. వివిధ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల నుంచి మహిళా ఉద్యోగులు వివిధ రకాల పూలతో బతుకమ్మను అలంకరణ చేసుకుని నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టరేట్ ఆవరణలో బతుకమ్మ సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య మరియు ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కే రవికుమార్, డిప్యూటీ డిఎంహెచ్ఓ డాక్టర్ వెంకట దాస్, డాక్టర్ భీమా నాయక్, డాక్టర్ తారా సింగ్, వైద్యాధికారులు డాక్టర్ వాణి, డాక్టర్ ప్రసన్న డిప్యూటీ జిల్లా మాస్ మీడియా అధికారి రాజగోపాల చారి, డిపిఓ రేనయ్య, ఏపీవోలు విజయ్ కుమార్, విజయ్, కొర్ర నిరంజన్, హెల్త్ ఎడ్యుకేటర్ నరసింహ,పర్యవేక్షణ సిబ్బంది శ్రీనివాసులు, ఫసియుద్దిన్ ఏఎన్ఎంలు,ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



## అమ్మవారిని దర్శించుకున్న జాయింట్ కలెక్టర్ అమరేందర్ దంపతులు



**కల్వకుర్తి, సెప్టెంబర్ 27 (జనం సాక్షి) :** కల్వకుర్తి పట్టణంలోని శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి దేవాలయంలో గత రోజులు గా అంగరంగ వైభవంగా 37 వ దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు జరుగుతున్నాయి అని దేవాలయం చైర్మన్ పౌండర్ ట్రస్టీ జూలూరి రమేష్ బాబు, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు గందె రవి కమిటీ సభ్యులు తెలిపారు. అందులో భాగంగా శుక్రవారం రాత్రి నాగర్ కర్నూల్ జిల్లా అదనపు జాయింట్ కలెక్టర్ అమరేందర్ దంపతులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.వారికి దేవాలయం చైర్మన్ పౌండర్ ట్రస్టీ జూలూరి రమేష్ బాబు ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా స్వాగతం పలికారు ఆనంతరం వారిని శాలువా,చీర తో సన్మానం చేశారు.ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ఏటీసీలలో కార్పోరేట్ స్థాయి నైపుణ్య శిక్షణ

- ఎమ్మెల్యే శ్రీ యెన్నం శ్రీనివాస్ రెడ్డి

**మహబూబ్‌నగర్ జిల్లా బ్యూరో, సెప్టెంబర్ 27 (జనంసాక్షి) :** మారుతున్న టెక్నాలజీకి అనుగుణంగా మన తెలంగాణా లోని విద్యార్థులకు అధునాతన సాంకేతిక శిక్షణ అందించేందుకు రాష్ట్ర వ్యాప్తంగా 65 ఏటిసి సెంటర్‌లను ప్రారంభించుకున్నామని మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. హైదరాబాద్ నుంచి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 65 ఏటిసి అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్‌లను వర్చువల్‌గా ప్రారంభించారు. మహబూబ్‌నగర్ అడ్వాన్స్ ట్రేనింగ్ సెంటర్ ఏటిసిను మహబూబ్ నగర్ ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా లక్షలాది స్కిల్స్ మ్యాన్ పవర్ అవసరముందని, అందుకు తగినంత స్కిల్స్ మ్యాన్ పవర్ ప్రపంచంలో అందుబాటులో లేదన్నారు. టాటా సంస్థ సహాకారంతో రాష్ట్ర వ్యాప్తంగా 65 ఏటిసి అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ లను ఏర్పాటు చేసుకున్నామని, ఈ సెంటర్ ద్వారా మన యువతకు నైపుణ్య శిక్షణ ఇప్పించే బాధ్యత ప్రభుత్వం తీసుకున్నట్లు ఆయన చెప్పారు. స్కిల్ యూనివర్సిటీ తో అనుసంధానం చేసి ఎటిసిలో చదివిన ప్రతి ఒక్కరికి ఉపాధి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని ఆయన



హామీ ఇచ్చారు. విదేశాలకు వెళ్లే విద్యార్థులకు సైతం అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తామని ఆయన స్పష్టం చేశారు. వచ్చే ఏడాదిలోగా ప్రతి నియోజకవర్గంలో ఒక ఎటిసి సెంటర్‌ను ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి ఆలోచన చేస్తున్నట్లు తెలిపారు. ఎటిసి సెంటర్ నందు శిక్షణ పొందిన ప్రతి ఒక్క విద్యార్థికి దేశ విదేశాల్లో ఉద్యోగ ఉపాధి అవకాశాలు పుష్కలంగా ఉంటాయని ఆయన స్పష్టం చేశారు. ఎటిసి సెంటర్ లలో చేరి చదివే విద్యార్థులకు వచ్చే సంవత్సరం నుంచి 2000 రూపాయల స్టైఫండ్ ఇస్తామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారని ఆయన చెప్పారు. బి టెక్ లాంటి ఖర్చుతో కూడుకున్న కోర్సులు కాకుండా ఐటిఐ లాంటి కోర్సులలో చేరి నైపుణ్య శిక్షణ పొందితే టాటా కంపెనీ కాకుండా ప్రపంచ వ్యాప్తంగా ఉన్న వివిధ మల్టీ నేషనల్ కంపెనీలు ఎటిసి సెంటర్ దగ్గరకే వచ్చి కోర్సు పూర్తి చేయకముందే విద్యార్థులకు ఉద్యోగాలు ఇస్తాయని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ కార్పోరేషన్ చైర్మన్ ఓబేదుల్లా కొత్వాల్, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ్మారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ బెక్కెరి అనిత మధుసూదన్ రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ ఆనంద్ గౌడ్, డిసిసి ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రీ, పట్టణ కాంగ్రెస్ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షులు అజ్మత్ అలి, ఎస్సీ సెల్ చైర్మన్ సాయి బాబా, మాజీ మున్సిపల్ కౌన్సిలర్లు గంజి ఆంజనేయులు, రాషెద్ ఖాన్, ఖాజా పాషా నాయకులు శ్రీనివాస్ యాదవ్, వరద రవి, కాటం రాజు, గోరం హరిష్, బి.శశి, ఎటిసి సెంటర్ ప్రిన్సిపాల్ శాంతయ్య, గోపాల్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## కొండా లక్ష్మణ్ బాపూజీ సేవలు చిరస్మరణీయం

- అదనపు కలెక్టర్ శ్రీను



**నారాయణపేట జిల్లా బ్యూరో, సెప్టెంబర్ 27 (జనం సాక్షి) :** స్వాతంత్ర్య సమరయోధులు కొండా లక్ష్మణ్ బాపూజీ సేవలు చిరస్మరణీయమని జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్రీను అన్నారు. జిల్లా వెనుక బడిన తరగతుల శాఖ ఆధ్వ ర్యంలో శనివారం జిల్లా కలె క్టరేట్ లోని ప్రజావాణి హాల్‌లో ఏర్పాటు చేసిన కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకల్లో పాల్గొన్న అదనపు కలెక్టర్ బాపూజీ చిత్ర పటానికి పూల మాల వేసి ఘన నివా ళులర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిబద్ధత కలిగిన నాయకు డిగా వెనుకబడిన వర్గాల అభ్యున్నతే ధ్యేయంగా తెలంగాణ కోసం పోరాడిన గొప్ప వ్యక్తిగా కొండా లక్ష్మణ్ బాపూ జీ చరిత్రలో నిలిచిపోతారని కొనియాడారు.ఈ కార్యక్ర మంలో ట్రైనీ కలెక్టర్ ప్రణయ్ కుమార్, కలెక్టరేట్ ఏవో జయసుధ, వెనుక బడిన తరగతుల సంక్షేమ అధికారి ఖలీల్, వసతి గృహ వార్డెన్లు, కలెక్టరేట్ ఉద్యోగులు, బీసీ వెల్ఫేర్ కార్యాలయ సిబ్బంది, బీసీ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# పచ్చని గార్డెన్ కాదు.. పిచ్చిమొక్కలు, చెత్తకుప్పలు

- రామప్ప దేవాలయం ముందు గార్డెన్ దుర్భర పరిస్థితి...
- ఆరు నెలలుగా గార్డెన్ కు పరిశుభ్రత కరువు..
- అధికారుల నిర్లక్ష్యంపై భక్తుల పెదవి విరుపు...




**ములుగు/ వెంకటాపూర్, సెప్టెంబర్ 27 (జనంసాక్షి ):** వెంకటాపూర్ (రామప్ప) మండలంలో అధికారుల నిర్లక్ష్యంతో రామప్ప దేవాలయం ప్రాంగణంలోని గార్డెన్ అంద విహీనంగా తయారైంది.గత ఆరు నెలల నుండి గార్డెన్ గురించి పట్టించుకునే నాధుడే లేడని భక్తులు పాలంపేట గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.ప్రపంచ వారసత్వ కట్టడాలలో ఒకటైన రామప్ప దేవాలయం ప్రపంచవ్యాప్తంగా పేరు ప్రఖ్యాతలు పొందుతూ రామప్పకు రెట్టింపు భక్తులు పర్యాటకులు వస్తున్నారు.శిల్పకల సంపదను చూసి మంత్రముగ్ధులై భక్తులు పరవశిస్తున్నప్పటికీ అభివృద్ధి మాత్రం నత్తనడకన సాగుతున్నట్లు భక్తులు ఆరోపిస్తున్నారు.భక్తుల సౌకర్యార్థం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు సమకూరుస్తున్నప్పటికీ అధికారుల నిర్లక్ష్యంగా వ్యవహరించడంలో రామప్ప గార్డెన్ వికారంగా తయారైందని భక్తులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.సరైన సమయంలో గార్డెన్ కటింగ్ చేయకపోవడం వలన వేపుగా పెరగడంతో గడ్డిలో విష సర్పాలు సైతం తిరుగుతున్నాయని భక్తులు భయపడుతున్నారు. దేవాలయం దర్శనానంతరం సేద తీరడానికి గార్డెన్లో కూర్చుండటానికి వీలు లేకుండా అంతా బురదమయం బురదలో పిచ్చి చెట్లు చెత్త చెదారం ఉండటంతో జంకుతున్నారు. రామప్ప దేవాలయం పరిధిలోని ఆయా పలు శాఖల సమన్వయ లోపం వల్లనో లేక అధికారుల ఉదాసీనత వలన కానీ రామప్ప గార్డెన్ పిచ్చిమొక్కల వనంలా తయారైంది.

### గార్డెన్‌ను చక్కదిద్దాలి



కేంద్ర ప్రభుత్వం రామప్ప దేవాలయానికి కోట్ల నిధులు ఇస్తున్నప్పటికీ వాటిని అధికారులు దేవాలయం తో పాటు పరిసరాలు పరిశుభ్రంగా ఉండే విధంగా చక్కదిద్దాలి. గార్డెన్ మొత్తం పిచ్చి మొక్కలు బురదతో అపరిశుభ్రంగా ఉన్నది.

– అశోక్ హనుమకొండ

### సేద తీరుదామని వచ్చాం.. కానీ



పిల్లలకు దసరా సెలవులు వస్తే రామప్ప దేవాలయం దర్శించుకోవడానికి వచ్చాం. దేవాలయం శిల్పకళ చాలా అద్భుతంగా ఉంది.మళ్లీ మళ్లీ వచ్చి చూడాలనిపిస్తుంది. కానీ దేవాలయం ముందు గార్డెన్ లో సేద తీయడానికి భయంగా అనిపించింది. ప్రధాని మోడీ నాయకత్వంలో రామప్ప దేవాలయానికి ప్రసాద్ స్కీం కింద కోట్ల నిధులు సమకూర్చినారు. కొద్దిపాటి నిధులతో గార్డెన్ ను సుందరంగా తీర్చిదిద్దవచ్చు.ఇల్లు,బడి,గుడి ఇవి అందంగా ఉంటేనే ఆహ్లాదం,ఆనందం, విజ్ఞానం వస్తుంది. అధికారులు అలసత్వం వీడి రామప్ప దేవాలయాన్ని అభివృద్ధిపరిచి విద్యార్థులకు పర్యాటకులకు ఆహ్లాదాన్ని ఆనందాన్ని పంచాలి.

– అన్నపూర్ణ హనుమకొండ

# యువతకు తోడ్పాటు అందించేందుకే ఏటీసీ కేంద్రాలు

- సద్వినియోగం చేసుకుంటే ఉద్యోగ అవకాశాలు
- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు




**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** యువతకు నైపుణ్యంతో పాటు నాణ్యతను అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఆధునిక సాంకేతిక కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు భూపాలపల్లి శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ రావు చెప్పారు. శనివారం జిల్లా కేంద్రంలో 43 కోట్ల రూపాయలతో నిర్మించిన ఏటీసీ కేంద్రాన్ని హైదరాబాద్ నుండి రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ రేవంత్ రెడ్డి వర్చువల్ విధానంలో ప్రారంభించారు. భూపాలపల్లి కార్యక్రమంలో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ యువతకు ఉపాధి అవకాశాల కల్పనకు ఆధునిక సాంకేతికతతో కూడిన పరిజ్ఞానం చాలా అవసరమని తెలిపారు. ఏటిసి కేంద్రాల ద్వారా శిక్షణ పొందిన అభ్యర్థులకు పరిశ్రమలతో పాటు ప్రయివేటు రంగాలలో ఉద్యోగ ఉపాధి అవకాశాలు లభిస్తాయని తెలిపారు. మారుతున్న కాలానికి అనుగుణంగా యువత నైపుణ్యాన్ని పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. ఏటిసి కేంద్రానికి 43 కోట్లు మంజూరు చేయడం పట్ల రాష్ట్ర. ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలిపారు. ఈ ఏటిసి కేంద్రంలో 6 ట్రేడుల్లో విద్యార్థులకు శిక్షణ ఇస్తారని తెలిపారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఉద్యోగ ఉపాధి అవకాశాలు సాధించి తల్లిదండ్రులకు, మన ప్రాంతానికి మంచి పేరు తీసుకురావాలని సూచించారు. తల్లిదండ్రులు కూలి పనులు చేస్తూ మిమ్మల్ని చదివిస్తున్నారని ప్రయోజకులై తల్లిదండ్రుల రుణం తీర్చుకోవాలని ఆయన స్పష్టం చేశారు. జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ ఏటీసీ కేంద్రాల్లో విద్యనభ్యసించిన విద్యార్థులు ఇన్నోవేషన్ పారిశ్రామికవేత్తలుగా తయారు కావాలని ఆకాంక్షించారు. ఏటీసీ కేంద్రంలో ప్రభుత్వం అధునాతన సాంకేతిక పరికరాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జిల్లాలో భూపాలపల్లి, కాటారంలో ఏటిసి కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ ఎటిసి కేంద్రాలను యువత సద్వినియోగం చేసుకోవాలని ఉపాధి పొందాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఏటీసీ ప్రిన్సిపాల్ జామ్లనాయక్, కార్మిక శాఖ సంయుక్త కమిషనర్ రాజేంద్రప్రసాద్, టిజిఐఐసి జోనల్ మేనేజర్ అజ్మీర స్వామి, ఉపాధి కల్పన అధికారి శ్యామల, విద్యుత్తు శాఖ ఎస్ఈ మల్చూర్ నాయక్, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్, తహసిల్దార్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## చేపల వలలో చిక్కిన కొండచిలువ!



**చెన్నారావుపేట, సెప్టెంబర్ 27 (జనంసాక్షి):** చేపల వలలు కొండచిలువ చిక్కిన సంఘటన అమీనాబాద్ గ్రామంలో శనివారం వెలుగులోకి వచ్చిం ది. శంకరం తండా గ్రామానికి చెందిన అజ్మీర నాక అమీనాబాద్ గ్రామ శివారులోని అమీన్‌సాగర్ చెరువులో చేపల కోసం కచ్చు వలను వేశాడు. వలను బయటికి తీస్తుండగా కొండచిలువ బయటికి వచ్చింది. దీంతో ఒక్కసారిగా భయభ్రాంతులకు గురయ్యాడు. కొండచిలువ అప్పటికే వలలో చనిపోయి ఉంది.

## స్వర్ణ ప్రాజెక్ట్ లైట్ల పునరుద్ధరణ



**సారంగాపూర్, సెప్టెంబర్ 27 (జనంసాక్షి) :** సారంగాపూర్ మండలంలో స్వర్ణ ప్రాజెక్ట్‌పై లైట్ల పునరుద్ధరణ పనులను బీజేపీ నేత, ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి శనివారం ప్రారంభించారు. రూ.32.70 లక్షల వ్యయంతో లైట్ల పునరుద్ధరణ పనులు చేపట్టారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రాజెక్ట్‌లో నీటి ఇన్‌ఫ్లో, ఔట్‌ఫ్లో వంటి అంశాలపై అధికారులను ఆరా తీశారు. కార్యక్రమంలో జిల్లా, మండల, గ్రామ బీజేపీ నాయకులు, కార్యకర్తలు, ఇరిగేషన్ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పార్టీలకు అతీతంగా ప్రజా సంక్షేమం

- పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి



**పరకాల, సెప్టెంబర్ 27 (జనం సాక్షి):** పార్టీలకు అతీతంగా లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు అందించడమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ లక్ష్యం అని పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి అన్నారు. శనివారం పరకాల పట్టణ కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నందు ఆత్మకూరు, దామర, నడి కూడా, పరకాల టౌన్ మండలాలకు చెందిన 111మంది అర్హులైన లబ్ధిదారులకు1కోటి11 లక్షల12826 రూ కళ్యాణ లక్ష్మి,షాది ముబారక్ చెక్కులను పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మొత్తం కళ్యాణ లక్ష్మి ద్వారా 2121 మందికి 21కోట్ల 23 లక్షల 4636 రూ చెక్కులను పంపిణీ చేశామని, అలాగే సీఎంఆర్ఎఫ్ ద్వారా 2112 మందికి 6 కోట్ల 89 లక్షల 20వేల రూపాయలను పంపిణీ చేశామని అన్నారు. పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలను అందిస్తున్నామని, ప్రతి కుటుంబం ఆర్థికంగా ఎదిగడమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ లక్ష్యమని అన్నారు.కళ్యాణ లక్ష్మి,షాదీ ముబారక్ పథకం పేదింటి ఆడబిడ్డల పెళ్ళికి వరంగా మారిందన్నారు.పేదల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం అనేక ప్రజా సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నదని తెలిపారు. కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకంతో రాష్ట్రంలోని ఎంతోమంది నిరుపేద కుటుంబాలకు ఆడపిల్లల పెళ్లి భారం తగ్గిందని పేర్కొన్నారు. గత ప్రభుత్వా నిర్లక్ష్యం వైఖరి వల్ల కళ్యాణ లక్ష్మి చెక్కులు ఆలస్యం అయ్యాయని, కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో సకాలంలో లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి చెక్కులను అందేలా కృషి చేస్తామని తెలిపారు.పేద ప్రజలకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం నిలుస్తుందని, ఇది ప్రజల ప్రభుత్వం అని అన్నారు.

## రౌడీ షీటర్లు సత్ప్రవర్తన కలిగి ఉండాలి

- ఏఎస్‌పి శుభం నగరాలే
- రౌడీషీటర్లకు పోలీసుల కౌన్సిలింగ్



**వరంగల్ బ్యూరో, సెప్టెంబర్ 27( జనం సాక్షి) :** ఎలాంటి గొడవలకు సమస్యలకు తావియ్యకుండా రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలని ఏఎస్పి శుభం నగరాలే అన్నారు శనివారం వరంగల్ తూర్పు నియోజకవర్గం లోని మిల్స్ కాలనీ పోలీస్ స్టేషన్లో 44 మంది రౌడీషీటర్లకు కౌన్సిలింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందస్తు నేర నివారణ ప్రక్రియలో భాగంగా రానున్న సద్దుల బతుకమ్మ మరియు దసరా పండుగ ఉత్సవాలలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా ఉండాలని హితవు పలికారు.ఎటువంటి గొడవలలో తలదూర్చే వద్దని ప్రశాంతమైన వాతావరణంలో పండుగ జరిగే విధంగా సత్ప్రవర్తన కలిగి ఉండాలని హెచ్చరించి అట్టి 44 మంది రౌడీషీటర్న్ని మంచి ప్రవర్తన నిమిత్తం ఖిలా వరంగల్ తహసిల్దార్ ముందు బైండోవర్ చేయడం జరిగింది.ఇట్టి కార్యక్రమంలో వరంగల్ ఏఎస్పీ శుభం నగరాలే, మిల్స్ కాలనీ సిఐ బొల్లం రమేష్ ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

## బొడ్డెమ్మ బొడ్డెమ్మా కోలు



**ఆదిలాబాద్ ప్రతినిధి (జనంసాక్షి) :** బొడ్డెమ్మ బొడ్డెమ్మా కోలు నీ బిడ్డ దొరసాని కోలు.. నీ బిడ్డ ఇంటికాడ కోలు బాయి తొడించి బాయిల ఎల్లింది.. కోలు బంగారు బిందె. అంటూ ఎంగిలి పుల బతుకమ్మ సంబరాల్లో భాగంగా జిల్లా కలెక్టర్ రాజర్షి షా శనివారం ఇలా బొడ్డెమ్మ వద్ద నృత్యం చేసి అందరినీ ఆశ్చర్యపరిచారు.

# డబుల్ బెడ్ రూమ్ లబ్ధిదారులతో ఆర్డీఓ ఆఫీస్ ముందు ధర్నా

- డబల్ బెడ్ రూమ్ ఇండ్లు సాధించేంతవరకు ఉద్యమిస్తాం
- సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్



**తొర్రూరు, సెప్టెంబర్ 27 (జనం సాక్షి) :** డబల్ బెడ్ రూమ్ ఇండ్లు సాధించేవరకు పోరాటం ఆగదని సిపిఎం పార్టీ మహబూబాబాద్ జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్ అన్నారు. శనివారం 9వ రోజు డబల్ బెడ్ రూమ్ ల సాధన కోసం ఆర్డీవో ఆఫీస్ ముందు సిపిఎం పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో డబల్ బెడ్రూంలో లబ్ధిదారులతో మహాధర్న జరిగింది. అనంతరం కార్యాలయం ఏవో కు పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రం అందజేయడం వారు స్పందించి మీరు ఇచ్చిన డిమాండ్లను కలెక్టర్ కు పంపిస్తామని పరిష్కారం అయ్యేలా చూస్తామని వారు హామీ ఇచ్చారు.ఈ ధర్నా అనంతరం జరిగిన సమావేశం సిపిఎం పార్టీ మండల కార్యదర్శి ఎండి. యాకుబ్ అధ్యక్షతన జరిగిన సమావేశానికి ముఖ్యఅతిథిగా జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్ పాల్గొని మాట్లాడుతూ, గత ప్రభుత్వం కట్టిన డబల్ బెడ్ రూమ్ ఇల్లు ప్రభుత్వం పంచకుండా పేదలను మోసం చేసిందని ఐదు లక్షల డబుల్ బెడ్ రూములు కడితే రెండు లక్షల డబల్ బెడ్ రూమ్ లు మాత్రమే పేదలకు పంచారని వారు అన్నారు. ఈ ప్రభుత్వం గెలిచి రెండు సంవత్సరాల అయినప్పటికీ కూడా పాత ప్రభుత్వ పద్ధతుల్లోనే పోతా ఉంది తప్ప, కొత్తగా ఈ ప్రభుత్వంలో పేదలకు వచ్చింది ఏమీ లేదని వారు ఈ సందర్భంగా అన్నారు. రాష్ట్రంలో కమ్యూనిస్టులకు భూ పోరాటాలు , నిర్బంధాలు కొత్తేమి కాదని, రాష్ట్రంలో చాలా జిల్లా కేంద్రాలలో ప్రైవేటు వ్యక్తులు ఆక్రమించుకున్న ప్రభుత్వ భూములను పోరాటం చేసి పేదలకు సాధించి పంచిన ఘనత సిపిఎం పార్టీదని వారు ఈసందర్భంగా గుర్తుకు చేశారు. డబల్ బెడ్ రూమ్ ఇండ్ల సాధన కోసం పేదలందరూ ఐక్యంగా ఉద్యమించాలని వారు అన్నారు. తొర్రూర్ లో 20084 ఇండ్లు కట్టి మూడు సంవత్సరాలు పూర్తి అవుతున్నప్పటికీ కూడా ఇక్కడ ఉన్నటువంటి ప్రభుత్వానికి అధికారులకు పంచాలని సోది లేకపోవడం చాలా దురదృష్టకరమన్నారు. తొర్రూర్ల పేదలు చేసే పోరా డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పోరాటానికి జిల్లా కమిటీ రాష్ట్ర కమిటీ మద్దతు ఎల్లవేళలా ఉంటుందని ఈ సందర్భంగా వారు పేదలకు ధైర్యం చెప్పారు. ప్రభుత్వం స్పందించి డబల్ బెడ్ రూములు పంచకుండా పాత పద్ధతులను పోతే గత ప్రభుత్వానికి పట్టిన గత ఈ ప్రభుత్వానికి కూడా పడుతుందని పేదల ఆగ్ర ఆవేశాలకు లోన్ కావాల్సి వస్తుందని వారు ఈ సందర్భంగా వివరించారు.ఇప్పటికైనా ప్రభుత్వం, అధికారులు స్పందించి డబల్ బెడ్ రూమ్ లోని పంచాలని లేనియెడల ఆందోళన పోరాటాలను ఉధృతం చేయాలని వారు ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు గుణగంటి రాజయ్య, జిల్లా కార్యవర్గ సభ్యులు బొల్లం అశోక్, సోమిరెడ్డి, దర్గయ్య, సాంబయ్య, యాకయ్య, శ్రీను, వెంకటేశ్వర్లు, సోమయ్య, జితేందర్, ఉమా గాని యాకయ్య , అమీర్, బొల్లం మమత, ధర్మయ్య,శోభ, షమీనా, వరలక్ష్మి, అరుణ, రేణుక, అమీనా భవాని గడల సాయిలు తదితరులు పాల్గొన్నారు.

# చెవిటి, మూగ వాళ్లను తక్కువ చేసి చూడవద్దు

- బాల్యవివాహాలను ప్రోత్సహించకూడదు
- చట్టాలపై అందరికీ అవగాహన కలిగి ఉండాలి
- వరంగల్ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి పూజ
- లెనిన్ నగర్ లో అవగాహన కార్యక్రమం




**వరంగల్ బ్యూరో సెప్టెంబర్ 27 (జనం సాక్షి) :** సమాజంలోని చెవిటి మూగ వాళ్లను చిన్నచూపు చూడొద్దని వరంగల్ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి పూజ అన్నారు.వరంగల్ లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆధ్వర్యంలో, మామునూరు పోలీస్ స్టేషన్ సహకారంతో లెనిన్‌నగర్ కమ్యూనిటీ హాల్లో శనివారం చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించబడింది.కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వరంగల్ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కందుకూరి పూజ విశిష్ట అతిథిగా మూడవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి కుమారి ఈ. హారిక విచ్చేశారు. లీగల్ ఎయిడ్ కౌన్సిల్ నుండి రజిని , అడ్వకేట్ ఎం.డి. అస్లాం కూడా పాల్గొన్నారు.ఈ అవగాహన కార్యక్రమానికి మామనూర్ పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ ఓ. రమేష్ , ఎస్సైలు టి. శ్రీకాంత్, ఎన్. కృష్ణవేణి, కోర్టు సిబ్బంది హెడ్ కానిస్టేబుల్ రమేష్, పిసి రాజు అవసరమైన ఏర్పాట్లు చేశారు. లెనిన్‌నగర్ కాలనీ పెద్దలు, మహిళలు, వృద్ధులు సహా దాదాపు 100 మంది హాజరయ్యారు.ఈ సందర్భంగా పిడిఎమ్ జడ్జి వరంగల్ కందుకూరి పూజ మాట్లాడుతూ చెవిటి, మూగవారిని తక్కువ చేసి చూడరాదని అన్నారు.వారిని అవమానించడం చట్టరీత్యా నేరమని స్పష్టం చేశారు. అదేవిధంగా బాల కార్మికులు నిర్మూలన, బాలికలపై జరిగే దాడులు, చట్టపరమైన రక్షణ చర్యలపై అవగాహన కల్పించారు.మూడవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి కుమారి ఈ. హారిక బాల్యవివాహాలు, మహిళలపై హింస వంటి అంశాలను ప్రస్తావించి, చిన్నపిల్లలను చదివించి సమాజానికి మేలు చేయాలని సందేశం ఇచ్చారు.చివరగా ఇన్స్పెక్టర్ ఓ. రమేష్ మాట్లాడుతూ ఇంత ఉపయోగకరమైన కార్యక్రమాన్ని మామునూరు పోలీస్ స్టేషన్ పరిధిలో నిర్వహించినందుకు లీగల్ సర్వీసెస్ అథారిటీకి, ముఖ్య అతిథులకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.


# కలెక్టరేట్‌లో ఘనంగా సద్దుల బతుకమ్మ ఉత్సవాలు



**మహబూబాబాద్ ప్రతినిధి, సెప్టెంబర్ 27 (జనం సాక్షి):** మహబూబాబాద్ జిల్లా కలెక్టరేట్ ప్రాంగణంలో శనివారం సాయంత్రం సద్దుల బతుకమ్మ ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. జిల్లా మహిళా సిబ్బంది ఉద్యోగినులు వివిధ శాఖల అధికారులు పాల్గొని బతుకమ్మలను అందంగా అలంకరించి నృత్యాలు పాటలతో సంబరాలు జరిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ ప్రధాన అతిథిగా పాల్గొన్నారు. అదనపు కలెక్టర్లు (స్థానిక సంస్థలు) లెనిన్ వత్సల్ టోప్పో, (రెవెన్యూ) కె. అనిల్ కుమార్ పాల్గొని మహిళలకు జిల్లా ప్రజలకు బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ బతుకమ్మ పండుగ తెలంగాణ సాంస్కృతిక గుర్తింపును ప్రతిబింబిస్తుందని ప్రతి ఒక్కరు ఆనందంగా జరుపుకోవాలని వారు సూచించారు. ఈ సందర్భంగా కలెక్టరేట్ ప్రాంగణం పూలతో దీపాలతో కళకళలాడింది. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# వడ్డీ వ్యాపారులపై కొరడా ఝులిపించిన ఎస్పీ

- 43 బృందాలచే 13 మండలాల్లో దాడులు.. 18 కేసులు నమోదు
- ఇలాంటి ఆకస్మిక తనిఖీలు నిరతరం చేస్తాం : జిల్లా ఎస్పి అఖిల్ మహాజన్



**ఆదిలాబాద్ ప్రతినిది. (జనంసాక్షి):** అధిక వడ్డీలతో రైతుల నడ్డీ విరుస్తున్న వడ్డీ వ్యాపారస్తులపై జిల్లా వ్యాప్తంగా శనివారం ఆదిలాబాద్ జిల్లా పోలీసులు జిల్లాలో ఉన్న వడ్డీ వ్యాపారస్తులపై కొరడా జలిపించడంతో వడ్డీ వ్యాపారస్తులు ఖంగు తిన్నారు. ఏక కాలంలో దాడులు నిర్వహించి 18 కేసులు సైతం నమోదు చేశారు. జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఆదేశాల మేరకు ఈ దాడులు నిర్వహించారు. ఏకకాలంలో 13 మండలాలలో 43 బృందాలచే ఆకస్మిక దాడులు చేపట్టారు. జిల్లా వ్యాప్తంగా 10 మండలాలలో దాదాపు 18 కేసులు నమోదు చేయడం జరిగిందని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. వ్యవసాయ భూములు తాకట్టు పెట్టుకుని, వ్యవసాయ భూములు తమ పేర్లపై రాయించుకొని వ్యాపారం చేస్తున్న వడ్డీ వ్యాపారస్తుల వద్ద నుండి ప్రామిసరీ నోట్లు, బాండ్లు చెక్కుబుక్కులు ఖాళీ పేపర్స్ స్టాంప్ పేపర్స్ సేల్ డేట్స్ లాంటివి స్వాధీనం చేసుకోవడం జరిగిందని తెలిపారు. ముఖ్యంగా నార్నూరు మండలంలో బంగారం కుదువ పెట్టుకొని అధిక వడ్డీకి డబ్బులను ఇస్తూ ప్రజలను మోసం చేస్తున్న వ్యక్తి వద్ద నుండి 12 గ్రాముల బంగారం 235 గ్రాముల వెండి స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేయడం జరిగింది అని తెలిపారు. ప్రజలను మోసం చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటూ అక్రమార్కుల ఆటలు కట్టడం చేయడం జరుగుతుందన్నారు. అసాంఘిక కార్యకలాపాలను పూర్తిగా రూపుమాపే దిశగా జిల్లా పోలీస్ యంత్రాంగం కృషి చేస్తుందని తెలిపారు. ఆదిలాబాద్ ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్లో రెండు కేసులు ఆదిలాబాద్ టు టౌన్ పోలీస్ స్టేషన్లో ఒక కేసు తలమడుగు పోలీస్ స్టేషన్ లో రెండు కేసులు బజార్హత్నూర్ పోలీస్ స్టేషన్లో నాలుగు కేసులు బేల పోలీస్ స్టేషన్లో ఒక కేసు ఇచ్చోడ పోలీస్ స్టేషన్లో మూడు కేసులు గుడిహత్నూర్ పోలీస్ స్టేషన్లో ఒక కేసు నార్నూర్ పోలీస్ స్టేషన్లో ఒక కేసు ఇంద్రవెల్లి పోలీస్ స్టేషన్లో ఒక కేసు ఉట్నూర్ పోలీస్ స్టేషన్లో రెండు కేసులు మొత్తం 18 కేసులు నమోదు చేశామని ఆయన తెలిపారు. ఇలాంటి ఆకస్మిక తనిఖీలను నిరంతరం చేపట్టడం జరుగుతుందని అధిక వడ్డీలకు ఇచ్చే వడ్డీ వ్యాపారులు ప్రజలను మోసం చేయడం ఇకనైనా మాను కోవాలని హెచ్చరించారు.

# ప్రజా ప్రభుత్వంలో పేదవారికి గౌరవ స్థానం



**కనగల్, సెప్టెంబర్ 27 (జనం సాక్షి) :** ప్రజా పాలనలో పేదవాడిని గౌరవ స్థానంలో ఉంచడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని రోడ్లు, భవనముల సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. మండలంలోని తేల కంటి గూడెంలో ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశాల ను లబ్ధిదారులతో కలిసి మంత్రి ప్రారంభోత్సవం చేశారు. వారికి నూతన వస్త్రాలను లబ్ధిదారులకు మంత్రి అందజేసి ఆశీర్వదించారు. అనంతరం ఏర్పాటుచేసిన సభలు మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రజలకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకుంటూ అందులో భాగంగానే గ్రామంలో107 ఇండ్లకు మంజూరు ఇవ్వడమే కాకుండా ఇందులో ఎన్నో సంవత్సరాలుగా ఎలాంటి ఆధారం లేకుండా గుడిసెలలో నివాసమున్న51 మంది లబ్దారులకు సుమారుగా 20 లక్షల విలువ కలిగిన పట్టాలను అధికారికంగా అందజేయడం శుభ పరిమాణం అని గుర్తు చేశారు. టిఆర్ఎస్ ప్రభుత్వంలో కేసీఆర్ కుటుంబమే బంగారమైంది తప్ప బడుగు బలహీన వర్గాల ప్రజల బతుకు మారలేదన్నారు . అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి రేషన్ కార్డు ఇవ్వడమే కాకుండా సన్న బియ్యం పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. తేల కటి గూడెంలో రేషన్ దుకాణమును త్వరలో మంజూరి చేయిస్తానని ఆ గ్రామ ప్రజలకు ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. 25 కోట్ల రూపాయల వ్యయంతో తేల కంటి గూడెం నుంచి వయ్యి చర్ల గౌరారం మీదుగా ధర్వేశిపురం వరకు బీటీ రోడ్డు మంజూరైన త్వరలో పనులు ప్రారంభించినట్లు మంత్రి పేర్కొన్నారు. తేల కటి గూడెంలో 112 ఎల్ఈడి లైట్లు,30 లక్షల సిసి రోడ్లు, లో వోల్టేజ్ సమస్య తీర్చడానికి 6 విద్యుత్ ట్రాన్స్ఫర్ల ఇవ్వడం జరిగిందని తెలిపారు. నల్లగొండ నియోజకవర్గం ఎక్కువ నిధులు వెచ్చించి ప్రతి సమస్యను తీరుస్తానని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ శ్రీనివాస్,, హౌసింగ్ పిడి రాజకుమార్, తహసిల్దార్ పద్మ, ఎంపీడీవో కే సుమలత, ఆర్టిఏ జిల్లా సభ్యుడు కే రాజారెడ్డి, గ్రంథాలయ చైర్మన్ హాఫీస్ ఖాన్, హౌసింగ్ ఏఈ వెంకటేశ్వర్లు, నాయకులు నర్సింగ్ శ్రీనివాస్ గౌడ్, అనూప్ రెడ్డి, బిక్షం యాదవ్, గోలి జగాల్ రెడ్డి, భారత వెంకటేశం, తేల కంటి గూడెం మాజీ సర్పంచ్ బోగారి రాంబాబు, పోష మల్ల లింగయ్య, నర్సింగ్ కృష్ణయ్య, మెరుగు శివయ్య, పి రాజీవ్, వెంకన్న, బిల్లపాటి మోహన్ రెడ్డి, నామ శ్రీను, విద్యుత్, పంచాయతీరాజ్, ఆర్డబ్ల్యూఎస్ఏ . ఈ ఆ ర్ జె ఎన్ కుమార్, రామకృష్ణ, షఫీ, సీఐ ఆదిరెడ్డి, ఎస్సై రాజీవ్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి క్రాంతి, ఆర్ ఐ యాదగిరి, ప్రజా ప్రతినిధులు, పంచాయతీ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

# బీజేపీ అత్యంత ప్రమాదకరమైన పార్టీ

- సిపిఐ ఎమ్మెల్యే, రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివ రావు

**నిజామాబాద్ జిల్లా బ్యూరో, సెప్టెంబర్ 27 (జనం సాక్షి) :** బీజేపీ పార్టీ అత్యంత ప్రమాదకరమైన సిద్ధాంతం గల పార్టీ అని, మతాన్ని అడ్డు పెట్టుకొని రాజకీయం చేస్తుందని కార్మిక కర్షకుల శ్రమను దోపిడి చేసి బడా బడా నాయకులకు దోచిపెడుతుందని సిపిఐ ఎమ్మెల్యే, రాష్ట్ర రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివ రావు ఆరోపించారు. తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ మార్కెట్ యార్డు హమాలి, దడువాయి, చాట స్వీపర్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) 2 వ రాష్ట్ర మహా సభలు నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని శ్రద్ధనంద్ గంజ్ లో జరిగాయి. ఈ సందర్భంగా సిపిఐ ఎమ్మెల్యే, రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివ రావు మాట్లాడుతూ నిజామాబాద్ లో సిపిఐ పార్టీ అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో మహా సభ ఘనంగా నిర్వహించడం గొప్ప విషయం అన్నారు. ఏఐటియుసి చేసిన పోరాటాల ఫలితంగానే 50 కిలోల బస్తాలు రావడం గర్వకారణమన్నారు. పోరాటాల వల్లనే సమస్యలకు పరిష్కారం దొరుకుతుందన్నారు. హామాలీలకు సమగ్ర చట్టం రావాలన్నారు. కార్పొరేట్ సంస్థల్లో తక్కువ మంది చేతిలో ఎక్కువ సంపద కుప్పలు కుప్పలుగా ములుగుతుందన్నారు. కమ్యూనిస్ట్ లు చేసే పోరాటం రాహుల్ గాంధీ కూడా చేస్తున్నారని, బీజేపీ చేస్తున్న అన్యాయాలను బయటకు తీసుకువస్తున్నారన్నారు. రాజ్యాంగాన్ని విచ్ఛిన్నం చేయాలని బీజేపీ చూస్తుందని, ఏ దేశంలోకి వెళ్ళిన ఏ ఖండంలోకి వెళ్లిన ఎర్ర జెండా ఉంటుందన్నారు. రైతులు గిట్టు బాటు ధర లేదని అమ్మడానికి సరైన



సౌకర్యాలు లేవని రైతు పడించిన ధాన్యం మార్కెట్ యార్డుకు తీసుకువస్తే కార్మికులకు ఏడాదిలో పది నెలలు పని ఖచ్చితంగా దొరుకుతుందన్నారు. ప్రభుత్వానికి సెస్ రూపంలో ఆదాయం సమకూరుతుందన్నారు. కార్మికుల హక్కుల సాధనలో ఏఐటియుసి ముందుంటుందన్నారు.

**ఎర్ర జండాల భారీ ర్యాలీతో ఎరుపెక్కిన ఇందూర్**

శ్రద్ధ నంద్ గంజ్ హమాలీ జిల్లా భవనం నుంచి శివాజీ చౌక్, రైల్వే గేట్ అవుట్ గేట్ మీదిగా ఉమా మహేశ్వర హాల్ వరకు వేలాది మంది ఏఐటియుసి కార్యకర్తలతో మార్కెట్ యార్డు సంఘాల ఆధ్వర్యంలో జండాలతో భారీ ర్యాలీ నిర్వహించారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాల్ రాజ్ చేతుల మీదుగా జెండాను ఆవిష్కరించారు. ఈ మహాసభలకు ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి వై. ఓమయ్య అధ్యక్షత వహించగా ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి నర్సింహా, సహాయ కార్యదర్శి ప్రవీణ్, రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కంజర భూమయ్య, సిపిఐ జిల్లా ప్రధాన కార్యదర్శి పి. సుధాకర్ విచ్చేశారు.

## చేనేత సహకార సంఘం 69వ వార్షిక సర్వసభ్య సమావేశం



**భూదాన్ పోచంపల్లి, సెప్టెంబర్ 27 (జనంసాక్షి) :** చేనేత సహకార సంఘం 69వ వార్షిక సర్వసభ్య సమావేశం శనివారం భూదాన్ పోచంపల్లి పట్టణ కేంద్రంలో చైర్మన్ భారత వాసుదేవ్ ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా చేనేత సహకార సంఘం జెండాను ఆవిష్కరించి అనంతరం ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి సందర్భంగా ఆయనకు ఘన నివాళులు అర్పించారు. ముఖ్య అతిథిగా భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి హాజరయ్యారు. పిఐసి కమిటీ ఎమ్మెల్యేను శాలువాతో ఘనంగా సన్మానించింది. ఈ కార్యక్రమంలో పద్మశాలి మహాజన సంఘం అధ్యక్షులు సీత శ్రీరాములు, రాష్ట్ర చేనేత నాయకులు తడక వెంకటేశ్వర్లు, చేనేత నాయకులు పిల్లలమర్రి శ్రీనివాస్, బడుగు దానయ్య, పట్టణ నాయకులు భారత లవ కుమార్, తడక రమేష్, సీత సత్యనారాయణ, సహకార సంఘం డైరెక్టర్లు సురపల్లి శ్రీనివాస్, అంకం మురళి, సీతా చక్రపాణి, సిద్దుల రామచంద్రన్, గంజి అంజయ్య, గుండు వెంకటేష్, పగడాల బుచ్చమ్మ, భారత భారతమ్మ, మేనేజర్ రుద్ర ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## హెూటల్ వివేరాకు “ఉత్తమ వే సైడ్ అమినిటీస్” అవార్డు




**భువనగిరి, సెప్టెంబర్ 27 (జనం సాక్షి) :** తెలంగాణ పర్యాటక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన తెలంగాణ రాష్ట్ర టూరిజం ఎక్సలెన్స్ అవార్డ్స్ 2025 కార్యక్రమం నేడు హైదరాబాద్ శిల్పరామంలో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరైయారు. ఈ సందర్భంగా, భువనగిరి హెూటల్ వివేరాకు “ఉత్తమ వే సైడ్ అమినిటీస్” అవార్డు లభించింది. పర్యాటకులకు ఆధునిక సదుపాయాలు అందించడం ద్వారా రాష్ట్ర పర్యాటక రంగానికి చేసిన విశేష కృషిని గుర్తించి ఈ అవార్డు అందజేయబడింది. ఈ అవార్డును పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రదానం చేశారు. అలాగే, పర్యాటక, పరిశ్రమల ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్, ఐఏఎస్ , రాష్ట్ర డీజీపీ, జితేందర్, ఐపీఎస్ పాల్గొని పురస్కార గ్రహీతలకు శుభాకాంక్షలు తెలిపారు. హెూటల్ వివేరా తరఫున, చైర్మన్ ఎస్. వెంకట్ రెడ్డి మరియు ఎన్. రాఘవేందర్ రెడ్డి అవార్డును స్వీకరించారు. ఈ అవార్డు తెలంగాణ పర్యాటక మౌలిక సదుపాయాల అభివృద్ధి, పర్యాటక అనుభవం మెరుగుదలలో హెూటల్ వివేరా చేసిన కృషికి గర్వకారణమని అన్నారు.

# అడ్వాన్స్డ్ టెక్నాలజీ సెంటర్లతో ఉద్యోగావకాశాలు

- రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ షబ్బీర్ అలీ

**నిజామాబాద్ జిల్లా బ్యూరో, సెప్టెంబర్ 27 (జనం సాక్షి) :** ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో నెలకొల్పిన అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్లలో నైపుణ్యంతో కూడిన శిక్షణ పొందడం ద్వారా యువతకు విరివిగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ షబ్బీర్ అలీ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా అందుబాటులోకి తెచ్చిన 65 అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్లను శనివారం హైదరాబాద్ లోని మల్లెపల్లి ఏ.టీ.సీ సెంటర్ నుండి మంత్రులు జి.వివేక్ వెంకటస్వామి, డి.శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తదితరులతో కలిసి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వర్చువల్ విధానం ద్వారా లాంచనంగా ప్రారంభోత్సవాలు చేశారు. ఇందులో భాగంగానే నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని శివాజీనగర్ లో గల ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ (ఐ.టీ.ఐ) ప్రాంగణంలో నూతనంగా ఏర్పాటు చేసిన రెండు ఏ.టీ.సీ కేంద్రాలను కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డితో కలిసి రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ ప్రారంభించారు. ఏ.టీ.సీ కేంద్రాలలో వివిధ కోర్సులలో శిక్షణ అందించేందుకు వీలుగా నెలకొల్పిన ఆధునిక యంత్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా షబ్బీర్ అలీ



మాట్లాడుతూ ప్రస్తుత పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా, సరికొత్త సాంకేతికత అంశాలతో యువతలో నైపుణ్యాన్ని అభివృద్ధి చేయాలనే సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం ఏ.టీ.సీ కేంద్రాలను ఏర్పాటు చేసిందని అన్నారు. ఈ అవకాశాన్ని యువతీ, యువకులు, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో నిజామాబాద్ నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, ఏ.టీ.సీ కేంద్రాల ప్రిన్సిపాల్స్, ఇన్ స్ట్రక్టర్లు, శిక్షణ పొందుతున్న అభ్యర్థులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ రాజ్యంలో అందరికీ సంక్షేమ పథకాలు అమలు చేస్తాం



**కామేపల్లి, సెప్టెంబర్ 27 (జనంసాక్షి) :** బిఆర్ఎస్ పదేళ్ల పాలనలో తెలంగాణ రాష్ట్ర ఖజానాను ఖాళీ చేశారని రాష్ట్ర సంపదను దోసుకొని తిన్నారని ఇల్లందు శాసనసభ్యులు కోరం కనకయ్య ఆరోపించారు. శనివారం కామేపల్లి రైతు వేదికలో జరిగిన కళ్యాణ లక్ష్మి ,సి ఏం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇందిరమ్మ రాజ్యంలో అన్ని కులాలు, వర్గాలకు సంక్షేమ పథకాలు అందజేస్తామని వెల్లడించారు. పేద ప్రజలకు ఇందిరమ్మ ప్రభుత్వం అండగా ఉంటుందని తెలిపారు. అనంతరం డబల్ బెడ్ రూమ్ ఇండ్ల నిర్మాణాలకు ముచ్చర్ల గ్రామంలో ఏర్పాటు చేసిన ఇసుక రిచ్ ను ఆయన ప్రారంభించారు. మండల తహసిల్దార్ సుధాకర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో డిసిసిబి డైరెక్టర్ మేకల మల్లిబాబు యాదవ్,కామేపల్లి సొసైటీ చైర్మన్, వైస్ చైర్మన్ లు పుచ్చకాయల వీరభద్రం, గుజ్జర్లపూడి రాంబాబు, ఇల్లందు మార్కెట్ కమిటీ డైరెక్టర్ బావ్ సింగ్,కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు గింజల నర్సిరెడ్డి మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆర్ గోపిరెడ్డి,దేవండ్ల రామకృష్ణ,బొడ్డు లక్ష్మీ నారాయణ,చల్లా మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

## అల్వాల్‌లో అధునాతన ఐటీఐ సెంటర్ ప్రారంభం

**అల్వాల్, సెప్టెంబర్ 27 (జనం సాక్షి) :** విద్యార్థులకు సాంకేతిక పరిజ్ఞానం అందించే లక్ష్యంతో అల్వాల్ ఐటీఐని అత్యాధునిక సెంటర్‌గా అభివృద్ధి చేశారు. రూ.45 కోట్ల వ్యయంతో నిర్మించిన భవనం, ఆధునిక పరికరాలతో కూడిన ఈ కేంద్రాన్ని మేడ్చల్-మల్కాజ్గిరి జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, తహసీల్దార్ రాములు, కార్పొరేటర్ విజయశాంతి రెడ్డి, ఐటీఐ ప్రిన్సిపాల్ శంకరయ్యలతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ టాటా టెక్నాలజీ ఆధ్వర్యంలో ఆధునిక పరిజ్ఞానాన్ని అందిస్తున్నామని, విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో శ్యామ్‌సుందర్ రెడ్డి, బి.యాదగిరి, రంగరాజ్, నీ.శైలజ, శేఖర్ రెడ్డి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



## కొండా లక్ష్మణ్ బాపూజీని స్ఫూర్తిగా తీసుకోవాలి



**సూర్యాపేట ప్రతినిధి, సెప్టెంబర్ 27 (జనంసాక్షి) :** కొండా లక్ష్మణ్ బాపూజీని స్ఫూర్తిగా తీసుకొని వారి ఆశయాలను కొనసాగించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు. శనివారం కలెక్టరేట్ లో నిర్వహించిన స్వాతంత్ర సమరయోధులు, తెలంగాణ తొలిదశ ఉద్యమ నేత కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి ఉత్సవాలకు ముఖ్యఅతిథిగా జిల్లా కలెక్టర్ హాజరై కొండా లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో ఉష శ్రీ, రూప, స్వస్తిక్‌లకు ఉపకారవేతనమును కలెక్టర్ చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో బిసి వెల్ఫేర్ అధికారి నరసింహారావు,మాజీ మున్సిపల్ చైర్మన్ జుట్టుకొండ సత్యనారాయణ, బీసీ సంఘం నాయకులు చల్లమల్ల నరసింహా, రామప్రభు, శారదా దేవి,పద్మశాలి నాయకులు అప్పం శ్రీనివాస రావు, పెండెం కృష్ణ,బంటు కృష్ణ,బయ్య మల్లికార్జున యాదవ్, వెంకటేశ్వర్లు, నగేష్,సైదులు, తల్లమల హుస్సేన్, యుగంధర్, లక్ష్మణ్, లింగయ్య,టీఎన్జీవో సెక్రటరీ దున్న శ్యామ్ తదితరులు కొండ లక్ష్మణ్ బాపూజీ పోరాట చరిత్రను, త్యాగాలను స్మరించుకుంటూ మాట్లాడారు.

## తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ



**సూర్యాపేట ప్రతినిధి, సెప్టెంబర్ 27 (జనంసాక్షి) :** బతుకమ్మ పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు. శనివారం కలెక్టరేట్ ఆవరణలో నిర్వహించిన బతుకమ్మ వేడుకలకు ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ సతీమణితో కలిసి పాల్గొని గౌరమ్మకి పూజ నిర్వహించి వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచంలో పూలను పూజించే సంస్కృతి తెలంగాణలోనే ఉందన్నారు. మహిళలు తీరొక్క పూలతో బతుకమ్మను అలకరించి గుమ్మడి బొడ్డెమ్మ, పసుపు గౌరమ్మ కొలువు దీరగా బతుకమ్మ చుట్టూ మహిళలు పాటలు పాడుతూ ఆటలు ఆడుతూ ఆడబిడ్డలు వైభవంగా బతుకమ్మ పండుగ చేయటం కనువిందుగా ఉందని అన్నారు. ప్రజలందరూ సుఖ సంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. కలెక్టరేట్ మహిళా ఉద్యోగులతో కలిసి కలెక్టర్ సతీమణి బతుకమ్మ ఆడారు. బతుకమ్మ వేడుకలలో మొదటి బహుమతి మహిళా శిశు సంక్షేమ శాఖకు, ద్వితీయ బహుమతి డిఆర్డిఏ శాఖకు, తృతీయ బహుమతి ఐడిఓసి సిబ్బందికి , ప్రత్యేక బహుమతి టిఎస్ఎస్ కళాకారులకు కలెక్టర్ చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ కె.సీతారామారావు, డిడబ్ల్యూఓ దయానందరాణి, డిసిఓ పద్మ, పరిపాలన అధికారి సుదర్శన్ రెడ్డి, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# సాంకేతిక రంగంలో ప్రపంచ వేదికపై యువత పోటీపడాలి



**బూర్గంపహాడ్, సెప్టెంబర్ 27 (జనంసాక్షి) :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, బూర్గంపహాడ్ మండలం కృష్ణ సాగర్ పంచాయతీలో అత్యాధునిక శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే పాయం సాంకేతిక రంగంలో ప్రపంచ వేదికపై యువత పోటీ పడాలని అన్నారు. కృష్ణసాగర్ వృత్తి శిక్షణా కేంద్రం- ఐటిఐ కళాశాల ప్రాంగణంలో అత్యాధునిక సాంకేతిక శిక్షణ కేంద్రాన్ని (ఏటిసి- అడ్వాన్సుడ్ టెక్నాలజీ సెంటర్) 4.7 కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించిన ఈ కేంద్రాన్ని శనివారం పినపాక నియోజకవర్గ శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయం మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పినపాక నియోజకవర్గంలో ప్రభుత్వ ఐటిఐ లకు అనుబంధంగా ఏటీసీ ల (అడ్వాన్స్డ్ టెక్నాలజీ సెంటర్లు)ను మంజూరు చేసి పనులు పూర్తి చేసినందుకు రాష్ట్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం టాటా టెక్నాలజీస్ లిమిటెడ్ (టీటీఎల్)తో కలిసి తొలి అడ్వాన్స్డ్ టెక్నాలజీ సెంటర్ (ఏటీసీ)ను రాష్ట్రంలో నెలకొల్పారు. ప్రవేశాలు పొంది కోర్సులు పూర్తి చేసుకున్న వారికి ఉపాధి కల్పించే బాధ్యత ప్రభుత్వమే తీసుకుంటోందన్నారు. దీనికి కేవలం పదో తరగతి విద్యార్హత ఉంటే చాలన్నారు. సాంకేతిక రంగంలో నిష్ణాతులైన వారితో విద్యా బోధన ఉంటుందని, టాటా టెక్నాలజీ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీతో తెలంగాణ ప్రభుత్వం ఒప్పందం చేసుకుందన్నారు. వీటిలో చేరిన విద్యార్థులకు ఆ సంస్థ సిబ్బందే ట్రైనింగ్ అందిస్తారు. ఇప్పటికే ప్రపంచస్థాయి ప్రమాణాలకు అనుగుణంగా మౌలిక వసతులు, ల్యాబ్లను నెలకొల్పారని, అనుభవజ్ఞులైన అధ్యాపకులతో ఇందులో బోధన ఉంటుందన్నారు. ఏటీసీల్లో చేరిన వారికి ఉద్యోగం, స్వయం ఉపాధి పొందేలా శిక్షణ ఇస్తారని, యువతకు ఈ ఏ.టీ.సీ సెంటర్ ఒక గొప్ప అవకాశంగా మారాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఐటిఐ ప్రిన్సిపల్ టి. ధర్మాచారి, లేబర్ ఆఫీసర్ ఇల్లందు ఎస్ వి కె శాస్త్రి, అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ బి సి ఎం ఏసు పాదం, ఐటీసీ అధికారి చెంగల్ రావు, ప్రిన్సిపల్ దేవదాసు, ఎన్పీడీసీఎల్ ఏ డి ఈ వేణు, ప్రభుత్వ అధికారులు, లక్ష్మీపురం మాజీ ఉప సర్పంచ్ పోతిరెడ్డి వెంకటేశ్వర్ రెడ్డి, ఇంగువ రమేష్, చల్లా వెంకటనారాయణ, ఉపాధ్యాయులు, మండల ముఖ్య నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# పేద ప్రజల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం



**మిర్యాలగూడ, సెప్టెంబర్ 27 (జనం సాక్షి) :** దసరా పర్వదినం శుభవేళ శనివారం మిర్యాలగూడ పట్టణంలో మహిళల పండుగ వాతావరణం నెలకొంది. పట్టణంలోని స్థానిక ఎస్వి గార్డెన్ లో స్థానిక ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి (బిఎల్ఆర్) ఆధ్వర్యంలో నియోజకవర్గ వ్యాప్తంగా మహిళ లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి షాదీ ముబారక్ చెక్కులు, సీఎంఆర్ఎఫ్ చెక్కులు, మున్సిపాలిటీ పరిధిలో మెప్మా ఆధ్వర్యంలో వీధి వ్యాపారులకు రుణాల మంజూరు చెక్కులను పంపిణీ చేశారు. తెలంగాణ ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్, మెప్మా ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్, డిఎస్పీ కె. రాజశేఖర్ రాజు లు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న 400 మంది లబ్ధిదారులకు 4.64 కోట్ల కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను, 250 మంది లబ్ధిదారులకు 90.50 లక్షల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను, వీధి వ్యాపారులకు బ్యాంకు లింకేజీ ద్వారా 19 మహిళా సంఘాలకు3.64కోట్ల రూపాయల చెక్కులను అందజేశారు. అనంతరం 50 మంది మహిళలకు సామూహిక సీమంతం కార్యక్రమాలు ఎమ్మెల్యే బిఎల్ఆర్ దంపతులు చేపట్టారు. డి.ఎస్.పి రాజశేఖర్ రాజు మాట్లాడుతూ ప్రభుత్వ కార్యక్రమాలైనా సేవా కార్యక్రమాలు అయినా పేద ప్రజలకు అందించడంలో తన మార్కు చూపెట్టడం ఎమ్మెల్యే నైజమని మరోసారి నిరూపించాడన్నారు. ఇలాంటి కార్యక్రమాలు అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జి శ్రీనివాస్, తహసిల్దార్లు సురేష్, జవహర్ హేమలత, సరోజ పావని,ఎంపీడీవోలు సిడిపిఓలు మమత, చంద్రకళ, సూపర్వైజర్లు పద్మ నాగమణి లీలా కుమారి కవిత, మెప్మా అధికారి బక్కయ్య, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నూకల వేణుగోపాల్ రెడ్డి, చిలుకూరి బాలు, దేశిడి శేఖర్ రెడ్డి, గోదాల జానకిరామ్ రెడ్డి,పొదిల శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.



### మరణించిన వారి బ్యాంకు ఖాతాల సెటిల్‌మెంట్ 15 రోజుల్లోనే...

● నిబంధనలను సవరించిన ఆర్‌బీఐ

**ముంబై:**చనిపోయిన వారి బ్యాంకు ఖాతాలు, లాకర్లకు సంబంధించిన క్లెయిమ్ సెటిల్‌మెంట్ నిబంధనలను రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) శుక్రవారం సవరించింది. 15 రోజుల గడువులోగా సెటిల్‌మెంట్ ప్రక్రియ పూర్తవ్వాలని, ఒక వేళ ఆలస్యమైతే నిర్దిష్ట పరిహారాన్ని నామినీలకు ఇవ్వాల్సి ఉంటుందని ఆర్‌బీఐ స్పష్టం చేసింది. ఆ మేరకు 'రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (సెటిల్‌మెంట్ ఆఫ్ క్లెయిమ్స్ ఇన్ రెస్పెక్ట్ ఆఫ్ డిసీజ్డ్ కస్టమర్స్ ఆఫ్ బ్యాంక్స్) డైరెక్షన్స్ 2025' కింద సవరించిన నిబంధనలను జారీ చేసింది. వీటిని సాధ్యమైనంత త్వరగా అమలు చేయాలని.. 2026 మార్చి 31 కంటే ఆలస్యం కారాదని తెలిపింది. నామినేషన్ లేదా సర్వైవర్‌షిప్ క్లాజ్‌తో ప్రారంభించిన డిపాజిట్ ఖాతాలకు సంబంధించి, డిపాజిటర్లు మరణించినపుడు నామినీ/సర్వైవర్‌కు వాటిని బదిలీ చేయడం బ్యాంకుల బాధ్యత అని ఆర్‌బీఐ తెలిపింది. నామినీ/సర్వైవర్‌షిప్ క్లాజ్ లేని ఖాతాల విషయంలో క్లెయిముల సెటిల్‌మెంట్‌కు సరళీకృత ప్రక్రియ అవలంబించాలని స్పష్టం చేసింది. నిర్దిష్ట పరిమితికే ఇది వర్తిస్తుందని వివరించింది. ఖాతాలో సహకార బ్యాంకులకు రూ.5 లక్షలు, ఇతర బ్యాంకులకు రూ.15 లక్షలుగా ఈ పరిమితి ఉంది.

# డబ్బా ట్రేడింగ్ రూ.వందల పన్నుపోటు

### హవాలా నుంచి క్రిప్టో రూపంలోకి లావాదేవీలు

**ముంబై:**ఆహార ఉత్పత్తులు, బంగారం, వెండి, ముడిచమురు తదితరాలకు సంబంధించిన కమోడిటీ ట్రేడింగ్‌కు సమాంతరంగా ప్రభుత్వానికి పన్ను ఎగ్గొడుతూ అక్రమార్కులు సాగించే 'డబ్బా ట్రేడింగ్' ఇప్పుడు కొత్త పంథాలో సాగుతున్నట్లు నిఘా, ఆదాయపు పన్ను శాఖ వర్గాలు గుర్తించాయి. హవాలా, క్రిప్టో కరెన్సీ ద్వారా లావాదేవీలు జరిగే ఈ అక్రమ వ్యవహారాల వెనుక మాఫియా హస్తం ఉన్నట్లు నిఘా వర్గాలు అనుమానిస్తున్నాయి. క్రిప్టోతో పాటు హవాలా, నగదు రూపంలో లావాదేవీలు జరుగుతుండటంతో పెద్ద మొత్తంలో నల్లధనం మార్పిడి జరుగుతున్నట్లు తేల్చాయి. ప్రభుత్వానికి పన్ను రూపంలో రావాల్సిన ఆదాయానికి గండి కొడుతున్న ఈ వ్యవహారాలపై కన్నేసి ఉంచాల్సిందిగా నిఘా, పోలీసు వర్గాలకు ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు అందాయి. దీనికి సంబంధించి ఇటీవల



నగరంలోని బంజారాహిల్స్, అబిడ్స్, కళాసీగూడల్లోనూ ఆదాయపు పన్ను శాఖ అధికారులు దాడులు చేసినట్లు సమాచారం. అధికారి కంగా షేర్ల క్రయవిక్రయాలు నిర్వహించడానికి స్టాక్ ఎక్స్ఛేంజ్‌లు ఉంటాయి. ఇదే రకంగా కమోడిటీస్‌కు సంబంధించిన లావాదేవీలు నెరపడానికి ప్రత్యేక ఎక్స్ఛేంజ్ వంటి వ్యవస్థ ఉంది. వీటిలో జరిగే లావాదేవీలన్నీ పాదర్శికంగా, ప్రభుత్వ నియమ నిబంధనలకు లోబడి సాగుతుంటాయి. ప్రతి క్రయవిక్రయం పైనా ప్రభుత్వానికి నిర్దేశిత శాతం పన్ను కచ్చితంగా చెల్లించాల్సి ఉంటుంది. వీటికి సమాంతరంగా లావాదేవీలను అధికారికంగా ఎక్కడా నమోదు చేయకుండా నిర్వహించే లావాదేవీలనే డబ్బా ట్రేడింగ్ అంటారు. ప్రస్తుతం బంగారం, వెండికి సంబంధించిన లావాదేవీలు మాత్రమే ఈ డబ్బా ట్రేడింగ్ ద్వారా ఎక్కువగా జరుగుతున్నాయి. దేశ వ్యాప్తంగా వ్యవస్థీకృతంగా జరిగే ఈ వ్యవహారాలు అటు షేర్ మార్కెట్‌లోనూ, ఇటు కమోడిటీ మార్కెట్‌లోనూ జోరుగా సాగుతున్నాయి. లావాదేవీల రుసుం మిగుల్చుకోవడానికి నిర్వాహకులు, పన్ను భారం తప్పించుకోవడంతో పాటు నల్లధనంతో కూడిన లావాదేవీలను నెరపడానికి వినియోగదారులు వీటిని ప్రోత్సహిస్తున్నారు. కమోడిటీస్ డబ్బా ట్రేడింగ్‌లో చక్కెర, ముడిచమురు, వ్యవసాయ ఉత్పత్తులు, బంగారం, వెండి వంటి వస్తువులను ధర తక్కువగా ఉన్నప్పుడు కొని, డిమాండ్ వచ్చేదాకా వేచి ఉండి విక్రయిస్తుంటారు. సాధారణంగా షేర్లు, కమోడిటీస్‌కు సంబంధించిన క్రయ విక్రయాలన్నీ పక్కా పత్రాలతో కంప్యూటర్ల ఆధారంగా ఆన్‌లైన్‌లో జరుగుతుంటాయి. అతి తక్కువ సందర్భాల్లోనే మాత్రమే వాస్తవంగా వస్తుమార్పిడి జరుగుతుంది. డబ్బా ట్రేడింగ్ మాత్రం బ్యాంకు లావాదేవీలు, డీ మ్యాట్ అకౌంట్లతో సంబంధం లేకుండా పూర్తి ఆఫ్‌లైన్‌లో జరిగిపోతుంది. ఏళ్లుగా హవాలా మార్గంలో సాగుతుండగా... ప్రస్తుతం క్రిప్టో కరెన్సీ రూపంలోనూ జరుగుతున్నట్లు తేలింది. ఆదాయం భారీగా ఉండటంతో మాఫియా శక్తులు డబ్బా ట్రేడింగ్‌లో అడుగుపెట్టాయని పోలీసులు అనుమానిస్తున్నారు. దుబాయ్, జార్జియాల్లోనూ ఈ డబ్బా ట్రేడింగ్ నెట్‌వర్క్ నడుస్తోందని అధికారులు గుర్తించారు. గుజరాత్‌లోని అహ్మదాబాద్, సూరత్‌లతో పాటు మహారాష్ట్రలోని ముంబైల్లో మాఫియాలతో సంబంధాలున్న వ్యక్తులు వ్యవస్థీకృతంగా ఈ డబ్బా ట్రేడింగ్, హవాలా రూపంలో నగదు మార్పిడి నిర్వహిస్తున్నారనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఈ తరహా ట్రేడింగ్ నిర్వహిస్తున్న వ్యక్తులు దేశ వ్యాప్తంగా ఏజెంట్లు, సబ్-ఏజెంట్లను ఏర్పాటు చేసుకుంటున్నారు. హవాలా రాకెట్లు సైతం వీరి చేతుల్లోనే ఉండటంతో చిన్న చిన్న స్లిప్పులు, కొన్ని కరెన్సీ నెంబర్లను కోడ్‌వర్డ్స్‌గా ఏర్పాటు చేసుకోవడం ద్వారా ద్రవ్య మార్పిడి చేసేస్తున్నారు. హవాలా లింకులు ఉండటం కూడా మాఫియా హస్తానికి సంబంధించిన అనుమానాల్ని బలపరుస్తున్నాయి. ఉన్నతాధికారులు ఆదేశాలతో అప్రమత్తమైన నిఘా, పోలీసు అధికారులు రాష్ట్రంలోని ప్రధాన నగరాలు, పట్టణాలతో పాటు ట్రేడింగ్ లావాదేవీలు జరిగే ప్రాంతాలపై దేగకన్ను వేశారు.

# యూకేలోని భారతీయ బిలియనీర్లు

ప్రపంచంలోని చాలా దేశాల్లో భారతీయులు స్థిరపడి ఉన్నారు. ఇందులో యూకే కూడా ఒకటి. ఈ దేశంలో బ్యాంకింగ్, స్టీల్, రియల్ ఎస్టేట్, రిటైల్ రంగాల్లో విజయవంతమైన కెరీర్‌లను నిర్మించుకున్న భారత సంతతికి చెందిన బిలియనీర్లు ఉన్నారు. వీరి గురించి మరిన్ని వివరాలు ఇక్కడ తెలుసుకుందాం. యూకేలో అత్యంత సంపన్నులైన భారతీయ సంతతికి చెందిన బిలియనీర్లలో.. గోపి హిందూజా, అతని కుటుంబం ఒకటి. వీరి నికర విలువ 35.3 బిలియన్ పౌండ్స్ (రూ. 33.68 లక్షల కోట్లు). హిందూజా గ్రూప్.. బ్యాంకింగ్, మీడియా, ఇంధన రంగాలలో దూసుకెళ్తోంది. సంపాదన మాత్రమే కాకుండా.. దాతృత్వ కార్యక్రమాలను చేస్తున్నారు. భారతీయ మూలాలున్న డేవిడ్ %ు% సైమన్ రూబెన్.. యూకేలోని రియల్ ఎస్టేట్ రంగంలో ప్రసిద్ధి చెందారు. వీరు తెలివైన ప్రణాళికలతో.. ఎప్పటికప్పుడు వీరి వ్యాపారాలను విస్తరించుకుంటూ వేకుతున్నారు. వీరి నికర విలువ 26.9 బిలియన్ పౌండ్స్


**లక్ష్మీ మిట్టల్ కుటుంబం:**లక్ష్మీ మిట్టల్ గురించి తెలియని భారతీయులు చాలా తక్కువమంది ఉంటారు. ఈయన ప్రపంచంలోనే అతిపెద్ద ఉక్కు కంపెనీ అయిన ఆర్సెలర్ మిట్టల్ ఛైర్మన్. ఉక్కు రియల్ ఎస్టేట్ రంగాల్లో తనకంటూ ఓ ప్రత్యేకమైన గుర్తింపు తెచ్చుకున్న ఈయన కుటుంబం నెట్‌వర్త్ 15.4 బిలియన్ పౌండ్స్.

**అనిల్ అగర్వాల్:**వేదాంత రిసోర్సెస్ వ్యవస్థాపకుడిగా పేరుపొందిన.. అనిల్ అగర్వాల్ మైనింగ్, మెటల్స్ ద్వారా బాగా సంపాదించారు. వీరు అనేక దాతృత్వ కార్యక్రమాల్లో పాల్గొంటూ.. వేదాంత ఫౌండేషన్ ద్వారా విద్య, ఆరోగ్యం, పర్యావరణం రంగాల్లో సేవలు అందిస్తున్నారు. వీరి నికర విలువ 7.5 బిలియన్ పౌండ్స్.

**ప్రకాష్ లోహియా:**ఇండోరమా కార్పొరేషన్ వ్యవస్థాపకుడైన ప్రకాష్ లోహియా.. ఆసియా, ఆఫ్రికా, యూరప్‌లో మొదలైన దేశాల్లో అతిపెద్ద పాలిస్టర్ సంబంధిత ఉత్పత్తుల ఉత్పత్తిదారులలో ఒకరుగా ఉన్నారు. వీరి నికర విలువ 6.02 బిలియన్ పౌండ్స్. లోహియాకు పాలిస్టర్, ప్యాకేజింగ్, పెట్రోకెమికల్స్, టెక్స్‌టైల్స్ వంటి రంగాల్లో ప్రపంచవ్యాప్తంగా వ్యాపారాలు ఉన్నాయి.

**మోసిన్ - జుబెర్ ఇస్సా:**లాంక్షైర్‌లోని ఒకే పెట్రోల్ బంక్ నుంచి ప్రపంచ రిటైల్ సామ్రాజ్యంగా మారిన మొహ్సిన్ మరియు జుబెర్ ఇస్సా యూకేలోని ధనవంతుల జాబితాలో ఒకరు. ఈజీ గ్రూప్ సహ వ్యవస్థాపకులులైన వీరు.. సూపర్ మార్కెట్ దిగ్గజం అస్డా యజమానులు కూడా. వీరి నికర విలువ 6 బిలియన్ పౌండ్స్

**నవీన్ - వర్ష ఇంజనీర్:**నవీన్ వర్ష ఇంజనీర్ యూకే వ్యర్థ పదార్థాల నిర్వహణ రంగంలో ప్రముఖ భారతీయ సంతతికి చెందిన వ్యవస్థాపకులు. వీరి నికర విలువ 3.45 బిలియన్



పౌండ్స్. వ్యాపారవేత్తలుగా మాత్రమే కాకుండా.. పర్యావరణ, పారిశ్రామిక సేవలలో మార్గదర్శకులుగా కూడా వారికి గుర్తింపు లభించింది.


**ది అరోరా బ్రదర్స్:**సైమన్, బాబీ, రాబిన్ అరోరాల మొత్తం నికర విలువ 2.1 బిలియన్ పౌండ్స్. వీరి వ్యాపార ప్రయాణం 2004లో ప్రారంభమైంది. ఆ తరువాత అంచెలంచెలుగా ఎదిగి వ్యాపార ప్రపంచంలో ఎదగడమే కాకుండా.. యూకేలోని అత్యంత సంపన్న భారతీయుల జాబితాలో కూడా ఒకరుగా నిలిచారు.

**లార్డ్ స్వరాజ్ పాల్:**లార్డ్ స్వరాజ్ పాల్ యూకేలో ఉన్న ఒక గ్లోబల్ స్టీల్ ఇంజనీరింగ్ కంపెనీ అయిన కాపారో గ్రూప్ వ్యవస్థాపకులు. ఈయన యూకేలో మాత్రమే కాకుండా.. ఇండియా, అమెరికా వంటి దేశాల్లో కూడా వ్యాపార కార్యకలాపాలను విజయవంతంగా నిర్వహిస్తున్నారు.

# స్టార్‌బక్స్ వందల స్టోర్ల మూత

**వాషింగ్టన్:**కాఫీ పేరు చెబితే గుర్తుకొచ్చే అంతర్జాతీయ బ్రాండ్ స్టార్‌బక్స్. ఇప్పుడీ సంస్థ కూడా వ్యయ నియంత్రణలో భాగంగా అమెరికాలో వందల కొద్దీ స్టోర్లను మూసివేస్తోంది. ఖరీదైన స్టార్‌బక్స్ పానీయాలకు అమెరికాలో గిరాకీ తగ్గినందునే.. తగిన లాభాదాయాలు ఆర్జించని విక్రయశాలలను మూసివేస్తోందని సమాచారం. ఆయా శాఖల్లోని సిబ్బందిపైనా వేటు పడనుంది. ఇబ్బందుల్లో ఉన్న వ్యాపారాన్ని పుంజుకునేలా చేసేందుకు బిలియన్ డాలర్ల పునర్నిర్మాణ పథకానికి కంపెనీ ఆమోదం తెలపడం ఇందుకు నేపథ్యం. మొత్తం అవుట్‌లెట్లలో ఈ నెలలోనే 1% మూత పడనున్నాయని సంస్థ స్పష్టం చేసింది. ఉత్తర అమెరికాలో సెప్టెంబరు చివరకు 18,300కు పరిమితం కానున్నాయి.







# అమెరికా సుంకాలతో భారత వృద్ధికి ముప్పే

### క్రిసిల్ ఇంటెలిజెన్స్ నివేదిక అంచనా

భారత్ నుంచి దిగుమతి చేసుకునే వస్తువులపై అమెరికా భారీ సుంకాలతో విరుచుకుపడుతున్న విషయం తెలిసిందే. ఈ సుంకాల వల్ల భారత ఎగుమతులతో పాటు పెట్టుబడులపైనా తీవ్ర ప్రభావం పడుతుందని క్రిసిల్ ఇంటెలిజెన్స్ అంచనా వేసింది. అయితే, ద్రవ్యోల్బణం తగ్గుముఖం పట్టడం, జీఎస్టీ రేట్ల కోతతో దేశీయ వినియోగం పెరిగే అవకాశం ఉందని తెలిపింది. 2025-26 ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో దేశ జీడీపీ ఐదు త్రైమాసికాల గరిష్ఠ స్థాయి 7.8శాతానికి పెరిగిందని, గతేడాది ఇదే త్రైమాసికంలో 7.4శాతంగా ఉన్నట్లు క్రిసిల్ వెల్లడించింది. అయితే, ఇదే వ్యవధిలో నామమాత్రపు జీడీపీ మాత్రం 10.8శాతం నుంచి 8.8శాతానికి మందగించిందని పేర్కొంది. గత ఆర్థిక సంవత్సరంలో 4.6శాతంగా ఉన్న వినియోగదారుల ధరల సూచీ ద్రవ్యోల్బణం ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 3.5శాతానికి తగ్గే అవకాశం ఉందని క్రిసిల్ అంచనా వేసింది. అధిక వర్షాల ప్రభావాన్ని ఇంకా అంచనా వేయనప్పటికీ.. ఆరోగ్యకరమైన వ్యవసాయ వృద్ధి ఆహారపు ద్రవ్యోల్బణాన్ని అదుపులో ఉంచుతుందని ఆశాభావం వ్యక్తం చేసింది. తక్కువ చమురు ధరలు, అంతర్జాతీయ నిత్యవసరాల ధరలు ఆహారేతర ద్రవ్యోల్బణాన్ని నియంత్రించే అవకాశం ఉందని క్రిసిల్ పేర్కొంది. ఇక ద్రవ్యపరపతి విధానం విషయానికొస్తే.. ఈ ఆర్థిక సంవత్సరం భారతీయ రిజర్వు బ్యాంకు మరోసారి వడ్డీ రేట్లను తగ్గించవచ్చని అంచనా వేసింది.

**లిసా మొనాకోను వెంటనే తొలగించండి: ట్రంప్**

మైక్రోసాఫ్ట్ కంపెనీలో గ్లోబల్ అఫైర్స్ ప్రెసిడెంట్‌గా వ్యవహరిస్తున్న లిసా మొనాకోను వెంటనే తొలగించాలని.. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేర్కొన్నారు. మైక్రోసాఫ్ట్ అమెరికా ప్రభుత్వంతో కలిగి ఉన్న ప్రధాన ఒప్పందాలను పరిగణనలోకి తీసుకుంటే.. ఆమె అమెరికా జాతీయ భద్రతకు ముప్పు అని అన్నారు. "లిసా మొనాకోకు మైక్రోసాఫ్ట్‌లో అత్యంత సున్నితమైన సమాచారం అందుబాటులో ఉంటుందని.. ఆ రకమైన యాక్సెస్ కలిగి ఉండటం ఆమోదయోగ్యం కాదని ట్రంప్ పేర్కొన్నారు. మొనాకో చేసిన అనేక తప్పుడు చర్యల కారణంగా, అమెరికా ప్రభుత్వం ఇటీవల ఆమెకు ఉన్న అన్ని భద్రతా అనుమతులను తొలగించింది. అంతే కాకుండా జాతీయ భద్రతా నిఘాకు సంబంధించిన అన్ని అవకాశాలను తొలగించడం, అన్ని ఫెడరల్ ప్రాపర్టీల నుంచి ఆమెను నిషేధించింది. మైక్రోసాఫ్ట్ వెంటనే లిసా మొనాకో ఉద్యోగాన్ని రద్దు చేయాలని నా అభిప్రాయం" అని ట్రంప్ తన సోషల్ మీడియా మాధ్యమం ట్రూత్‌లో పోస్ట్ చేశారు. దీనిపై మైక్రోసాఫ్ట్ ఇంకా స్పందించలేదు. ఈ ఏడాది జూలైలో లిసా మొనాకో మైక్రోసాఫ్ట్ గ్లోబల్ అఫైర్స్ అధ్యక్షురాలిగా నియమితులయ్యారు. ఆమె గతంలో 2021 నుంచి జనవరి 2025 వరకు నాలుగు సంవత్సరాలు యునైటెడ్ స్టేట్స్ డిప్యూటీ అటార్నీ జనరల్‌గా పనిచేశారు. 2013 నుంచి 2017 వరకు డిప్యూటీ నేషనల్ సెక్యూరిటీ అడ్వైజర్‌గా పనిచేశారు. మొనాకో.. లింక్డ్‌ఇన్ ప్రొఫైల్ ప్రకారం, 2011లో జాతీయ భద్రతకు అసిస్టెంట్ అటార్నీ జనరల్‌గా తన కెరీర్‌ను ప్రారంభించి, రెండేళ్లు ఆ పదవిలో పనిచేశారు.



# లగ్జరీ సౌకర్యాలతో హైదరాబాద్‌లో కొత్త ప్రాజెక్ట్

**హైదరబాద్:**హైదరబాద్‌లో లగ్జరీ ప్రాపర్టీల మార్కెట్‌లో కొత్త ప్రమాణాలను సృష్టించడమే లక్ష్యంగా కొన్ని ప్రాజెక్ట్‌లు వెలుస్తున్నట్లు మకుటా డెవలపర్స్ ఛైర్మన్ జనార్ధన్ కొంపల్లి అన్నారు. మకుటా తరంగ' పేరుతో హైదరాబాద్‌లోని కూకట్‌పల్లిలో విలాసవంతమైన రెసిడెన్షియల్ ప్రాజెక్ట్‌ను ప్రారంభించబోతున్నట్లు చెప్పారు. హైదరాబాద్‌లో అత్యంత కీలకమైన ప్రాంతాల్లో ఇలాంటి ప్రాజెక్ట్‌లు ప్రత్యేకంగా నిలుస్తున్నట్లు చెప్పారు. మెట్రో కనెక్టివిటీ, రిటైల్ అవుట్లెట్లు, విద్యా సంస్థలు, ఆధునిక వైద్య సదుపాయాలు ఉన్నందుకు ఇలాంటి ప్రాజెక్ట్‌లకు ఆదరణ పెరుగుతున్నట్లు తెలిపారు. ఇదే అదనుగా ప్రీమియం రెసిడెన్షియల్ మార్కెట్‌లో తమ స్థానాన్ని మరింత బలోపేతం చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నట్లు పేర్కొన్నారు.



# విజయ్ ప్రచార సభలో తొక్కిసలాట..

భారీ సంఖ్యలో కార్యకర్తలు, అభిమానులు తరలివచ్చారు. ఆయన ప్రసంగిస్తున్న సమయంలో వారిని నియంత్రించడం కష్టంగా మారింది. దీంతో తొక్కిసలాట పరిస్థితి ఏర్పడింది. అనేక మంది స్పృహతప్పి పడిపోయారు. పరిస్థితి గమనించిన ఆయన.. ప్రసంగాన్ని మధ్యలోనే నిలిపివేశారు. భారీ సమూహంలో అతికష్టం మీద అక్కడికి చేరుకున్న అంబులెన్సుల్లో బాధితులను ఆసుపత్రులకు తరలించారు.

**సీఎం దిగ్భ్రాంతి..**

ఈ ఘటనపై ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. "కరూర్ నుంచి వస్తోన్న సమాచారం ఆందోళన కలిగిస్తోంది. ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న బాధితులకు అన్ని రకాల సాయం అందించాలని ఆరోగ్యశాఖ మంత్రి, కలెక్టర్‌కు సూచించా. కరూర్‌లో సాధారణ పరిస్థితులు తీసుకువచ్చేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని పోలీసు ఉన్నతాధికారులను ఆదేశించా. వైద్యులు, పోలీసులకు సహకరించాలని కరూర్ పౌరులకు విజ్ఞప్తి చేస్తున్నా" అని ముఖ్యమంత్రి ఎక్స్ వేదికగా పేర్కొన్నారు.



# ఎవరీ పేటల్ గహ్లోత్ ?

### ఐరాసలో పాక్ తీరును ఎండగట్టిన భారత దౌత్యవేత్త




న్యూఢిల్లీ: అంతర్జాతీయంగా భారత్‌ను నిందించాలని ప్రయత్నించిన పాకిస్థాన్‌కు మరోసారి భంగపాటు ఎదురయ్యింది. ఐక్యరాజ్యసమితి సర్వప్రతినిధి సభలో సింధూజలాల ఒప్పందాన్ని భారత్ నిలిపివేసిన అంశాన్ని ప్రస్తావిస్తూ, పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ పలు వ్యాఖ్యలు చేశారు. అయితే ఆయన ఆరోపణలకు భారత దౌత్యవేత్త పేటల్ గహ్లోత్ గట్టిగా బదులిచ్చారు. అవాస్తవిక నాటకాలతో వాస్తవాలను ఎంతమాత్రం మార్చలేరంటూ ఆమె పాక్ తీరును కడిగిపారేశారు.

**2015లో ఐఎఫ్ఎస్‌లో చేరి..**

పేటల్ గహ్లోత్ మహారాష్ట్రలోని రాజ్‌పుత్ కుటుంబంలో పుట్టారు. ముంబయిలోని సెయింట్ జేవియర్ కళాశాల నుంచి పొలిటికల్ సైన్స్‌లో పట్టా అందుకున్నారు. అనంతరం ఢిల్లీలోని లేడీ శ్రీరామ్ కాలేజీ ఫర్ విమెన్‌లో మాస్టర్స్ డిగ్రీ తీసుకున్నారు. 2015లో ఇండియన్ ఫారిన్ సర్వీసెస్ (ఐఎఫ్ఎస్)లో చేరి దౌత్యవేత్తగా చేరారు. గత పదేళ్లలో ఆమె వివిధ హోదాల్లో విధులు నెరవేర్చారు. యూరోపియన్ వెస్ట్ డివిజన్‌లో అండర్ సెక్రటరీగా పనిచేశారు.

**ఐరాసాలోని భారత మిషన్‌లో తొలి సెక్రటరీగా..**

పారిస్, శాన్‌ఫ్రాన్సిస్కోల్లోని భారత దౌత్య కార్యాలయాల్లో విధులు నిర్వహించారు. తరువాతి కాలంలో ఐక్యరాజ్యసమితిలోని భారత మిషన్‌లో తొలి సెక్రటరీగా నియమితులయ్యారు. ప్రపంచ వేదికలపై భారత్ తరఫున మాట్లాడుతూ, సమర్థురాలైన ప్రతినిధిగా పేరు తెచ్చుకున్నారు. గతంలోనూ ఆమె పాకిస్తాన్ ఆరోపణలను ఐరాసలో బలంగా తిప్పికొట్టారు. ఇప్పుడు పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ వ్యాఖ్యలను తిప్పికొట్టడంతో ఆమె పేరు మరోసారి వార్తల్లో కనిపిస్తోంది. వృత్తి పరంగా దౌత్య వ్యవహారాల్లో మునిగితేలే పేటల్ గహ్లోత్‌కు సంగీతమంటే ఎంతో ఆసక్తి. గిటార్ వాయిస్తూ పాటలు పాడుతుంటారు. వాటిని సోషల్ మీడియా ఖాతాలో షేర్ చేస్తుంటారు.

# గూగుల్ అనే పదం ఎలా వచ్చిందంటే..

● **ఊహకందని చరిత్ర**

ప్రపంచం టెక్నాలజీ వైపు పరుగులు పెడుతున్న సమయంలో 'గూగుల్' గురించి తెలియని వారు దాదాపు ఉండరనేది అక్షర సత్యం. ఆవకాయ వండాలన్న..అమలాపురం గురించి తెలుసుకోవాలన్నా.. అన్నింటికీ ఒకటే సులభమైన మార్గం గూగుల్. ఈ రోజు నభూతో నభవిష్యతిగా ఎదిగిన 'గూగుల్' రెండు దశాబ్దాల క్రితం ఓ సాదాసీదా సెర్చ్ ఇంజన్ మాత్రమే. ఇప్పుడు ఏ ప్రశ్నకైనా సమాధానం అందించే జగద్గురుగా మారింది. ప్రారంభం నుంచి ఇప్పటి వరకు గూగుల్ ప్రస్థానం గురించి మరిన్ని వివరాలు వివరంగా ఈ కథనంలో చూసేద్దాం. చరిత్ర గురించి చదువుకునేటప్పుడు క్రీస్తు పూర్వం.. క్రీస్తు శకం అని చదువుకున్నాం. ఇప్పుడు మాత్రం గూగుల్ పూర్వం యుగం, గూగుల్ తర్వాత యుగం అని చదువుకోవాల్సిన రోజులు వచ్చేసాయి. దీన్ని బట్టి చూస్తే.. గూగుల్ ఎంతలా వ్యాపించిందో ఇట్టే అర్థం చేసుకోవచ్చు. 90వ దశకం చివరిలో స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీలో కంప్యూటర్ సైన్స్ ప్రోగ్రామ్‌లో ప్రావిణ్యం కలిగిన ఇద్దరు %ూప్తణ% స్టూడెంట్స్ "సెర్గీ బ్రిన్, లారీ పేజ్"లు గూగుల్ ప్రారంభించాలని నిర్విరామంగా శ్రమించి మెరుగైన సర్చ్ ఇంజిన్ కోసం ఒక నమూనాను అభివృద్ధి చేశారు. 1997 సెప్టెంబర్ 15న 'గూగుల్ డాట్ కామ్' డొమైన్ పేరును నమోదు చేసుకున్నారు. ఆ తరువాత 1998 సెప్టెంబర్ 4న గూగుల్ కంపెనీని ఏర్పాటు చేసుకుని.. తోటి పీహెచ్‌డీ స్టూడెంట్ 'క్రెయిగ్ సిల్వర్‌స్టీన్'ను తొలి ఉద్యోగిగా చేర్చుకుని సంస్థను అధికారికంగా ప్రారంభించారు. 'గూగుల్' అనే పేరు 'గూగోల్' అనే పదం నుంచి వచ్చినట్లు తెలుస్తోంది. గూగోల్ అనే పదానికి అర్థం ఒకటి తర్వాత వంద సున్నాలు లేదా సరైన శోధన ఫలితాలను అందించేది. ఈ పదాన్ని జేమ్స్ న్యూమాన్ అండ్ ఎడ్వర్డ్ కాస్నర్ రాసిన 'మ్యాథమెటిక్స్ అండ్ ది ఇమాజినేషన్' అనే పుస్తకం నుంచి తీసుకున్నట్లు తెలుస్తోంది.

**గూగుల్ ఉపయోగాలు:**ప్రతి ప్రశ్నకు మల్టిపుల్ సమాధానాలు అందిస్తున్న గూగుల్.. ఎన్నెన్నో రకాలుగా ఉపయోగపడుతోంది. ప్రత్యేకంగా విద్యారంగంలో గూగుల్ పాత్ర అనన్య సామాన్యమనే చెప్పాలి. బ్లాగర్, యూట్యూబ్, గూగుల్ అందిస్తున్న సేవలు.. సమాచార విప్లవంలో కొత్త శకానికి నాంది పలికాయి. ఒక్క మాటలో చెప్పాలంటే గూగుల్ దెబ్బకు ఇంటర్నెట్ ఒక అనధికారిక ఓపెన్ యూనివర్సిటీలా మారిపోయింది. వినోదం కోసం యూట్యూబ్ వినియోగించుకునే వారి సంగతి పక్కన పెడితే.. 10వ తరగతి చదివే ఒక విద్యార్థి నుంచి.. %×ూూా% చదివే వ్యక్తి వరకు యూట్యూబ్ ఎలా ఉపయోగపడుతుందో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. భౌతిక, రసాయనిక శాస్త్రాలు మాత్రమే కాకుండా శస్త్రచికిత్సకు సంబంధించిన ఎన్నో విషయాలను కూడా గూగుల్ ద్వారా తెలుసుకోవచ్చు. మొత్తం మీద పాఠాలు నేర్చుకునే విద్యార్థులకు మాత్రమే కాకుండా.. పాఠాలు నేర్పే గురువులకు సైతం గురువుగా మారిన గూగుల్ ఉపయోగాల గురించి ఎంత చెప్పినా తక్కువే అని నిస్సందేహంగా చెప్పవచ్చు. గూగుల్ లేకపోతే ప్రపంచంలో జరిగే విషయాలు అందరికీ చేరటం దాదాపు అసాధ్యమనే చెప్పాలి. ప్రజల సమూహాలుగా చేరినప్పుడు మాత్రమే ఇతర విషయాలను చర్చించుకోవాల్సి వచ్చేది. గూగుల్ లేకుంటే.. స్మార్ట్‌ఫోన్ వినియోగం కూడా ఇంతలా ఉండేది కాదనే చెప్పాలి. ఎందుకంటే ఈ రోజు స్మార్ట్‌ఫోన్ వినియోగించే ప్రతి ఒక్కరూ గూగుల్ ఉపయోగించాల్సిందే. గూగుల్ లేకపోతే చదువుకునే వారికి కూడా.. అన్ని అంశాలు అందుబాటులో ఉండేవి కాదు. ఎందుకంటే గూగుల్ ప్రమేయం లేకుండా ఏదైనా తెలుసుకోవాలంటే తప్పకుండా ఉద్గ్రంధాలను (పుస్తకాలు) తిరగేయాల్సిందే. అంటే మనకు కావలసిన విషయం తెలుసుకోవడానికి కనీసం రోజుల సమయం పట్టేది. మొత్తం మీద గూగుల్ లేని ప్రపంచంలో జీవించడం ఇప్పుడు దాదాపు అసాధ్యమనే చెప్పాలి.



## మిషన్ భగీరథ కార్యాలయంలో ఘనంగా బతుకమ్మ వేడుకలు

**పెద్దపల్లి,సెప్టెంబర్ 27(జనంసాక్షి) :** పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని మిషన్ భగీరథ కార్యాలయంలో శనివారం మహిళా ఉద్యోగులు అంత కలిసి బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఈఈ ఎం సంధ్య మాట్లాడుతూ తెలంగాణ వ్యాప్తంగా జరుగుతున్న బతుకమ్మ వేడుకల్లో భాగంగా పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష, మరియు ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించామని గౌరీ దేవికి ప్రతీక పార్వతి అమ్మవారిని ఏ విధంగా పూజిస్తామో ఒక్కో రోజు ఒక్క విధంగా దర్శనమిస్తారని అదేవిధంగా ఆమెను స్మరిస్తూ ఈరోజు ఏడవ రోజు కాగా తీరొక్క పూలతో బతుకమ్మను అలంకరించి ఆడటం జరిగింది అన్నారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీవో జిల్లా మహిళా ఉపాధ్యక్షురాలు జి అనిత రెడ్డి, మహిళా ఇంజనీర్లు శృతి, సాయి నిత్య, అఖిల, సౌమ్య, పద్మ, వాసవి, నిత్య, శ్రేయ, శ్రీలత, అనిత, కరీంనగర్ సర్కిల్ మిషన్ భగీరథ ఇంజనీర్ల అసోసియేషన్ అధ్యక్షులు దాసరి రాజకుమార్, సూపరిండెంట్, షేక్ రహీం పాల్గొన్నారు.

## పెద్దపల్లిలో యువతకు నైపుణ్య శిక్షణ, అభివృద్ధి కార్యక్రమాలు





- ఏటీసీ కోర్సులతో ఉపాధి అవకాశాలు
- రూ.2.30 కోట్లతో బ్యాడ్మింటన్ ఇండోర్ స్టేడియం
- రూ.9.55 కోట్లతో ఓదెల మండలంలో అభివృద్ధి పనులు
- కల్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ : ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు

పెద్దపల్లి, సెప్టెంబర్ 27 (జనంసాక్షి): పెద్దపల్లి నియోజకవర్గంలో యువత నైపుణ్య శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని, అభివృద్ధి కార్యక్రమాలు వేగవంతంగా జరుగుతున్నాయని ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు తెలిపారు. శనివారం పెద్దపల్లి ఐటీఐ కేంద్రంలో ఆధునాతన సాంకేతిక కేంద్రం (ఏటీసీ) ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఆయన, రూ.2324 కోట్లతో 65 ఐటీఐ సెంటర్లను ఆధునాతన కేంద్రాలుగా అభివృద్ధి చేస్తున్నామని, ఏటీసీలో శిక్షణ పొందిన విద్యార్థులకు కనీసం రూ.20 వేల ప్రారంభ వేతనంతో ఉపాధి లభించేలా కంపెనీలతో ఒప్పందాలు కుదుర్చుకున్నామని వెల్లడించారు. టాటా సంస్థ సహకారంతో పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలను విద్యార్థులకు అందిస్తున్నామని, పెద్దపల్లిలో 250 మంది విద్యార్థులు శిక్షణ పొందుతున్నారని తెలిపారు. ఐటీఐ 65 ఏళ్ల చరిత్రలో సింగరేణిలో అనేక అవకాశాలు లభించాయని, తల్లిదండ్రులు తమ పిల్లలను ఏటీసీ కోర్సుల వైపు ప్రోత్సహించాలని కోరారు. అదే రోజు, పెద్దపల్లి మార్కెట్ యార్డ్‌లో రూ.2.30 కోట్లతో బ్యాడ్మింటన్ ఇండోర్ స్టేడియం నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. గతంలో అసంపూర్తిగా ఉన్న స్ట్రక్చర్‌ను స్టేడియంగా మార్చనున్నట్లు, రూ.5 కోట్లతో ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణం కూడా జరుగుతున్నట్లు వివరించారు. క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ఈ స్టేడియం నిర్మిస్తున్నామని తెలిపారు. అదే విధంగా, ఓదెల మండలంలో రూ.9.55 కోట్ల నిధులతో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. పోత్కపల్లి నుంచి రూపు నారాయణపేట వరకు బీటీ రోడ్డు, మానేరు వాగు నుంచి వాటర్ ట్యాంక్ వరకు పైప్‌లైన్, మహిళా సమైక్య భవనం, సీసీ రోడ్లు, డ్రైనేజీల కోసం రూ.8.86 కోట్లు, జీలకుంట, గుండ్లపల్లిలో రూ.69.20 లక్షలతో గ్రామ పంచాయతీ భవనాలు, కాంపౌండ్ వాల్స్, సీసీ రోడ్ల నిర్మాణం ప్రారంభించారు.

అనంతరం, ఓదెల మండలం పోత్కపల్లిలోని లక్ష్మీప్రసన్న ఫంక్షన్ హాల్‌లో 36 మంది లబ్ధిదారులకు రూ.36.04 లక్షల విలువైన కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాల్లో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నన్నయ గౌడ్, ఐటీఐ ప్రిన్సిపల్ బుసిరెడ్డి వెంకటరెడ్డి, మార్కెట్ చైర్మన్ ఈర్ల స్వరూప, ఓదెల మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మూల ప్రేమ్ సాగర్ రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ ఆళ్ల సుమన్ రెడ్డి, ఓదెల మల్లికార్జున దేవస్థానం చైర్మన్ చీకట్ల మొండయ్య, తహసీల్దార్ దీరాజ్ కుమార్, స్థానిక నాయకులు, కాంగ్రెస్ కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

## జగిత్యాలలో బతుకమ్మ సంబరాలు

- తెలంగాణ సంస్కృతికి ప్రతీక బతుకమ్మ
- వేపకాయల బతుకమ్మతో కన్నుల పండుగ
- నిమజ్జన సమయంలో జాగ్రత్తలు పాటించాలి



**జగిత్యాల, సెప్టెంబర్ 27 (జనంసాక్షి):** జగిత్యాల జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో శనివారం మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్, బతుకమ్మ తెలంగాణ ఆడబిడ్డల ఆత్మగౌరవం, సాంస్కృతిక వారసత్వానికి ప్రతీక అని పేర్కొన్నారు. మహిళలు సమిష్టిగా బతుకమ్మ ఆడటం వల్ల సామాజిక ఐక్యత బలపడుతుందని తెలిపారు. తొమ్మిది రోజుల పాటు ప్రత్యేక పేర్లతో జరిగే బతుకమ్మ పండుగలో శనివారం ఏడవ రోజు వేపకాయల బతుకమ్మను తంగేడు, గునగ, బంతి, రంగురంగుల పూలతో అలంకరించి మహిళలు ఆటపాటలతో ఉత్సాహంగా సంబరాలు చేసుకున్నారని, ఈ వేడుకలు కన్నులపండుగలా ఉన్నాయని, ఇందులో పాల్గొనడం ఆనందంగా ఉందని కలెక్టర్ అన్నారు. అందరికీ బతుకమ్మ శుభాకాంక్షలు తెలియజేశారు. మహిళా అధికారులు, సిబ్బంది ఉత్సాహంగా బతుకమ్మ పాటలు పాడుతూ ఆడారు. బతుకమ్మ నిమజ్జన సమయంలో చెరువులు, కుంటలు, వాగుల వద్ద జాగ్రత్త వహించాలని, జిల్లా వ్యాప్తంగా నిమజ్జన ఏర్పాట్లు చేసినట్లు, అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అధికారులు తగిన చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బి.ఎస్. లత, డిడబ్ల్యూఓ నరేష్, మహిళా అధికారులు పాల్గొన్నారు.

## బీసీ రిజర్వేషన్లు.. దేశ చరిత్రలోనే ఒక మైలురాయి

- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సాహసోపేత నిర్ణయం.
- సమగ్ర కుల సర్వే నుంచి జీవో జారీ వరకు మంత్రి పొన్నం ప్రభాకర్ కృషి ఎంతో ఉంది.
- కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్చార్జి వెలిచాల రాజేందర్ రావు.
- బీసీ రిజర్వేషన్ జీవో ప్రభుత్వం జారీ చేయడంపై ఘనంగా సంబురాలు



**కరీంనగర్ జిల్లా బ్యూరో, సెప్టెంబర్ 27 (జనంసాక్షి):**
కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ జీవో జారీ చేయడం దేశ చరిత్రలోనే ఒక మైలురాయి అనీ, కాంగ్రెస్ ప్రభుత్వం చారిత్రాత్మక నిర్ణయం తీసుకుందని కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్చార్జి వెలిచాల రాజేందర్ రావు పేర్కొన్నారు. బీసీ లకు 42% రిజర్వేషన్ కల్పిస్తూ జీవో నెంబర్ 9 జారీ చేసినందుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కు కృతజ్ఞతలు తెలుపుతూ జిల్లా కాంగ్రెస్ బీసీ సెల్ చైర్మన్, నగర బీసీ సెల్ అధ్యక్షులు ఆధ్వర్యంలో శనివారం కరీంనగర్ తెలంగాణ చౌక్ లో ఘనంగా సంబురాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వెలిచాల రాజేందర్ రావు హాజరై సంబురాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వెలిచాల రాజేందర్ రావు మాట్లాడుతూ... ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బీసీల పక్షపాతి అనీ, స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ నిర్ణయం తీసుకోవడం పై ఆయనకు పాదాభివందనం చేస్తున్నామని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలకు రాజ్యాధికారం దక్కేందుకు 42 శాతం రిజర్వేషన్లను కల్పిస్తున్నదనీ, ఇందుకోసం ప్రత్యేకంగా జీవో జారీ చేసిందని తెలిపారు. ప్రతి బీసీ బిడ్డ కాంగ్రెస్ ప్రభుత్వానికి కాంగ్రెస్ పార్టీకి అండగా నిలవాలని పిలుపునిచ్చారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ బిడ్డలు కాంగ్రెస్ పార్టీని దీవించాలని బీసీ బిడ్డలు కాంగ్రెస్ అభ్యర్థులు విజయం సాధించేలా కృషి చేయాలని కోరారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అత్యంత సాహసోపేతమైన నిర్ణయం తీసుకున్నారని తెలిపారు. దేశంలో ఏ రాష్ట్రంలోనూ చేపట్టని విధంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలో ఎలాంటి చిక్కులు లేకుండా సమగ్ర కుల సర్వే నిర్వహించారని, తర్వాత అసెంబ్లీలో 42 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు బిల్లు ప్రవేశపెట్టిందని తెలిపారు. తాజాగా రాష్ట్ర ప్రభుత్వం జీవో జారీ చేసిందని ఇందుకు ప్రత్యేకంగా కృషి చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్ ఇతర మంత్రులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ పద్మాకర్ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ బీసీ సెల్ అధ్యక్షులు పులి ఆంజనేయులు గౌడ్, కాంగ్రెస్ నాయకులు ఆకారపు భాస్కర్ రెడ్డి, మల్లికార్జున రాజేందర్, ఆకుల నరసన్న, మూల రవీందర్ రెడ్డి, జిఎస్ ఆనంద్, పొన్నం శ్రీనివాస్ గౌడ్, యాగన్ల అనిల్ కుమార్, గుర్రం అశోక్ గౌడ్, అనంతుల రమేష్, పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## కరీంనగర్‌లో ఉచిత గుండె వ్యాధుల నిర్ధారణ శిబిరం

- ప్రపంచ గుండె దినోత్సవం సందర్భంగా రెనే హాస్పిటల్ సేవలు
- సోమవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు
- ప్రముఖ వైద్య నిపుణులతో ఉచిత పరీక్షలు, మందులు
- జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో ప్రారంభం

**కరీంనగర్, సెప్టెంబర్ 27 (జనంసాక్షి):** కరీంనగర్ జిల్లా ప్రభుత్వ హాస్పిటల్‌లో సెప్టెంబర్ 29న (సోమవారం) రెనే గ్రూపు ఆఫ్ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో ఉచిత గుండె వ్యాధుల నిర్ధారణ శిబిరం నిర్వహించనున్నట్లు ఆ సంస్థ చైర్మన్ డా. బంగారి స్వామి తెలిపారు. ప్రపంచ గుండె దినోత్సవం సందర్భంగా ఈ శిబిరం జిల్లా పరిపాలన, డిఎంహెచ్ఓ, కరీంనగర్ జిల్లా సివిల్ హాస్పిటల్ సమన్వయంతో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు జరుగనుంది. కరీంనగర్ జిల్లా ప్రభుత్వ హాస్పిటల్ రెండో అంతస్తులో ఈ శిబిరం ఏర్పాటు కానుంది. ఈ కార్యక్రమంలో గుండె సంబంధిత సమస్యలపై ప్రముఖ వైద్య నిపుణులు, గుండె శస్త్రచికిత్స నిపుణులు పాల్గొని పరీక్షలు నిర్వహించనున్నారు. పెద్దలు, పిల్లలు సహా అందరికీ ఉచిత గుండె పరీక్షలు, ఉచిత మందులు అందించనున్నారు. ఈ శిబిరాన్ని జిల్లా కలెక్టర్, డిస్ట్రిక్ట్ మెజిస్ట్రేట్ పమేలా సత్పతి, డిఎంహెచ్ఓ డా. వెంకటరమణ, జిల్లా సివిల్ హాస్పిటల్ మెడికల్ సూపరింటెండెంట్ డా. జి. వీరారెడ్డి, రెనే హాస్పిటల్ చైర్మన్ ప్రొఫెసర్ డా. బంగారి స్వామి, రెనే హాస్పిటల్ డైరెక్టర్ డా. రజినీ ప్రియదర్శిని చేతుల మీదుగా ప్రారంభించనున్నారు. గుండె సమస్యలతో బాధపడుతున్న జిల్లా ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని రెనే హాస్పిటల్ యాజమాన్యం కోరింది.

## మచ్చలేని నేత కొండా లక్ష్మణ్ బాపూజీ

- తెలంగాణ కోసం తన నివాసాన్నే త్యాగం చేసిన నాయకుడు.
- కొండా లక్ష్మణ్ బాపూజీకి కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ఘన నివాళి



**కరీంనగర్ జిల్లా బ్యూరో, (జనంసాక్షి):**
పార్లమెంటరీ ప్రజాస్వామ్య వ్యవస్థలో ఉపసభాపతిగా, మంత్రిగా, శాసనసభ్యునిగా అనేక పదవులు చేపట్టినా మచ్చలేని నాయకుడిగా సేవలందించిన కొండా లక్ష్మణ్ బాపూజీ ఈ తరం నాయకులకు స్ఫూర్తిదాయకమని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ కొనియాడారు. శనివారం రోజు కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి ని పురస్కరించుకుని కరీంనగర్ లో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళి అర్పించిన బండి సంజయ్ ఈ సందర్భంగా మీడియాకు ఒక ప్రకటన విడుదల చేశారు. తెలంగాణ ఉద్యమ పతాక కొండా లక్ష్మణ్ బాపూజీ. చేనేత సహకారోద్యమానికి నాయకత్వం వహించిన నాయకుడు, నిజాం నిరంకుశ పాలనపై తిరుగుబావుటా ఎగరేసి తెలంగాణ ఆత్మగౌరవ ప్రతీకను చాటిన మహానేత బడుగు బలహీన వర్గాల స్ఫూర్తి ప్రదాత నిజాయితీకు నిలువుటద్దం తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం తన ఇంటినే త్యాగం చేసిన జల ద్రుశ్య ప్రదాత కొండా లక్ష్మణ్ బాపూజీ. పార్లమెంటరీ ప్రజాస్వామ్య వ్యవస్థలో ఉపసభాపతిగా, మంత్రిగా, శాసనస భ్యునిగా మచ్చలేని నాయకుడిగా సేవలందిస్తూ ఈ తరం నాయకులకు స్ఫూర్తిగా నిలిచిన మహనీయుడు కొండా లక్ష్మణ్ బాపూజీ. తెలుగు నేలపై సైకిల్ యాత్ర, పాదయాత్రలకు శ్రీకారం చుట్టిన మొట్ట మొదటి వ్యక్తి, ప్రత్యేక తెలంగాణ ఉద్యమానికి ఊపిరిలూదిన నాయకుడు కొండా లక్ష్మణ్. 'తెలంగాణ పీపుల్స్ పార్టీ' స్థాపించి ప్రత్యేక రాష్ట్ర కాంక్షను చాటిన నేత బాపూజీ. తెలంగాణ తల్లికి స్వేచ్ఛ, స్వాతంత్ర్యం కోసం నినదించిన ప్రతి ఒక్కరికీ అండగా నిలిచిన మహనీయుడు మన బాపూజీ కొండా లక్ష్మణ్ జీ. 96 సంవత్సరాల పండు ప్రాయంలో కూడా ఎముకలు కొరికే చలిని లెక్క చేయకుండా ఢిల్లీలోని జంతర్ మంతర్‌లో తెలంగాణ కోసం దీక్ష చేశారంటే బాపూజీకి తెలంగాణపట్ల ఉన్న చిత్తశుద్ధికి నిదర్శనం. బాపూజీ విలువలు, త్యాగం, పట్టుదల, నిజాయితీ, పోరాట స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శనీయం అని కేంద్ర మంత్రి బండి సంజయ్ తెలిపారు.



## బతుకమ్మ సంబురాలలో... పోచారం

**నిజామాబాద్ జిల్లా బ్యూరో సెప్టెంబర్ 27 (జనం సాక్షి) :** కామారెడ్డి జిల్లా నవరుల్లాబాద్ మండలం లోని దుర్కి గ్రామ శివారులో గల నర్సింగ్ కాలేజ్ లో ప్రిన్సిపాల్ భూలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించిన బతుకమ్మ సంబురాలలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారులు, బాన్సువాడ నియోజకవర్గ శాసనసభ్యులు పోచారం శ్రీనివాసరెడ్డి – పుష్ప దంపతులు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ బతుకమ్మ మన తెలంగాణ ఆడపడుచుల సంస్కృతికి నిదర్శనమని అన్నారు. ఈ కార్యక్రమంలో బీర్కూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ దుర్గం శ్యామల, మండల ప్రజాప్రతినిధులు, నాయకులు, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

### పోషకాహారంపై అవగాహన కార్యక్రమం

**వేములవాడ గ్రామీణం, (జనంసాక్షి) :**
'పోషణ మాసం' కార్యక్రమంలో భాగంగా బుధవారం జయవరం అంగన్వాడీ కేంద్రంలో తల్లులకు పోషకాహారం పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా గర్భిణీ స్త్రీలకు సీమంతం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మీరాజం హాజరై మాట్లాడుతూ ఆకు కూరలు, కూరగాయలు, తృణ ధాన్యాలు మన ఆహారం లో ఎక్కువగా తీసుకోవాలని, ఉప్పు, నూనె, చెక్కెర చాలా తక్కువ మోతాదు తీసుకోవాలని సూచించారు.

### బీసీలకు 42 శాతం రిజర్వేషన్

## తెలంగాణాలో నూతన అధ్యయనం

- రిజర్వేషన్లు సక్రమంగా అమలయ్యేలా అన్ని రాజకీయ పక్షాలు సహకరించాలి
- డిసిసి ప్రధాన కార్యదర్శి సిరాజ్ హుస్సేన్



**కరీంనగర్ జిల్లా బ్యూరో, సెప్టెంబర్ 27 (జనంసాక్షి) :**
స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ ప్రభుత్వం జీవో జారీ చేయడంతో తెలంగాణలో నూతన అధ్యయనం మొదలైందని, కాంగ్రెస్ ప్రభుత్వం ఆకుంటిత దీక్ష వల్లే ఇది సాధ్యమైందని డిసిసి ప్రధాన కార్యదర్శి సిరాజ్ హుస్సేన్ పేర్కొన్నారు. రిజర్వేషన్లు సక్రమంగా అమలయ్యేలా అన్ని రాజకీయ పక్షాలు సహకరించాలని కోరారు. తెలంగాణ ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ జీవో జారీ చేయడం పట్ల ఆయన శనివారం హర్షం వ్యక్తం చేశారు. స్వతంత్ర భారత దేశ చరిత్రలోనే ఒక రాష్ట్రంలో అది తెలంగాణలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించడం రికార్డు బ్రేక్ అని పేర్కొన్నారు. ఈ రాష్ట్రంలోనూ ఏ ప్రభుత్వం బీసీలకు ఇలా రిజర్వేషన్ కల్పించడం ఏనాడు జరగలేదనీ నేడు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కృషివల్లే ఇది సాధ్యమైందని పేర్కొన్నారు. బిసి వర్గాలు బహుజనులు రాజ్యాధికారం పొందేందుకు ఈ రిజర్వేషన్ ఎంతో దోహదపడుతుందన్నారు. బీసీ వర్గాలంతా కాంగ్రెస్ ప్రభుత్వానికి రుణపడి ఉండాలని ప్రతి ఒక్కరూ కాంగ్రెస్ పార్టీకి రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో సహకరించాలని కోరారు. రిజర్వేషన్ జీవో జారీ చేయడంలో కీలక పాత్ర పోషించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, మంత్రి పొన్నం ప్రభాకర్ ఇతర మంత్రులకు సిరాజ్ హుస్సేన్ హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. సమగ్ర కుల సర్వే నుంచి అసెంబ్లీలో రిజర్వేషన్ బిల్లు ప్రవేశపెట్టే వరకు బిసి నేత పొన్నం ప్రభాకర్ ప్రత్యేకంగా కృషి చేశారని పేర్కొన్నారు. ఎంపీగా ఉన్నప్పుడు పొన్నం ప్రభాకర్ నాడు తెలంగాణ ఉద్యమంలోనూ కీలకంగా వ్యవహరించి పోరాటం చేశారని గుర్తు చేశారు. బీసీ రిజర్వేషన్ అమల్లో ఎలాంటి అడ్డంకులు సృష్టించకుండా అన్ని రాజకీయ పక్షాలు ప్రత్యేక చొరవ చూపాలని కోరారు. స్థానిక సంస్థల ఎన్నికలు సజావుగా సాగేలా అందరూ కలిసికట్టుగా రిజర్వేషన్లు అమలుకు కృషి చేయాలని పేర్కొన్నారు. దేశ చరిత్రలోనే రిజర్వేషన్ కల్పిస్తూ జీవో జారీ చేయడం గొప్ప అవకాశం అని ఈ అవకాశాన్ని బీసీ వర్గాలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కాంగ్రెస్ అగ్ర నేతలు రాహుల్ గాంధీ, మల్లికార్జున కార్గే ఇచ్చిన మాట ప్రకారం కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బీసీలకు 42% రిజర్వేషన్ అమలు చేసేందుకు చర్యలు తీసుకున్నారని పేర్కొన్నారు. ఇది ఎంతో గొప్ప నిర్ణయమని అభివర్ణించారు.

## రాష్ట్ర సాధనకు అలుపెరగని పోరాటం చేసి యోధుడు కొండా లక్ష్మణ్ బాపూజీ

- స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జె.అరుణ శ్రీ
- ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటుకు మంత్రి పదవి రాజీనామా చేసిన త్యాగశీ
- అట్టహాసంగా జరిగిన ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలు



**పెద్దపల్లి,సెప్టెంబర్ 27(జనంసాక్షి) :** ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధనకు అవిరళ కృషి చేసిన అలుపెరగని పోరాట యోధుడు ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ అని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జె.అరుణ శ్రీ అన్నారు.శనివారం సమీకృత జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో వెనకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకల్లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జె.అరుణ శ్రీ పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసిన అనంతరం కొండా లక్ష్మణ్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జె.అరుణ శ్రీ మాట్లాడుతూ నిజాం పరిపాలన నుండి స్వాతంత్రం, దాని తర్వాత కూడా ఒక రూపం ఇవ్వాలని ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం కొండా లక్ష్మణ్ బాపూజీ పోరాటం చేశారని, మన రాష్ట్రాన్ని కష్టపడి అభివృద్ధి చేసుకొని వారి ఆశయాలను నెరవేర్చాలని అన్నారు.మాటలకు మాత్రమే పరిమితం కాకుండా, తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం కొరకు మంత్రి పదవిని సైతం 1969 ఉద్యమ సమయంలో రాజీనామా చేసిన త్యాగశీలి కొండా లక్ష్మణ్ బాపూజీ అని, అటువంటి మహనీయుల త్యాగాల ఫలితాలు నేటి తరానికి బంగారు బాటలు వేశాయన్నారు.కొండా లక్ష్మణ్ బాపూజీ సామాజిక అభ్యున్నతి కొరకు కృషి చేసిన మహనీయుడని, ఆనాటి పరిస్థితులను ఎదుర్కొని న్యాయవాదిగా పేదలకు ఉచిత న్యాయ సేవలు అందించారని అన్నారు. హైదరాబాద్ రాష్ట్రంలో, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో శాసన సభ్యులుగా సేవలు అందించారని, మలిదశ ఉద్యమానికి వేదిక అందించారని తెలిపారు.తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు నిరంతరం శ్రమించిన మహనీయుల జయంతిని అధికారికంగా నిర్వహించడం సంతోషకరమని అన్నారు. తెలంగాణ ఏర్పాటులో కొండా లక్ష్మణ్ బాపూజీ కృషిని గుర్తించి ప్రభుత్వం ఉద్యానవన విశ్వవిద్యాలయానికి ఆయన పేరు పెట్టిందని, అధికారికంగా జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తుందని తెలిపారు.కొండా లక్ష్మణ్ బాపూజీ తన జీవితంలో సమాజ శ్రేయస్సు కోసం అనేక త్యాగాలు చేశారని, ఆ స్ఫూర్తి మనమంతా తీసుకొని ముందుకు సాగాలని, ఆయన కీర్తిని, చేసిన పనులను ప్రజలలోకి విస్తృతంగా తీసుకొని వెళ్లాలని అన్నారు. అంతకు ముందు కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతిని పురస్కరించుకొని వివిధ సంఘాల ప్రతినిధులు ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి సంఘం జిల్లా అధ్యక్షులు, ఇతర ప్రజా ప్రతినిధులు, వెనకబడిన తరగతుల అభివృద్ధి శాఖ అధికారి రంగారెడ్డి, పద్మశాలి, బి.సి. కుల భాంధవులు, వివిధ కుల సంఘాల ప్రతినిధులు, అన్ని శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ ఏ.ఓ., సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

## బతుకమ్మ ఘాట్ పనులు త్వరితగతిన పూర్తి చేయండి

### మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ అయాజ్

**జమ్మికుంట, సెప్టెంబర్ 27 (జనం సాక్షి):**
తెలంగాణ రాష్ట్ర సంస్కృతికి, సాంప్రదాయానికి నిలువెత్తు నిదర్శనంగా నిలిచే బతుకమ్మ ఘాట్ పనులను వేగవంతం చేయాలని మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ అయాజ్ అన్నారు. శనివారం బతుకమ్మ ఘాట్ లను మున్సిపల్ కమిషనర్ మహమ్మద అయాజ్ సందర్శించారు.ఈ సందర్భంగా కమిషనర్ మహమ్మద్ అయాజ్ మాట్లాడు తూ తెలంగాణ రాష్ట్ర ఖ్యాతిని పెంచే బతుకమ్మ ఆటలు, పాటలు,మహిళలు ఆనందోత్సాహాలతో నిర్వహించుకునేందుకు అన్ని విధాల ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.వార్డులలో బతుకమ్మ ఘాట్ లు కాలేజీ గ్రౌండ్ వద్ద టవర్ లైట్స్ ,సిరిస్ బల్బ్ లు ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.ఆయన వెంట మున్సిపల్ మేనేజర్ జి రాజిరెడ్డి, ఏఈ వికాస్,ఇన్స్ పెక్టర్లు మహేష్, సదానందంలతో ఈఈ శ్రీకాంత్, సానిటరీ జవాన్లు తదితరులు పాల్గొన్నారు.






## జెడ్పిటిసి,ఎంపిపి స్థానాలకు రిజర్వేషన్ల ఖరారు

- రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో కొనసాగిన ప్రక్రియ
- జిల్లా కలెక్టర్ పమేలా సత్పత్తి

**కరీంనగర్ జిల్లా బ్యూరో, (జనంసాక్షి):**
స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణలో భాగంగా జిల్లాలోని జెడ్పిటిసి, ఎంపిపి స్థానాలకు రాష్ట్ర ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను అనుసరిస్తూ జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి ఆధ్వర్యంలో రిజర్వేషన్‌లు ఖరారు చేశారు. కరీంనగర్ కలెక్టరేట్ కాన్ఫరెన్సు హాల్‌లో జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి, అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే, జెడ్పీ సీ.ఈ.ఓ శ్రీనివాస్ తో కలిసి గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో రిజర్వేషన్ల కేటాయింపు ప్రక్రియ నిర్వహించారు. జిల్లాలోని 15 జెడ్.పి.టి.సి, ఎం పి.పి స్థానాల కోసం ఎస్.సి, ఎస్.టి, బి.సి, మహిళ, జనరల్ రిజర్వేషన్లను వీడియో రికార్డింగ్ మధ్య, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో నిబంధనలను అనుసరిస్తూ పూర్తి పారదర్శకంగా రిజర్వేషన్లు ఖరారు చేశారు.
ఖరారైన రిజర్వేషన్ల వివరాలను ప్రభుత్వానికి, ఎన్నికల కమిషన్‌కు కలెక్టర్ నివేదించనున్నారు. ఈ కార్యక్రమంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

# కొండా లక్ష్మణ్ బాపూజీ జీవిత చరిత్రను

## పాఠ్య పుస్తకాల్లో చేర్చాలి : గుంటి నగేష్



**హైదరాబాద్, (జనంసాక్షి) :** రాష్ట్ర ప్రభుత్వం ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ జీవిత చరిత్రను భావితరాలకు తెలిసేలా పాఠ్యపుస్తకాల్లో చేర్చాలని కొండా లక్ష్మణ్ బాపూజీ ఉత్సవ కమిటీ వైస్ చైర్మన్ గుంటి నగేష్ కోరారు. శనివారం హైదరాబాద్ లోని రవీంద్రభారతిలో జరిగిన దివంగత కొండా లక్ష్మణ్ బాపూజీ 110 వ జయంతి వేడుకల సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి, నివాళు లర్పించారు. ఈ సందర్భంగా గుంటి నగేష్ మాట్లాడుతూ కొండ లక్ష్మణ్ బాపూజీ ప్రజా సేవకే జీవితం అంకితం చేశారు, ఆయన జీవితం తెలంగాణ సమాజానికి ఆదర్శమని పేర్కొన్నారు. తొలిదశ, మలిదశ తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమానికి స్పూర్తి ప్రదాత కొండా లక్ష్మణ్ బాపూజీ అని కొనియాడారు. గాంధీజీ సిద్ధాంతాలను ఆచరించి, అణగారిన వర్గాల అభ్యున్నతికి బాపూజీ కృషి చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో చరణ్ దాసు ధనుంజయ, పెండెం నరసింహారావు, విజయ్ తదితరులు బాపూజీకి నివాళులర్పించారు.

# పారిశుద్ధ కార్మికులకు మద్దతు తెలిపిన బిఆర్ఎస్ పార్టీ



**ముస్తాబాద్ సెప్టెంబర్ 27 (జనం సాక్షి):** ముస్తాబాద్ మండల కేంద్రంలో మండలంలో అన్ని గ్రామాల పారిశుద్ధ్య కార్మికులు గత మూడు నెలలుగా ప్రభుత్వం వేతనాలు చెల్లించడం లేదని నిరసన దీక్ష కార్యక్రమం చేపట్టిన పారిశుద్ధ కార్మికులు.పారిశుద్ధ కార్మికులకు మద్దతు తెలిపిన బిఆర్ఎస్ నాయకులు ముస్తాబాద్ మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు బొంపల్లి సురేందర్ రావు మాట్లాడుతూ ప్రజా పాలన ప్రభుత్వంలో సఫాయి కార్మికులకు జీతాలు ఇవ్వలేని ప్రభుత్వం తెలంగాణలో ముఖ్యమైన పండుగ బతుకమ్మ. దసరా పండుగలకు కుటుంబ సభ్యులతో కొత్త బట్టలు సంతోషంతో ఉండాలనుకునే వేళలో చెల్లి గవ్వలేక కుటుంబంతో సతమతమవుతున్న కార్మికుల జీతం ఇస్తేనే పొట్ట గడుస్తది అలాంటి కార్మికులకు గత మూడు నెలల నుండి జీతాలు లేకపోవడంతో వారు ఏ విధంగా జీవనం సాగిస్తారు. ఒకసారి ప్రభుత్వం ఆలోచించాలని అన్నారు ఈ కార్యక్రమంలో ,సెస్ డైరెక్టర్ సందుపట్ల అంజిరెడ్డి, ముస్తాబాద్ పట్టణ బిఆర్ ఎస్ పార్టీ అధ్యక్షులు ఏద్దండి నర్సింహా రెడ్డి, మాజీ జడ్పీ కో ఆప్షన్ మెంబర్, సర్వర్ పాషా, మాజీ ముస్తాబాద్ పట్టణ అధ్యక్షులు.రాచమదుగు సంతోష్ రావు,కేటీఆర్ సేన రాష్ట్ర అధ్యక్షులు మెంగాని మనోహర్, ముస్తాబాద్ మండల యూత్ అధ్యక్షులు శీలం స్వామి, బిఆర్ ఎస్ పార్టీ సీనియర్ నాయకులు తాళ్ల రాజు, దొరగొల్ల దేవయ్య,మాజీ వార్డు మెంబర్ పల్లె సత్యం గౌడ్,వెల్లి మద్దతు తెలియజేయడం జరిగింది

# ఖైదీలకు ఉపాధితో పాటు శిక్షణ కల్పిస్తున్న తెలంగాణ జైళ్లశాఖ

## చర్లపల్లి ఓపెన్ జైల్లో అడ్వెంచర్ పార్కును ప్రారంభించిన డీజీపీ జితేందర్

**కాప్రా,(జనంసాక్షి) :** ఖైదీలను సత్ప్రవర్తన గల పౌరులుగా మార్చేందుకు వారికి ఉపాధి, శిక్షణ కల్పించేందుకు తెలంగాణ జైళ్లశాఖ ప్రత్యేకంగా చేస్తున్న సంస్కరణలు చాలా బాగున్నాయని తెలంగాణ రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ డీజీపీ డాక్టర్ జితేందర్ ఐపీఎస్ అన్నారు. చర్లపల్లి ఖైదీల వ్యవసాయక్షేత్రంలో పబ్లిక్ ప్రైవేట్ భాగస్వామ్యంతో ఏర్పాటు చేసిన అడ్వెంచర్ పార్కును తెలంగాణ జైళ్ల శాఖ డీజీ సౌమ్యమిశ్ర ఐపీఎస్తో కలసి ప్రారంభించారు. చర్లపల్లి ఖైదీల వ్యవసాయక్షేత్రంలో ప్రత్యేకంగా అడ్వెంచర్ పార్కులో పిల్లలు ఆడుకునేందుకు గోల్ఫ్ క్లబ్, యోగ కేంద్రంతో పాటు పిల్లలకు వ్యవసాయ సాగు విధానాలు చూపించేందుకు ప్రత్యేకంగా పార్కును ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా డీజీపీ డాక్టర్ జితేందర్ మాట్లాడుతూ ఈ ప్రాజెక్ట్ యువతలో ముఖ్యంగా పిల్లలలో వ్యవసాయంపై ఆసక్తి పెంచుతుందని భవిష్యత్లో సాగు అహార భద్రతపై అవగాహన పెరిగేలా చేస్తుందని అన్నారు. జైళ్లశాఖ డీజీ సౌమ్యమిశ్ర మాట్లాడుతూ ఈప్రాజెక్ట్ విడుదలైన ఖైదీలతో పాటు జైలు ఖైదీలకు మంచి ఉపాదితో పాటు శిక్షణ లబిస్తుందని అన్నారు.



# బతుకమ్మ ఉత్సవంతో ప్రకృతి ఆరాధన

- బుద్ధభవన్‌లో ఘనంగా హైడ్రా బతుకమ్మ వేడుకలు
- ముఖ్య అతిథిగా హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్

**హైదరాబాద్, సెప్టెంబర్ 27:** బుద్ధభవన్‌లో బతుకమ్మ వేడుకలు ఘనంగా జరిగాయి. రాష్ట్ర మహిళా కమిషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో బుద్ధభవన్‌లో ఉన్న కార్యాలయాలన్నిటిలో ఉన్న మహిళా ఉద్యోగినిలు బతుకమ్మ ఉత్సవాల్లో పాల్గొని ఆడి పాడారు. -తల్లితనం – ఆరోగ్యం-అనే అంశంపై ఈ ఉత్సవాలను నిర్వహించారు. ప్రకృతిని పరిరక్షించే పనిని హైడ్రా చేపట్టింది... ఆ ప్రకృతిలో అమ్మాయిలకు రక్షణగా మహిళా కమిషన్ పని చేస్తోంది. ఇలా ఇరు శాఖలు లక్ష్యాలు చాలా దగ్గరగా ఉన్నాయని ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ అన్నారు. తల్లితనంలో ఉన్న మాధుర్యం వర్ణించలేమన్నారు. తల్లి – బిడ్డ ఆరోగ్యంగా ఉన్నప్పుడు ఆరోగ్యవంతమైన సమాజం ఏర్పడుతుందని అన్నారు. పెళ్లి కళ కంటే తల్లి కళ చాలా వైభవంగా ఉంటుందని ఈ కార్యక్రమ నిర్వాహకులు, మహిళా కమిషన్ ఛైర్ పర్సన్ నేరెళ్ల శారద అన్నారు. ప్రకృతి పరిరక్షకులుగా మహిళలది ప్రధాన పాత్ర అని.. ఆరోగ్యవంతమైన సమాజం ఏర్పడాలంటే.. తల్లిఆరోగ్యంగా ఉండాల్సినవసరం ఉందన్నారు. ప్రసంగాల అనంతరం బుద్ధభవన్‌లో మహిళలు బతుకమ్మ ఆడారు. మిఠాయిలు పంచుకుని సందడి చేశారు.

## పేదలకు అండగా ముఖ్యమంత్రి సహాయ నిధి ప్రజల

# సంక్షేమమే కాంగ్రెస్ పార్టీ ధ్యేయం

## టిపిసిసి డెలిగేట్ కల్వకుంట్ల సుజిత్ రావు



**మెట్ పల్లి, సెప్టెంబర్ 27,(జనం సాక్షి) :** పేద ప్రజలకు అండగా ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ఆదుకుంటూ ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం అని టీపీసీసీ డెలిగేట్ సుజిత్ రావు అన్నారు. ఈ మేరకు కల్వకుంట్ల సుజిత్ రావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి సహాయనిధి కి సంబంధించిన 3 లక్షల 25వేల గల చెక్కులను శనివారం వారి నివాసంలో లబ్ధిదారులకు అందజేశారు ప్రజాభివృద్ధి సంక్షేమమే కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి సహాయనిధి పేద ప్రజలకు అండగా నిలుస్తున్నదని ముఖ్యమంత్రి సహాయనిధితో ప్రభుత్వం ప్రజలను ఆదుకుంటుందని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి సహాయనిధి సీఎం సహాయనిధి ద్వారా అందజేయడం జరుగుతుందన్నారు.ఈ కార్యక్రమంలో మెట్ పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కూన గోవర్ధన్,తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ సేల్ రాష్ట్ర జాయింట్ కోఆర్డినేటర్ వాకిటి సత్యం రెడ్డి,మెట్ పల్లి పట్టణ కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు ఖుతుబోదీన్ పాషా,టీపీసీసీ ఫిషర్మెన్ల ప్రధాన కార్యదర్శి రుత్త నారాయణ,మాజీ ఉప సర్పంచ్ సల్ల సునీల్, టీపీసీసీ సోషల్ మీడియా కన్వీనర్ కట్ట మనోజ్,మాజీ ఎంపిటిసి సిగారపు అశోక్,కల్లెడ గంగాధర్,సమీర్ సర్కార్,నల్లపు పోతూరాజు శ్రీకాంత్ సీఎం సహాయనిధి లబ్ధిదారులు ,కాంగ్రెస్ నాయకులు తదితరులు ఉన్నారు.

# విద్యా వ్యవస్థలో నూతన ఒరవడికి శ్రీకారం

- ఏటీసీ నైపుణ్య కోర్సులను యువత సద్వినియోగం చేసుకోవాలి
- మండేపల్లిలో ఆధునాతన సాంకేతిక కేంద్రం ప్రారంభోత్సవంలో పాల్గొన్న ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్





**తంగళ్ళపల్లి సెప్టెంబర్ 27 (జనం సాక్షి) :**
విద్యా వ్యవస్థలో నూతన ఒరవడికి ప్రజా ప్రభుత్వంలో సీఎం రేవంత్ రెడ్డి శ్రీకారం చుట్టారని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ తెలిపారు.రూ. 2,324 కోట్లు పైగా ఖర్చు చేసి ప్రజా ప్రభుత్వం 65 ఐటీఐ సెంటర్ లను ఆధునాతన సాంకేతిక కేంద్రాలుగా(ఏటీసీ) అప్ గ్రేడ్ చేస్తుండగా, వాటిని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వర్చువల్ విధానంలో శనివారం ప్రారంభించగా, తంగళ్లపల్లి మండలం మండేపల్లిలోని ఐటిఐ కేంద్రం ప్రాంగణంలో ఆరు కోర్సులతో ఏర్పాటు చేసిన ఆధునాతన సాంకేతికకేంద్రం (ఏటీసీ) ప్రారంభోత్సవ కార్యక్రమానికి ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల నియోజకవర్గం ఇంచార్జ్ కేకే మహేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా ఏటీసీ కేంద్రంలో ఏర్పాటు చేసిన పరికరాలు, యంత్రాలు, వాటి పనితీరును పరిశీలించారు. అనంతరం ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం రాష్ట్రంలో విద్య, వైద్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి ప్రణాళిక ప్రకారం ముందుకు వెళ్తుందని తెలిపారు. అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు చేస్తూ అన్ని వర్గాలకు ప్రజా ప్రభుత్వం అండగా నిలబడుతుందని స్పష్టం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి విద్యాశాఖ బాధ్యతలు చూస్తూ నూతన ఒరవడికి శ్రీకారం చుడుతున్నారని వివరించారు. మారుతున్న కాలానికి అనుగుణంగా యువత, విద్యార్థులకు ఉపాధి కల్పించడం లక్ష్యంగా కంపెనీ అవసరాలు తీర్చడమే ధ్యేయంగా ముందుకు సాగుతున్నదని తెలిపారు.ఇందులో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా 65 ఏటీసీ కేంద్రాలు ఈరోజు ప్రారంభించారని వివరించారు. రుద్రంగిలో రూ. 43 కోట్లతో ఐదు ఎకరాల విస్తీర్ణంలో ఏటీసీ ఏర్పాటు చేయనున్నామని వెల్లడించారు.ఏటీసీల్లో నైపుణ్య శిక్షణ పొందిన యువతకు కనీసం 20 వేల రూపాయల ప్రారంభ వేత్తనంతో ఉపాధి లభించేలా అనేక కంపెనీలతో ప్రభుత్వం ఒప్పందం చేసుకుందని తెలిపారు. పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలు విద్యార్థులకు అందించేందుకు టాటా సంస్థ సహకారంతో వివిధ కోర్సులు ఏటీసీలో విద్యార్థులకు నేర్పిస్తున్నామని వివరించారు. జిల్లాలోని ఏటీసీలో 172 మంది విద్యార్థులు శిక్షణ పొందుతున్నారని తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రులు ఇంజనీరింగ్, ఎంబిఏ వంటి కోర్సులనే కాకుండా మంచి ఉపాధి అవకాశాలు సత్వరం లభించే ఏటీసీ కోర్సుల వైపు కూడా ప్రోత్సాహించాలని సూచించారు.

తల్లిదండ్రుల ఆశలను నెరవేర్చే దిశగా యువత బాగా చదువుకొని ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సిరిసిల్ల మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ స్వరూపారెడ్డి, వేములవాడ మార్కెట్ కమిటీ చైర్మన్ రొండి రాజు, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, జిల్లా ఉపాధి కల్పన అధికారి రాఘవేందర్, ఏఎంసి వైస్ చైర్మన్ నేరెళ్ల నర్సింగ్గం గౌడ్, ఏం సి డైరెక్టర్ పరుశరాములు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జలగం ప్రవీణ్ కుమార్, రాజేశ్వరరావు, గడ్డం మధు, లింగాల భూపతి,ప్రిన్సిపాల్ కవిత తదితరులు పాల్గొన్నారు.

# దసరా కానుకగా ఇందిరమ్మ ఇండ్లు మంజూరు

- అధికారులతో సమన్వయం చేసి ప్రొసీడింగ్స్ అందించే బాధ్యత వెలిచాలకు అప్పగింత
- ప్రత్యేకంగా వెలిచాలను పిలిచి బాధ్యతల అప్పగించిన ముఖ్యమంత్రి



**కరీంనగర్ జిల్లా బ్యూరో, సెప్టెంబర్ 27 (జనంసాక్షి):**
కరీంనగర్ నియోజకవర్గ ప్రజలకు ముందే బతుకమ్మ దసరా పండుగ వచ్చేసింది. ఎన్నో ఏళ్ల నుంచి సొంతంటి కోసం ఎదురుచూస్తున్న లబ్ధిదారులకు కాంగ్రెస్ ప్రభుత్వం తీపి కబురు అందించింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కరీంనగర్ నియోజకవర్గంలో దసరా కానుకగా లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేశారు. దాదాపు 4వేల మంది లబ్ధిదారుల కు ఇండ్లను మంజూరు చేయడం విశేషం. బతుకమ్మ దసరా పండుగకు ముందే సొంతంటి కలను ముఖ్యమంత్రి నెరవేర్చడం విశేషంగా చెప్పుకోవ చ్చు. కరీంనగర్ నియోజకవర్గానికి ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేయించడంలో కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్చార్జి వెలిచాల రాజేందర్ రావు కీలకపాత్ర పోషించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తో ప్రత్యేకంగా మాట్లాడి ఎన్నికలు వచ్చేస్తున్న వేళ తక్షణమే లబ్ధిదారులకు వాటిని మంజూరు చేయాలని కోరారు. అందుకు సానుకూలంగా స్పందించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెంటనే ఇందిరమ్మ ఇండ్లకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. కరీంనగర్ నియోజకవర్గంలో అధికారులతో కోఆర్డినేషన్ చేసుకొని ఎంపిక చేసిన లబ్ధిదారులకు సత్వరమే ఇందిరమ్మ ఇండ్లకు సంబంధించిన ప్రొసీడింగ్స్ అందించే బాధ్యతను వెలిచాల రాజేందర్రావుకు అప్పగించారు. మొదటి విడతలో 4000 మంజూరు చేశారని అదనంగా రెండో విడతలో మరో నాలుగు వేలు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఇందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సానుకూలంగా స్పందించారని మరో 4000 మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. కరీంనగర్ నియోజకవర్గంలో ప్రతి ఒక్క పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసే బాధ్యత తాను తీసుకుంటానని ముఖ్యమంత్రి పేర్కొన్నారని రాజేందర్ రావు తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల మంజూరుకు కృషి చేసిన జిల్లా ఇన్చార్జి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రాష్ట్ర రవాణా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కు రాజేందర్రావు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

కమాన్ పూర్, నాగుల మల్యాలలో ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు ప్రొసిడింగ్ కాపీలను అందించిన వెలిచాల

శనివారం కొత్తపల్లి మండలం కమాన్ పూర్, నాగుల మల్యాల గ్రామాల్లో ఇందిరమ్మ ఇండ్లు మంజూరైన లబ్ధిదారులకు కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్చార్జి వెలిచాల రాజేందర్ రావు ప్రొసీడింగ్స్ ను అందజేశారు. ఇందిరమ్మ ఇల్లు మంజూరుతో తమ కల సాకారం అవుతున్నదని వారు ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వెలిచాల రాజేందర్రావు మాట్లాడుతూ... దసరా పండుగకు కానుకగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేశారని పేర్కొన్నారు. కరీంనగర్ నియోజకవర్గ వ్యాప్తంగా కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ తో పాటు కరీంనగర్ రూరల్ కొత్తపల్లి మండలాల్లో ఆయా డివిజన్ ఆఫీసర్లు పంచాయతీ కార్యదర్శులు, అధికారులు ఇందిరమ్మ ఇండ్లు మంజూరైన లబ్ధిదారులు ప్రొసీడింగులను అందించారని తెలిపారు. దాదాపు 3,850 మందికి ప్రొసిడింగులు అందజేశారని చెప్పారు. కరీంనగర్ నియోజకవర్గానికి అదనంగా ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయిస్తానని పేర్కొన్నారు. ప్రతి వారం ఇందిరమ్మ ఇండ్లకు సంబంధించిన బిల్లులు ఎప్పటికప్పుడు ప్రభుత్వం చెల్లిస్తున్నదని, తాను ముందుండి బిల్లులు ఇప్పించేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కొత్తపల్లి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పంజాల స్వామి గౌడ్, కాంగ్రెస్ నాయకులు బోనాల మురళి కృష్ణ, పెంట శేఖర్, నిమ్మల అంజయ్య, రుద్ర మనోహర్ సామి, పంజాల కృపాసాగర్, భూస సందీప్ బూస సంపత్, అరిగెల మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

# మంథని, చేర్యాలకు జీహెచ్ఎంసీ స్వచ్ఛత సహకారం

- స్వచ్ఛ్ శెహర్ జోడీ కార్యక్రమంలో భాగం
- 100 రోజుల మెంటార్‌షిప్‌తో మార్గదర్శనం
- సానిటేషన్, వ్యర్థ నిర్వహణలో సాంకేతిక సహాయం
- మేయర్ సమక్షంలో ఒప్పందం



**హైదరాబాద్, సెప్టెంబర్ 27 (జనంసాక్షి):** స్వచ్ఛ్ భారత్ మిషన్ – అర్బన్ 2.0 కింద కేంద్ర గృహ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ప్రవేశపెట్టిన 'స్వచ్ఛ్ శెహర్ జోడీ' కార్యక్రమంలో భాగంగా గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) మంథని, చేర్యాల పురపాలికలకు స్వచ్ఛత, సానిటేషన్, వ్యర్థ నిర్వహణలో మార్గదర్శనం అందించనుంది. జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో శనివారం జరిగిన కార్యక్రమంలో జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి. కర్ణన్, మంథని కమిషనర్ వెంకన్న, చేర్యాల కమిషనర్ ఎస్. నాగేందర్‌లు మేయర్ గద్వాల్ విజయలక్ష్మి సమక్షంలో ఒప్పందం కుదుర్చుకున్నారు. అదనపు కమిషనర్ (హెల్త్. శానిటేషన్) సి.ఎన్. రఘు ప్రసాద్, ఎస్‌బీఎం నోడల్ ఆఫీసర్ ఆర్. శ్రీనివాస రెడ్డి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. 'స్వచ్ఛ్ శెహర్ జోడీ' కార్యక్రమం కింద 100 రోజుల మెంటార్‌షిప్ ద్వారా జీహెచ్ఎంసీ తన మెంటీ సిటీలైన మంథని, చేర్యాలలో ఘన వ్యర్థాల వర్గీకరణ, రవాణా, వ్యర్థ జలాల నిర్వహణ, డిస్లడ్జింగ్ సేవల మెకానైజేషన్, శానిటేషన్ కార్మికుల సంక్షేమం, స్వచ్ఛతపై అవగాహన కార్యక్రమాలు, పౌరుల అభిప్రాయాలు, ఫిర్యాదుల పరిష్కారం వంటి ఎనిమిది ప్రధాన అంశాల్లో సాంకేతిక, ఆపరేషనల్ సహకారం అందించనుంది. అదే రోజు ఐఐటీ ఢిల్లీ టెక్నోపార్క్, సోనిపత్‌లో జాతీయ స్థాయి ప్రారంభోత్సవం జరిగింది. ఈ కార్యక్రమం ద్వారా జీహెచ్ఎంసీ, మెంటార్ సిటీగా తన మెంటీ సిటీల్లో స్వచ్ఛత, పౌర సంతృప్తిని మెరుగుపరచడానికి సహకరించనుంది. ఇది స్వచ్ఛ్ సర్వేక్షణ్ 2025కు ముందుగా పట్టణాల్లో సానుకూల మార్పులు తీసుకురావడానికి దోహదపడనుంది.

# యువత ప్రపంచ స్థాయి నైపుణ్యాలను అందిపుచ్చుకోవాలి

- వృత్తి నైపుణ్యాలతో భారీ ఉద్యోగ అవకాశాలు
- కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి




**కల్వకుర్తి సెప్టెంబర్ 27(జనం సాక్షి) :**
ప్రపంచం సాంకేతికంగా పరుగులు పెడుతున్న నేటి తరుణంలో విద్యార్థులు ఆధునిక సాంకేతికతను తెలుసుకొని ప్రపంచంతో పోటీ పడాలని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. కల్వకుర్తి పట్టణంలోని ఐటిఐ కళాశాలలో శనివారం అధునాతన సాంకేతిక కేంద్రం ప్రారంభోత్సవానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఐటిఐ కళాశాల ప్రిన్సిపల్ జయమ్మ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కాలం చెల్లిన కోర్సులతో కొనసాగుతున్న ఐటిఐ లను ఆధునికరించి పరిశ్రమలకు అవసరాలకు అనుగుణంగా టాటా టెక్నాలజీస్ వారి సహకారంతో ఐటిఐ లను ఏటీసీలుగా తీర్చిదిద్దినట్లు చెప్పారు. నియోజకవర్గ యువతకు ప్రపంచ స్థాయి నైపుణ్యాలు అందించే దిశగా ఏటీసీ సెంటర్లను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఏటీసీ సెంటర్లో నేర్పే ప్రతి అంశం క్షుణ్ణంగా నేర్చుకొని భవిష్యత్తులో అభివృద్ధి చెందేందుకు ఉపయోగించుకోవాలన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర వ్యాప్తంగా శనివారం 65 ఏటిసి సెంటర్లను ప్రారంభించినట్లు చెప్పారు. దీంతో కోటి మంది యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. 2047 తెలంగాణ రాష్ట్రాన్ని ప్రపంచంలోనే నెంబర్ వన్ గా నిలిపేందుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. కల్వకుర్తి పట్టణంలో అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ ప్రారంభించడంతో ఇక్కడి ప్రాంత విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతుందని విద్యార్థులు ఇక్కడ శిక్షణ పొంది సాంకేతికంగా ఉద్యోగాలు స్థిరపడాలని ఎమ్మెల్యే సూచించారు.ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఆనంద్ కుమార్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు మెంబర్ బాలాజీ సింగ్, మార్కెట్ చైర్మన్ మనీలా సంజు కుమార్, జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి మిర్యాల శ్రీనివాస్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు విజయ్ కుమార్ రెడ్డి, పట్టణ అధ్యక్షుడు శ్రీకాంత్ రెడ్డి, రాష్ట్ర యువజన నాయకులు చంద్రకాంత్ రెడ్డి, పుస్తకాల రాహుల్, రేష్మ బేగం, తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ విప్‌తో విభేదాలే కలెక్టర్ బదిలీకి కారణమా!

- ప్రజా పాలన దినోత్సవంలో ప్రోటోకాల్ పాటించని కలెక్టర్ సందీప్ కుమార్ ఝూ
- నిర్వాసితుల పరిహారం చెల్లింపుల విషయంలో కలెక్టర్ పై హైకోర్టు ఆగ్రహం
- తరచూ వివాదాల్లో ఉండడంతో బదిలీవేటు వేసిన ప్రభుత్వం : నూతన కలెక్టర్‌గా హరిత





**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 27 (జనంసాక్షి) :**
రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝూ నిత్యం ఏదో ఒక విషయంలో వార్తల్లో ఉంటూ వస్తున్నారు. ఆయన బాధ్యతలు స్వీకరించిన మొదట్లో భూ అక్రమార్కులు, బిఆర్ఎస్ నేతల విషయంలో దూకుడుగా వ్యవహరించిన కలెక్టర్ తదనంతరం అధికార పార్టీ నాయకులకు కలెక్టర్ కు మధ్య దూరం పెరగడం, పలు వివాదాల కలెక్టర్ ను చుట్టుముట్టడంతో ప్రభుత్వం బదిలీ వేటు వేసింది.నూతన జిల్లా కలెక్టర్ గా హరితను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.
జిల్లా కలెక్టర్ గా సందీప్ కుమార్ ఝూ చాలా దూకుడుగా వ్యవహరించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాల అమల్లో రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్చార్జి కేకే మహేందర్రెడ్డి, చొప్పదండి మానకొండూరు ఎమ్మెల్యేలతో సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగారు.ఇదే సమయంలో ధరణి పోర్టల్ ఉన్న సమయంలో భూములు అన్యాక్రాంతం కావడంతో వాటిపై ప్రత్యేక దృష్టి సారించి స్వాధీనం చేసుకున్నారు. ఇంతవరకు బాగానే ఉన్నా రోజురోజుకు అధికార పార్టీకి చెందిన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ కు కలెక్టర్ కు మధ్య దూరం పెరుగుతూ వచ్చింది. ఇద్దరి మధ్య ఏదో జరుగుతుందన్న ప్రచారం సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. దీనికి తోడు ఇటీవల ప్రజాపాలన దినోత్సవం సందర్భంగా ఆది శ్రీనివాస్ ముఖ్య అతిథిగా పాల్గొని జాతీయ జెండా ఎగరవేయడానికి వచ్చిన సందర్భంలో జిల్లా కలెక్టర్ ప్రోటోకాల్ పాటించాల్సిన ఆయన అక్కడ లేకపోవడం తీవ్ర వివాదానికి దారి తీసింది. ఈ విషయమే ప్రభుత్వ విప్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. దీనికి తోడుగా జిల్లా అధికారుల వాట్సప్ గ్రూపులో డిపిఆర్ఓ ఓ కార్టూన్ పోస్ట్ చేయడం తీవ్ర దుమారమే రేపింది. దీంతో డిపిఆర్ఓ ను సస్పెండ్ చేస్తూ సందీప్ కుమార్ ఝూ ఉత్తర్వులు జారీ చేశారు.


**వివాదాల సుడిగుండంలో...**

జిల్లా కలెక్టర్ గా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి విద్య, వైద్యంపై కలెక్టర్ ప్రత్యేక దృష్టి సారించారు. పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం కట్టెలపై నుంచి గ్యాస్ స్టవ్ ల ఏర్పాటు,విద్యార్థులకు మౌలిక సదుపాయాల కల్పనపై అప్పటికప్పుడు నిధులు కేటాయించి పనులు చేపట్టించారు.వైద్య ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సిబ్బంది సమయపాలన పాటించే విధంగా చూడడంతో పాటు రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించడం,ప్రైవేటు వైద్య ఆసుపత్రులపై ఎప్పటికప్పుడు పర్యవేక్షణ తనిఖీలు చేయించారు. అయితే భూములు అన్యక్రాంతంకు సంబంధించిన విషయంలో ఓ రైతుపై కేసు నమోదు చేయించారు. కోర్టు నిర్వాసితుడికి పరిహారం చెల్లించాలన్నప్పటికీ అనుపురం, చీర్లవంచ గ్రామాలకు చెందిన నిర్వాసితులకు పరిహారాలు చెల్లించకపోవడం,పాడి రైతులకు సంబంధించిన అగ్రహారం డైరీని సీజ్ చేయడం వంటివి వివాదంగా మారాయి.ఈ క్రమంలో ప్రభుత్వంపై వ్యతిరేకత ఏర్పడుతుందన్న భావన అధికార పార్టీ వర్గాల్లో మొదలైంది. వీటన్నిటికీ తోడు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ తో ఉన్న దూరం,విభేదాలు కలెక్టర్ బదిలీకి కారణమయ్యాయని జిల్లా ప్రజల్లో చర్చ కొనసాగుతుంది.

జనంసాక్షి
www.janamsakshi.org
ఆదివారం
28 సెప్టెంబర్ 2025

# సాహస క్రీడల్లో బీసీ గురుకుల విద్యార్థుల ప్రతిభ

- సెయిలింగ్ స్పోర్ట్స్ స్కూల్‌కు ఎనిమిదో తరగతి విద్యార్థి మధు ఎంపిక
- సౌత్ జోన్ నేషనల్ అథ్లెటిక్స్ పోటీల్లో పతకం సాధించిన శివకుమార్
- విద్యార్థులను అభినందించిన మంత్రి పొన్నం ప్రభాకర్, సొసైటీ కార్యదర్శి బడుగు సైదులు



హైదరాబాద్ (జనంసాక్షి) : బీసీ గురుకుల విద్యార్థులు రాష్ట్ర ప్రభుత్వ క్రీడా పాలసీకి అనుగుణంగా క్రీడల్లో పతకాలు సాధిస్తూ మరొవైపు జాతీయ స్థాయి క్రీడా పాఠశాల లో సీట్లు సాధిస్తున్నారు. జాతీయ స్థాయిలోని ఆర్మీ యాచింగ్ నోడ్ స్పోర్ట్స్ కంపెనీ, ముంబాయి స్కూల్‌కు ఈ.మధు, ఎనిమిదో తరగతి, (రంగారెడ్డి జిల్లా మంచాల గురుకుల పాఠశాల) విద్యార్థి ఎంపిక అయ్యాడు. ఈ స్కూల్లో చేరిన వారికి చదువు పూర్తయిన తర్వాత ఆర్మీ లో జాబ్ వచ్చే అవకాశాలు మెండుగా ఉన్నాయి. జాతీయ అథ్లెటిక్స్ పోటీల్లో మహబూబ్ నగర్ జిల్లా కోయిల కొండ గురుకుల కాలేజీ లో ఇంటర్ రెండో సంవత్సరం విద్యార్థి కె. శివకుమార్ కాంస్య పతకం సాధించాడు. వీరిద్దరిని బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, సెక్రటరీ అభినందించారు. క్రీడాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులు శనివారం ఎంజేపి సొసైటీ కారదర్శి బడుగు సైదులు ని కలిశారు. విద్యార్థులు పతకాలు సాధించడం అభినందనీయమని మహాత్మా జ్యోతిబా పూలే తెలంగాణ బీసీ గురుకుల సొసైటీ కార్యదర్శి బడుగు సైదులు అన్నారు. విద్యార్థుల అభిరుచి మేరకు సాహస క్రీడల్లో ప్రత్యేక శిక్షణ అందిస్తున్నామని ఆయన పేర్కొన్నారు. హైదరాబాద్ యాచ్ క్లబ్ వారి ద్వారా శిక్షణ పొందిన విద్యార్థులు జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావడంతో పాటు పతకాలు సాధించారని ఆయన గుర్తు చేశారు. మొదటిసారి బీసీ గురుకుల విద్యార్థి ఈ. మధు జాతీయ స్థాయిలోని ఆర్మీ యాచింగ్ నోడ్ స్పోర్ట్స్ కంపెనీ, ముంబాయి స్కూల్లో సీటు సాధించడం సంతోషంగా ఉందన్నారు. ఈ స్కూల్లో చేరిన వారికి చదువు పూర్తయిన తర్వాత ఆర్మీ లో జాబ్ వచ్చే అవకాశాలు మెండుగా ఉన్నాయని ఆయన అన్నారు. క్రీడా శిక్షణకు ఎంపికైన విద్యార్థుల ప్రతిభను గుర్తించి వారిలోని శక్తి సామర్థ్యాలను వెలికితీసే ప్రయత్నం చేస్తున్నామన్నారు. అంతర్జాతీయ, జాతీయ స్థాయిలో జరిగే క్రీడా పోటీల్లో తెలంగాణ పేరు నిలబెట్టేందుకు బీసీ గురుకుల విద్యార్థులు శ్రమించాలని ఆయన సూచించారు. ఈ సందర్భంగా సెక్రటరీ సార్ బీసీ గురుకుల విద్యార్థులను శాలువాతో సత్కరించారు. జాయింట్ సెక్రటరీ తిరుపతి విద్యార్థులను అభినందించారు.

## అమెరికాలో ఉంటున్న విద్యార్థులు, ఓపీటీ అభ్యర్థులకు

# లక్ష డాలర్ల ఫీజు వర్తించదు

- అమెరికా ఇమిగ్రేషన్ నిపుణుల స్పష్టీకరణ
- ప్రజాభవన్ లో హెచ్-1 బీ అవగాహన సెమినార్



హైదరాబాద్ (జనంసాక్షి) : అమెరికాలో హెఫ్-1 విద్యార్థులు, ఓపిటిలో ఉన్న అభ్యర్థులు హెచ్ -1 బీ వీసా కోసం దరఖాస్తు చేసుకుంటే లక్ష రూపాయల డాలర్లు ఫీజు వర్తించదని అమెరికా ఇమిగ్రేషన్ నిపుణులు స్పష్టం చేశారు. శనివారం ప్రజాభవన్ లో సీఎం ప్రవాసి ప్రజావాణి నిర్వహించిన హెచ్ -1 బి ఇంటరాక్టివ్ సెషన్ లో పలువురి అనుమానాలను యూఎస్ఏ ఇమిగ్రేషన్ నిపుణులు నివృత్తి చేశారు. భారతదేశంతో సహా ఇతర దేశాల నుంచి కొత్తగా అమెరికా హెచ్ వన్ బి వీసా కోసం దరఖాస్తు చేసుకునే వారికి మాత్రమే లక్ష రూపాయల ఫీజు వర్తిస్తుందని వారు పేర్కొన్నారు. ఇప్పటికే అమెరికాలో ఉద్యోగం చేస్తూ ఇతర సంస్థలకు మారిన ఇలాంటి ఫీజు ఉండదని వారు తెలిపారు. హెచ్ ఫోర్ వీసా ఉన్న దంపతులు హెచ్1బిలోకి మారెందుకు దరఖాస్తు చేసుకున్నా కూడా లక్ష రూపాయల డాలర్ ఫీజు వర్తించదని అమెరికా ఇమిగ్రేషన్ నిపుణులు పేర్కొన్నారు. అమెరికా హెచ్ -1 బీ దరఖాస్తు చేసుకునే అంశంలో ఎవరికి ఎలాంటి సందేహాలు ఉన్నా సీఎం ప్రవాసి ప్రజావాణిలో సంప్రదిస్తే నివృత్తి చేస్తామని స్టేట్ కోఆర్డినేటర్ బొజ్జ అమరేందర్ రెడ్డి తెలిపారు. ఈ ఇంటరాక్టివ్ స్టేషన్ లో అమెరికా నుంచి జూమ్ ద్వారా వర్జీనియా స్టేట్ సెన్సస్ కమిషనర్ శ్రీధర్ నాగిరెడ్డి, అమెరికా రిపబ్లికన్ పార్టీ నాయకులు బంగారు రెడ్డి పాల్గొనగా, ప్రజా భవన్ నుంచి అమెరికన్ ఇమిగ్రేషన్ అటార్నీ జాష్ డార్లింపెల్, ఎన్నారై అడ్వైజరీ కమిటీ చైర్మన్ అంబాసిడర్ వినోద్ కుమార్, ఇమిగ్రేషన్ నిపుణులు హరికృష్ణ, సీఎం ప్రవాసి ప్రజావాణి స్టేట్ కోఆర్డినేటర్ బొజ్జ అమరేందర్ రెడ్డి, ఆర్టిస్ట్ సంఘం రాష్ట్ర అధ్యక్షులు రమణారెడ్డి, తదితరులు హాజరయ్యారు.

## మూసీ వరద బాధిత ప్రాంతాల్లో

# హైడ్రా కమిషనర్ పరిశీలన



హైదరాబాద్, సెప్టెంబర్ 27 (జనంసాక్షి) : మూసీ నది వరద ముంచెత్తిన ప్రాంతాలను శనివారం క్షేత్ర స్థాయిలో హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ పరిశీలించారు. చాదర్ ఘాట్, మూసారంబాగ్, ఎంజీ బీ ఎస్, నార్సింగి ప్రాంతాల్లో వరద ఉధృతిని తనిఖీ చేసారు. చాదర్ ఘాట్ ప్రాంతంలో మూసీ నది ముంచెత్తిన నివాస ప్రాంతాలలో సహాయక చర్యలను పరిశించారు. నీట మునిగిన ప్రాంతాల నుంచి సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలంటూ స్థానికులకు విజ్ఞప్తి చేశారు. అక్కడ వరదలో చిక్కుకుని భవనాలపై ఉన్నవాళ్ళకి డ్రోన్స్ ద్వారా ఆహారం అందించడాన్ని పరిశీలించారు. గోడలు పూర్తిగా నీటమునిగాయి.. కూలే ప్రమాదం ఉంటుందని ఖాళీ చేయాలని హెచ్చరించారు. అయినా కొంతమంది అక్కడి నుంచి ఖాళీ చేసే పరిస్థితి కనిపించలేదు. ఎంజీబీ ఎస్ వద్ద మూసి నది రిటైనింగ్ వాల్ పడిపోవడంతో వరద లోపలకి ప్రవేశించిన ప్రాంతాలను పరిశీలించారు. దసరా సెలవుల నేపథ్యంలో ప్రయాణికులకు ఎలాంటి యిబ్బంది లేకుండా హైడ్రా డీఆర్ఎఫ్ సిబ్బంది అందుబాటులో ఉండాలని సూచించారు. శుక్రవారం అర్ధ రాత్రి ఎంజీబీఎస్ ప్రాంగణంలోకి వరద వచ్చినప్పుడు చేపట్టిన సహాయక చర్యలను కమిషనర్ అభినందించారు. వందలాది మంది ప్రయాణికులను సురక్షితంగా హైడ్రా డీఆర్ఎఫ్, ఆర్టీసీ, జీహెచ్ఎంసీ సిబ్బంది బయటకు తీసుకెళ్లడం అభినందనీయమన్నారు. మూసీ వరదల దృష్ట్యా పరీవాహక ప్రాంతాల వారు అప్రమత్తంగా ఉండాలని హైడ్రా కమిషనర్ సూచించారు. నార్సింగి ప్రాంతంలో ఓఆర్ఆర్ మీదనుంచి గండిపేట నుంచి వస్తున్న వరద ఉధృతిని పరిశీలించారు. అక్కడ సర్వీస్ రోడ్ల మీదుగా వరద ప్రవహించడాన్ని చూశారు. ఎవరు కూడా పొరపాటున ఆ మార్గంలో వెళ్లకుండా కాపలా కాయలని కోరారు.

నార్సింగి - మంచిరేవుల మధ్య ఔటర్ రింగ్ రోడ్డు సర్వీస్ రోడ్డులో వరదలో చిక్కుకున్న నలుగురిని హైడ్రా డీఆర్ఎఫ్ బృందాలు శుక్రవారం రాత్రి కాపాడాయి. ఉస్మాన్ సాగర్ (గండిపేట) గేట్లు ఎత్తడంతో భారీగా వచ్చిన వరదతో సర్వీసు రోడ్డు మీద నుంచి వరద పారుతోంది. ఆ మార్గంలో వెళ్లరాదని బారికేడ్లు పెట్టినా పట్టించుకోకుండా ఆటో ట్రాలీ లో రోడ్ దాటేందుకు ప్రయత్నించాడు డ్రైవర్. అప్పుడు ఆటో ట్రాలీలో డ్రైవర్ తో పాటు నలుగురు ఉన్నారు. కొంత దూరం వెళ్ళేసరికి వరద ఎక్కువ ఉండడంతో ఆటో ట్రాలీ ఆగిపోయింది. అక్కడ ఉన్న పోలీసులు, హైడ్రా డీఆర్ఎఫ్ సిబ్బంది గమనించి వాళ్ళని సురక్షితంగా కాపాడారు.

# బ్రిడ్జిపై నుంచి ఎవ్వరినీ అనుమతించొద్దు

- వరద ప్రభావిత ప్రజలు అప్రమత్తంగా ఉండాలి
- మంత్రి పొన్నం ప్రభాకర్
- మూసీ పరీవాహక ప్రాంతాల్లో పర్యటించిన మంత్రి పొన్నం ప్రభాకర్, మేయర్, కమిషనర్



హైదరాబాద్ (జనంసాక్షి) : బ్రిడ్జిపై నుంచి ఎవ్వరినీ అనుమతించొద్దని, వరద ప్రభావిత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. చాదర్ ఘాట్ బ్రిడ్జి, ఎంజీబీఎస్ బస్ స్టేషన్, మలక్‌పేటలోని పునరావాస కేంద్రాలకు మంత్రి పొన్నం ప్రభాకర్,మేయర్ గద్వాల విజయ లక్ష్మీ, రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్ వి కర్ణన్,హైదరాబాద్ కలెక్టర్ దాసరి హరిచందన ,ఇతర అధికారులు పరిశీలించారు. జంట జలశయాల గేట్లు ఎత్తడంతో పై నుండి వస్తున్న వరద వల్ల చాదర్ ఘాట్ బ్రిడ్జి మునిగిపోవడంతో చౌదర్ ఘాట్ బ్రిడ్జిని పరిశీలించారు. వరద ప్రభావం అధికంగా ఉండడంతో బ్రిడ్జిపై ప్రజలను ఎవరిని అనుమతించవద్దని పోలీసులను మంత్రి ఆదేశించారు. చాదర్ ఘాట్ బ్రిడ్జి సైడ్ వాల్స్ దెబ్బతినడంతో వరద తగ్గిన తరువాత వెంటనే బ్రిడ్జిపై నుండి ఎవరిని అనుమతించవద్దని సూచించారు. మూసీ పరీవాహక ప్రాంతాల్లో ఉన్న నివాసాలు మునిగిపోవడంతో వారిని పునరావాస కేంద్రాలకు తరలించారని ఇళ్ల వద్దకు ఎవరు రాకుండా చూసుకోవాలని తెలిపారు. రాత్రి వరద దాటికి మునిగిపోయిన ఎంజీబీఎస్ బస్ స్టేషన్‌ను పరిశీలించారు.. బస్సులు డైవర్ట్ చేయడంతో ప్రయాణికులకు ఇబ్బందులు కలగకుండా తీసుకున్న చర్యలపై ఆరా తీశారు.


ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ జిల్లాలకు వెళ్లే ఆర్టీసీ బస్సులు ఆల్టర్నేటివ్ రూట్లో వెళ్తుండడంతో వాటి బస్సు సూచనలు ప్రజలకు తెలియజేయాలని ఆర్టీసీ అధికారులను ఆదేశించారు. పునరావాస కేంద్రాల్లో ఉన్న ప్రజలకు ఇబ్బందులు కలగకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలని జిహెచ్ఎంసి హైదరాబాద్ అధికారులకు సూచించారు. భారీ వర్షానికి చాదర్‌ఘట్ లెవెల్ బ్రిడ్జ్ మునిగిపోయిందని, పైనుండి వరద పోతున్నదని, ఎంజీబీఎస్ బస్టాండ్ మునిగిపోయిందని, పురానాపూల్ వంతెన పైనుండి వరద పోతున్నదని, ముఖ్యమంత్రి ఆదేశాలతో ప్రత్యక్షంగా వరద ప్రభావిత ప్రాంతాలను పరిశీలిస్తున్నామని తెలిపారు. వరద వచ్చినప్పుడు ఎక్కడ ప్రాణ నష్టం జరగకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకున్నామని, పునరావాస కేంద్రాల్లో ఉన్న ప్రజలకు తాగునీటి సౌకర్యము, ఆహార పదార్థాలు, పిల్లలకు పాలు తదితర సౌకర్యాలు కల్పిస్తున్నామని, జిహెచ్ఎంసి, హైదరాబాద్ కలెక్టర్, హైడ్రా, పోలీస్ వివిధ విభాగాలు సమన్వయం చేసుకొని పనిచేస్తున్నారని, వర్షాలు ఊహించిన దానికన్నా ఎక్కువగా కురుస్తున్నాయని, ప్రజలు సహకరించాలని సూచించారు. బ్రిడ్జి పైనుండి వరదలు పోతుండడం వల్ల మూసి ప్రధాన దారుల్లో ట్రాఫిక్ ఎక్కువగా ఉందని, రాత్రి ఒక్కసారిగా వరద రావడంతో ఎంజీబీఎస్ బస్ స్టేషన్ లో ఉన్న ప్రయాణికులను రెస్క్యూ టీమ్ సురక్షితంగా బయటకు తీసుకొచ్చిందని తెలిపారు. పండగ పూట ప్రయాణికులకు ఇబ్బందులు కలగకుండా ఉండడానికి ప్రత్యామ్నాయ మార్గాల్లో బస్సులు నడుపుతున్నామని, ఉత్తర తెలంగాణ నుండి వెళ్లే ప్రయాణికులు జేబీఎస్ బస్టాండ్ నుండి.. వరంగల్ వైపు వెళ్లే ప్రయాణికులు ఉప్పల్ నుండి, నల్గొండ వైపు వెళ్లే ప్రయాణికులు హయత్ నగర్ నుండి, మహబూబ్‌నగర్ వైపు వెళ్లే ప్రయాణికులు అరంగర్ వైపు నుండి బస్సులు నడుపుతున్నామని తెలిపారు. ప్రయాణికులు లోకల్ బస్సుల ద్వారా అక్కడికి వెళ్లి జిల్లా బస్సులకు ఎక్కి గమ్యస్థానాలకు వెళ్ళవచ్చని తెలిపారు. ప్రాణ నష్టం జరగకుండా అన్ని రకాల చర్యలు తీసుకున్నామని తెలిపారు. ప్రతిపక్షాలు బాధ్యత రాహిత్యంగా మాట్లాడితే సరికాదన్నారు. ప్రకృతిని ఎదిరించే శక్తి ఎవరికి ఉండదని, చెరువులు వరదలు ,కాలువలు వద్ద ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. ఎవరికి ప్రాణ నష్టం జరగకుండా ప్రభుత్వ యంత్రాంగం అప్రమత్తంగా ఉందని, ఎక్కడ ఇబ్బందులు ఉన్న అధికారులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

### మూసి వరద బాధితుల కోసం జీహెచ్ఎంసీ 10 ప్రత్యేక పునరావాస కేంద్రాలు



హైదరాబాద్, సెప్టెంబర్ 27 (జనంసాక్షి) : మూసి వరద ప్రభావితుల కోసం జీహెచ్ఎంసీ పలు పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసింది. ఇప్పటివరకు మొత్తం 1,467 మంది బాధితులు ఈ కేంద్రాల్లోకి తరలించారు. మలక్‌పేట్, అంబర్‌పేట్, గోషామహల్ సర్కిల్స్ పరిధిలోని పాఠశాలలు, కమ్యూనిటీ హాల్స్, మొదలైన ప్రదేశాలను పునరావాస కేంద్రాలుగా మార్చి బాధితులకు తక్షణ సాయం అందిస్తున్నారు. ఈ కేంద్రాల్లో బాధితులకు భోజనం, తాగునీరు, ఆరోగ్య శిబిరాలు, అవసరమైన వారికి వైద్య సేవలు అందుబాటులో ఉంచినట్లు అధికారులు తెలిపారు. జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి. కర్ణన్ స్వయంగా ఈ పునరావాస కేంద్రాలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ, ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా అధికారులు చూడాలని, నిరంతరం అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు.

# మిరాయ్ టిక్కెట్ ధరల తగ్గింపు




హైదరాబాద్, సెప్టెంబర్27 (జనంసాక్షి) : తేజ సజ్జా, మంచు మనోజ్ కీలక పాత్రల్లో యువ దర్శకుడు కార్తీక్ ఘట్టమనేని రూపొందించిన ఫాంటసీ ఫిల్మ్ 'మిరాయ్' విజయవంతంగా ప్రదర్శితం అవుతోంది. సెప్టెంబరు 12న పాన్ ఇండియా స్థాయిలో విడుదలైన ఈ మూవీ బాక్సాఫీస్ వద్ద మంచి వసూళ్లు రాబడుతోంది. ఇప్పటివరకూ రూ.140 కోట్లకు పైగా వసూలు చేసింది. ఈ క్రమంలో మరింత మంది ప్రేక్షకులకు సినిమాను చేరువ చేసేందుకు చిత్ర బృందం కీలక నిర్ణయం తీసుకుంది. ఏపీ, తెలంగాణలోని సింగిల్ స్క్రీన్ టికెట్ ధరలను తగ్గించింది. 'ఈ దసరాను మీ కుటుంబం, పిల్లలతో కలిసి 'మిరాయ్' సినిమా థియేటర్‌లో జరుపుకోండి. సింగిల్ స్క్రీన్లో అతి తక్కువ టికెట్ ధరకు మూవీని ఆస్వాదించండి' అని పేర్కొంది. బాల్కనీ టికెట్ ధరను రూ.150, ఫస్ట్ క్లాస్‌ను రూ.105గా నిర్ణయించింది. చిత్ర నిర్మాణ సంస్థ పీపుల్ మీడియా ఫ్యాక్టరీ తాజా నిర్ణయంతో మరింత మంది ప్రేక్షకులు థియేటర్‌కు క్యూ కట్టే అవకాశం ఉందని సినీ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. ఈ సినిమా విడుదల సమయంలోనూ సాధారణ టికెట్ ధరలనే అమలు చేస్తేనే రూ.140 కోట్లు- వసూలు కాగా, ఇప్పుడు తగ్గించిన ధరలతో మరింత మంది ప్రేక్షకులు థియేటర్‌కు వచ్చే అవకాశం ఉంది. మరోవైపు థియేటర్‌కు వచ్చే ప్రేక్షకులకు మరింత వినోదాన్ని అందించడానికి 'వైబ్' సాంగ్‌ను జత చేస్తున్నట్లు- చిత్రబృందం ఇప్పటికే ప్రకటించింది.

# మరణించిన వారి ఖాతాల క్లెయిమ్

- 15 రోజుల్లోగా పరిష్కారం
- బ్యాంకులకు ఆర్‌బిఐ మార్గదర్శకాలు




ముంబయి, సెప్టెంబర్27 (జనంసాక్షి) : చనిపోయిన వారి బ్యాంకు ఖాతాలు, లాకర్లకు సంబంధించిన క్లెయిమ్ సెటిల్‌మెంట్ నిబంధనలను రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సవరించింది. 15 రోజుల గడువులోగా సెటిల్‌మెంట్ ప్రక్రియ పూర్తవ్వాలని, ఒక వేళ ఆలస్యమైతే నిర్దిష్ట పరిహారాన్ని నామినీలకు ఇవ్వాల్సి ఉంటుందని ఆర్‌బీఐ స్పష్టం చేసింది. ఆ మేరకు 'రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సెటిల్‌మెంట్ ఆఫ్ క్లెయిమ్స్ ఇన్ రెస్పెక్ట్ ఆఫ్ డిసీజ్డ్ కస్టమర్స్ ఆఫ్ బ్యాంక్స్ డైరెక్షన్స్ 2025' కింద సవరించిన నిబంధనలను జారీ చేసింది. వీటిని సాధ్యమైనంత త్వరగా అమలు చేయాలని.. 2026 మార్చి 31 కంటే ఆలస్యం కారాదని తెలిపింది. నామినేషన్ లేదా సర్వైవర్‌షిప్ క్లాజ్‌తో ప్రారంభించిన డిపాజిట్ ఖాతాలకు సంబంధించి, డిపాజిటర్లు మరణించినపుడు నామినీ/సర్వైవర్‌కు వాటిని బదిలీ చేయడం బ్యాంకుల బాధ్యత అని ఆర్‌బీఐ తెలిపింది. నామినీ/సర్వైవర్‌షిప్ క్లాజ్ లేని ఖాతాల విషయంలో క్లెయిముల సెటిల్‌మెంట్‌కు సరళీకృత ప్రక్రియ అవలంబించాలని స్పష్టం చేసింది. నిర్దిష్ట పరిమితికే ఇది వర్తిస్తుందని వివరించింది. ఖాతాలో సహకార బ్యాంకులకు రూ.5 లక్షలు, ఇతర బ్యాంకులకు రూ.15 లక్షలుగా ఈ పరిమితి ఉంది. ఈ పరిమితికి మించి మొత్తం ఉంటే వారసత్వ ధ్రువీకరణ పత్రం లేదా చట్టబద్ధ వారసత్వ ధ్రువపత్రం వంటి అదనపు పత్రాలను కోరవచ్చని తెలిపింది. ఆలస్యమైతే ఇదీ పరిహారం: 15 క్యాలెండర్ దినాల్లో క్లెయిమ్ సెటిల్‌మెంట్ చేయకపోతే.. బ్యాంకు ఖాతా విషయంలో 4శాతం వడ్డీ రేటుకు తక్కువ కాకుండా పరిహారం ఇవ్వాల్సి ఉంటుంది. సేఫ్ డిపాజిట్ లాకర్/కస్టడీలోని వస్తువుల విషయంలో.. ఆలస్యమైన ప్రతి రోజుకూ రూ.5000 చొప్పున చెల్లించాల్సి ఉంటుందని తెలిపింది.

# ఉమ్మడి మెదక్‌లో భారీ వర్షాలు


- నీట మునిగిన ఏడుపాయల ఆలయం
- మంజీరా నది ఉధృతితో వరదలు



మెదక్, సెప్టెంబర్27 (జనంసాక్షి) : ఉమ్మడి మెదక్ జిల్లాలో భారీ వర్షాలు కురిసాయి. సంగారెడ్డి నియోజకవర్గంలో ఎడతెరపి లేకుండా వర్షం కురుస్తోంది. ఈ వానలకు రోడ్లన్నీ జలయమయ్యాయి. కొండాపూర్ మండలం సైదాపూర్ నుంచి అనంతసాగర్ వెళ్లే రహదారి వరద కారణంగా కొట్టుకుపోయింది. దీంతో పలు గ్రామాలకు రాకపోకలు నిలియిపోయాయి. ఏడుపాయల వనదుర్గ అమ్మవారి దగ్గర మంజీరా నది ఉగ్రరూపం దాల్చింది. గర్భగుడిని ముంచెత్తి అమ్మవారి పాదాలను తాకుతూ ఉధృతంగా ప్రవహిస్తోంది. ఆనకట్ట నుంచి 85,396 క్యూసెక్కుల వరద నీరు దిగువకు విడుదల చేస్తున్నారు. ఏడుపాయల రెండో, మూడో బ్రిడ్జి వద్ద ప్రమాదకర స్థాయిలో నీటి ప్రవాహం ఉంది. కొల్చారం మండలం పోతంశెట్టి పల్లి నుంచి ఏడుపాయలకు వెళ్లే మొదటి బ్రిడ్జి వద్ద పోలీసులు బారీకేడ్లు ఏర్పాటు- చేశారు. ఏడుపాయల అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులు పాపన్నపేట మండలం నాగ్సాన్ పల్లి నుంచి వెళ్లాలని సూచిస్తున్నారు. ఇకపోతే జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షంతో జన జీవనం అస్తవ్యస్తంగా మారింది. జయశంకర్ భూపాలపల్లి జిల్లా వ్యాప్తంగా పలు వాగులు ఉప్పొంగడంతో వాహన రాకపోకలు నిలిచిపోయాయి. లోలైవల్ వంతెనల పైనుంచి వాగుల నీరు ప్రమాదకరంగా ప్రవహిస్తున్నాయి. మహాదేవపూర్ మండలం చంద్రపల్లి వాగు ఉధృతి పెరగడంతో అన్నారం, నాగపల్లి, మద్దులపల్లి, పలుగుల గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. కాటారం మండలం దామెరకుంట గుండ్రత్ పల్లి మధ్యలో అలుగు వాగు ఉప్పొంగి రాకపోకలు నిలిచాయి. మహాదేవపూర్, కాటారం, పలిమేల, మలహార్, మహా ముత్తరం మండలలో భారీ వర్షం కురుస్తుంది.

# బోయింగ్ మాజీ ఉద్యోగి బార్నెట్ మృతి

- కుటుంబంతో సెటిల్‌మెంట్ చేసుకున్న సంస్థ



న్యూయార్క్, సెప్టెంబర్ 27 (జనంసాక్షి) : బోయింగ్ విమానాల తయారీలో నాణ్యతా లోపాలను ఎత్తిచూపిన మాజీ ఉద్యోగి జాన్ బార్నెట్ అనుమానాస్పద మృతి అప్పట్లో సంచలనంకాగా, ఈ వ్యవహారాన్ని బోయింగ్ సెటిల్ చేసుకుంది. ఆయన మరణానికి కంపెనీ చర్యలు కారణమంటూ బార్నెట్ కుటుంబం వేసిన దావాను బోయింగ్ సెటిల్ చేసుకుంది. 50వేల డాలర్లు ఇచ్చి ఈ కేసు ముగించేందుకు అంగీకరించింది. అందులో 20వేల డాలర్లు చట్టపరమైన ఖర్చుల కింద చెల్లించనుంది. మిగిలినది కుటు-ంబ సభ్యులకు వెళ్లనుంది. బోయింగ్ 787 డ్రీమ్‌లైనర్ తయారు చేసే దక్షిణ చార్లెస్టన్ ప్లాంటులో బార్నెట్ 2010 నుంచి క్వాలిటీ-మేనేజర్‌గా పనిచేశారు. ఉద్యోగులకు కంపెనీ కొన్ని లక్ష్యాలను నిర్దేశిరచి వాటిని చేరుకోవడానికి గడువు విధిస్తోందని 2019లో ఓ ప్రముఖ మీడియా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో బార్నెట్ తెలిపారు. దీని వల్ల ఒత్తిడికి గురై నాణ్యత విషయంలో ఉద్యోగులు రాజీ పడాల్సి వస్తోందని ఆరోపించారు. కొన్ని విడిభాగాలను పాత విమానాల నుంచి తీసి కొత్త వాటికి బిగిస్తున్నారని చెప్పారు. మరోవైపు 787 డ్రీమ్‌లైనర్‌లో ఆక్సిజన్ వ్యవస్థలను పరీక్షించినప్పుడు 25 శాతం విఫలమయ్యాయని తెలిపారు. ఈ విషయాన్ని మేనేజర్ల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ.. ఎలాంటి చర్యలు తీసుకోలేదని వెల్లడించారు. నాణ్యత పరమైన అంశాల్లో ఆరోపణలకు సంబంధించిన పలు కేసులు కోర్టు పరిధిలో ఉన్నాయి. వాటిలో భాగంగా గత మార్చిలో విచారణకు హాజరుకావాల్సిన బార్నెట్ హోటల్ గదిలో విగతజీవిగా కనిపించారు. ఆ అనుమానాస్పద మృతిని తర్వాత ఆత్మహత్యగా నిర్ధారించారు. దాదాపు 32 ఏళ్ల పాటు- కంపెనీలో పనిచేసిన ఆయన 2017లో అనారోగ్య కారణాలతో ఉద్యోగ విరమణ చేశారు.

## అమ్మవారిని దర్శించుకున్న బాలయ్య

విజయవాడ, సెప్టెంబర్ 27 (జనంసాక్షి) : దేశవ్యాప్తంగా దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. విజయవాడలోని దుర్గమ్మ ఆలయంలోనూ ఉత్సవాలు కొనసాగుతున్నాయి. ఇంద్రకీలాద్రిపై ఆరో రోజు దుర్గమ్మ లలితా త్రిపుర సుందరీ దేవి అలంకరణలో భక్తులకు దర్శనమి స్తున్నారు. ఈ క్రమంలో సినీనటుడు, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. అమ్మవారిని దర్శించుకోవడం సంతోషంగా ఉందన్నారు. ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని, అందుకు దుర్గమ్మ ఆశీస్సులు అందరిపై ఉండాలని కోరుకున్నట్లు- ఆయన తెలిపారు.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at #119&120, 1st Floor, Down Town Mall, Lakdikapul, Hyderabad, Telangana-500004. Editor : M.M.RAHMAN RNINo. APTEL/2013/50370